అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 04-4-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 47 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు వెల : 6.50

సంఘ్ చేతిలో సైనిక్ స్కూళ్లు

62 శాతం కొత్త పాఠశాలలు ఆరెస్సెస్, బీజేపీ నేతలకు కేంద్రం అప్పగింత

- మోడీ సర్కారు తీరుపై విద్యావేత్తలు, మేధావుల ఆగ్రహం



న్యూఢిల్లీ : కొత్తగా ఏర్పాటు చేయబోయే సైనిక్ స్కూళ్లను కాషాయమయం చేసే యత్నాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్నది. 62 శాతానికి పైగా పాఠశాలలను సంఘ్, బీజేపీ నేతలు, వారి మిత్రులకు అప్పగించింది. ది రిపోర్టర్స్ కలెక్టివ్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

ఈ నివేదిక ప్రకారం.. కేంద్రం 62 శాతం కొత్త సైనిక్ పాఠశాలలను సంఘ్ పరివార్, బీజేపీ రాజకీయ నాయకులు, మిత్రులకు అప్పగించింది. "కేంద్ర ప్రభుత్వ పత్రికా ప్రకటనలు, సమాచార హక్కు (ఆర్టీఐ) ప్రత్యుత్తరాల నుంచి అందిన సమాచారం దీనిని తెలియజేస్తున్నది. ఇప్పటివరకు జరిగిన 40 సైనిక్ స్కూల్ ఒప్పందాలలో కనీసం 62 శాతం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)కు, దాని అనుబంధ సంస్థలు, బీజేపీ రాజకీయ నాయకులు, దాని రాజకీయ మిత్రులు, హిందుత్వ సంస్థలు, వ్యక్తులు, ఇతర హిందూ మత సంస్థలకు సంబంధించిన స్కూళ్లకు అప్పగించబడ్డాయి" అని కలెక్టివ్ వివరించింది. ప్రయివేటు వారిని ఎస్ఎస్ఎస్‌తో అనుబంధం పొందేందుకు, పాక్షిక ఆర్థిక సహాయాన్ని అందుకునేందుకు, వారి శాఖలను నిర్వహించటానికి ప్రభుత్వం అనుమతించటం సైనిక్ స్కూల్ విద్యా వ్యవస్థ చరిత్రలో ఇదే మొదటిసారి అని కలెక్టివ్ పేర్కొన్నది.

2021లో భారత్‌లో సైనిక్ పాఠశాలలను నిర్వహించటానికి కేంద్రం ప్రయివేటువారికి తలుపులు తెరిచింది. వార్షిక బడ్జెట్‌లోనూ భారత్ అంతటా 100 కొత్త సైనిక్ పాఠశాలలను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ విధంగా సైనిక్ స్కూళ్లను హేతుబద్ధత లేకుండా బీజేపీ తన మాతృ సంస్థకు, తమ నాయకులకు అప్పగించటం ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదని సామాజికవేత్తలు, విద్యా నిపుణులు అంటున్నారు. ఈ విషయంలో కేంద్రం వెనక్కి తగ్గి పారదర్శకతను పాటించాలని వారు సూచిస్తున్నారు.

కాషాయీకరణ ఆపండి!

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : సైనిక్ స్కూళ్లలో కాషాయీకరణ యత్నాలను విరమించుకోవాలని, వాటి జాతీయ, లౌకిక స్వభావాన్ని నిలబెట్టాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో సైనిక్ స్కూళ్ల నిర్వహణలో ప్రయివేటు రంగాల భాగస్వామ్యానికి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వీలు కల్పించడం పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సైనిక్ స్కూళ్లు సాంప్రదాయకంగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన సైనిక్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. దేశంలో ప్రతిష్టాత్మకమైన నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ...11లో



కేజ్రీవాల్‌ను ఇరికించటమే ఈడీ టార్గెట్

- స్టేట్‌మెంట్ ఇవ్వాలని అప్రూవర్లపై ఒత్తిడి : సింఘ్వీ
- సీఎంను అవమానించడమే ఈడీ లక్ష్యం
- కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై ఈడీ అభ్యంతరం
- ఢిల్లీ హైకోర్టులో ముగిసిన వాదనలు... తీర్పు రిజర్వ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో సీఎం కేజ్రీవాల్ కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాలని ఈడీ అప్రూవర్లుగా మారిన నిందితులను బలవంత పెట్టిందని కేజ్రీవాల్ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ ఢిల్లీ హైకోర్టులో వాదనలు వినిపించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు, ఆయన కుమారుడు రాఘవ, శరత్ చంద్రా రెడ్డిలు ఇచ్చిన వాంగ్మూలాలను ఈడీ ప్రధానంగా చూపిస్తోందని చెప్పారు. అయితే ఇందులో అప్రూవర్లుగా మారిన ఇద్దరు నిందితులు కేంద్రంలోని అధికార పార్టీతో లింక్ లు ఉన్నాయని పేర్కొన్నారు. లిక్కర్ స్కాంలో తన అరెస్ట్ సవాల్ చేస్తూ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ...11లో

ప్రమాదంలో కేజ్రీవాల్ ఆరోగ్యం

వివరాలు 11లో

భీతావహం

మెదక్ ఎస్‌బీ ఆర్గానిక్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం



- పేలిన రియాక్టర్, బాయిలర్ • ఏడుగురు మృతి, పలువురి పరిస్థితి విషమం, క్షతగాత్రుల ఆర్తనాదాలు
- క్షేత్రస్థాయికి వెళ్లిన కంపెనీ ఎండీ రవిశర్మ మృత్యువాత • కమ్మేసిన పొగ.. నేలమట్టమైన ఫ్యాక్టరీ
- భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్లే ప్రమాదం, ప్రాణ నష్టం • సంఘటనా స్థలాన్ని సందర్శించిన మంత్రి కొండా సురేఖ
- మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి: సీపీఐ(ఎం) • యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికుల మరణం : సీఐటీయూ

హృదయవిదారకం. ఊహించని పరిణామం. విధినిర్వహణలో నిమగ్నులైన కార్మికులు అగ్నికి ఆహుతి. అప్పటి వరకు ఉన్న కంపెనీ పూర్తిగా నేలమట్టం. విధి వైచిత్ర్యం అనేకన్నా, యాజమాన్య నిర్లక్ష్యం అనడమే కరెక్ట్. అంతపెద్ద కంపెనీలో భద్రతా ఏర్పాట్లు అరకొరే. ఈ విషయం తెలిసినా రెక్కాడితేకాని డొక్కాడని కష్టజీవులైన కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి, విధులు నిర్వహిస్తున్నారు. ఏమైందో ఊహించేలోపే క్షణాల్లో మంటలు చెలరేగి బాయిలర్ పేలిపోయింది. ఆ వెంటనే ఒకటొకటిగా రియాక్టర్లు పేలాయి. పొగ కమ్మేసింది. కంపెనీ నేలమట్టమైంది. ఏడుగురు కార్మికులు మాంసం ముద్దలై పోయారు. ఏం జరిగిందో అని లోపలికి వెళ్లిన కంపెనీ ఎమ్‌డీ రవిశర్మ కూడా అగ్నికి ఆహుతై పోయారు. మరికొందరు కార్మికులు క్షతగాత్రులై చేస్తున్న ఆర్తనాదాలు గుండెలను పిండేశాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొనేలోపే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామ పరిధిలోని ఎస్‌బీ ఆర్గానిక్ కెమికల్ ఫ్యాక్టరీలో బుధవారం సాయంత్రం 4.30 గంటలకు చోటుచేసుకున్న విషాదకర అగ్నిప్రమాద సంఘటన ఇది...

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి/హత్నూర

20 ఏండ్ల క్రితం స్థాపించిన మందు గోలీలకు ఉపయోగించే పౌడర్ తయారయ్యే ఎస్‌బీ కెమికల్ కంపెనీ.. దశల వారీగా విస్తరించింది. ప్రస్తుతం కంపెనీలో 150 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో అత్యధిక మంది హత్నూర మండల ...10లో

ఘటనపై సీఎం దిగ్భ్రాంతి..

- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

ఎస్‌బీ పరిశ్రమలో పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలపై సమీక్షించిన సీఎం.. వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

కష్టపడండి.. విజయం మనదే..!

మెదక్ సీటు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం

- ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించిన స్థానమిది : సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెదక్ లోక్‌సభ నియోజక వర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో మెదక్ లోక్‌సభ స్థానంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానం కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకమని పేర్కొన్నారు. మెదక్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో ...11లో

వయనాడ్ నుంచి రాహుల్ నామినేషన్

- సోదరి ప్రియాంక తోడుగా.. భారీప్రదర్శనగా వెళ్లి..



వయనాడ్: కేరళలోని వయనాడ్ పార్లమెంటు స్థానం నుంచి మరోసారి ఎంపీగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. తన సోదరి ప్రియాంక గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ...11లో

మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుకు కస్టడీ

- ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో నిందితుడు అదనపు ఎస్పీ వేణుగోపాల్‌రావుని విచారిస్తున్న స్పెషల్ టీం



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో కలకలం రేపిన ప్రతిపక్ష నాయకుల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిందితుడు నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావును ...11లో

తాగునీటికి అవస్థ

- మండుతున్న వేసవి.. అడుగంటిన నీళ్లు
- రబీ పంటలకూ కొరతే
- పర్యవేక్షణకు ప్రత్యేకాధికారుల నియామకం
- ఉమ్మడి జిల్లాలవారీగా ఐఏఎస్‌లకు బాధ్యతలు

వివరాలు 2లో..

ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదు

- పార్టీల గేట్లు కాదు.. ప్రాజెక్టుల గేట్లు ఎత్తండి...: ముఖ్యమంత్రి రేవంత్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన
- కాంగ్రెస్ సర్కారుకు నీటి నిర్వహణ చేతకాదంటూ ఎద్దేవా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ముఖ్యమంత్రి రేవంత్... ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలపై అడ్డగోలు విమర్శలు చేయటంమాని, వాటర్ ట్యాపింగ్ (మంచి నీటి సరఫరా)పై దృష్టి సారిస్తే మంచిది...' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తాము అధికారం కోల్పోయే నాటికి రాష్ట్రంలోని జలాశయాలన్నీ నిండుకుండల్లా ఉన్నాయని ఆయన తెలిపారు. అయితే నీటి ...2లో

కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ లీగల్ నోటీసులు

క్షమాపణ చెప్పాలని డిమాండ్

- వారంలోగా జవాబు చెప్పకుంటే పరువు నష్టం దావా వేస్తానంటూ హెచ్చరిక

వివరాలు 2లో..

పదేండ్లు అధికారంలో మీరే కదా..

వంద రోజుల పాలకులను అడగటం బాధాకరం

- ఫోన్ ట్యాపింగ్‌లో అందరూ బయటకు వస్తారు
- బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్
- సర్వేల ఆధారంగానే కాంగ్రెస్ ఎంపీ టిక్కెట్లు : మంత్రి శ్రీధర్‌బాబు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వంద రోజుల్లో కాంగ్రెస్ పాలకులు ఏం చేశారని పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నేతలు విమర్శించడం బాధాకరమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌లో ప్రతి ఒక్కరు బయటకొస్తారని తెలిపారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలకు అనుమానాలు అక్కర్లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనవసర వ్యాఖ్యలు చేయడం తగదని హెచ్చరించారు. బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్‌గా మారిందని విమర్శించారు. సర్వేల ఆధారంగానే కాంగ్రెస్ అభ్యర్థులకు ఎంపీ టిక్కెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. పెద్దపల్లి నియోజకవర్గ అభ్యర్థి గడ్డం వంశీని అందరం కలిసి కట్టుగా పని చేసి గెలిపిస్తామన్నారు. బుధవారం హైదరాబాద్ బేగంపేటలోని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలు వినోద్, వివేక్ వెంకటస్వామి, ...11లో


తైవాన్‌లో తీవ్ర భూకంపం

- 9 మంది మృతి, 900 మందికి పైగా గాయాలు
- డజన్ల సంఖ్యలో గల్లంతు - పేకమేడల్లా కూలిన భవనాలు



హ్యాలిన్ (తైవాన్) : గత 25ఏండ్లలో ఎన్నడూ లేని రీతిలో తైవాన్‌లో బుధవారం తీవ్ర భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతగా నమోదైన ఈ భూకంపంలో ఇప్పటివరకు 9 మంది మరణించారు. 900 మందికి పైగా గాయపడ్డారు. జాతీయ పార్క్‌కు వెళ్ళే దారిలో గల ఒక హోటల్‌లో దాదాపు 50 మంది కార్మికుల ఆచూకీ గల్లంతయినట్లు అధికారులు భావిస్తున్నారు. మైనింగ్ ఏరియాలో మరో 80 మంది చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. అయితే వారు గని లోపల వున్నారా లేక బయటా అనేది వెంటనే తెలియరాలేదు. భూకంప తీవ్రతకు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. భూకంప నాభి తూర్పు కౌంటీ హ్యాలిన్‌లో వుంది. భూమిలోపల 15.5 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించింది. అందువల్ల ఈ ప్రాంతంలో విధ్వంసం తీవ్రత బాగా కనిపిస్తోంది. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో అందరూ పనులకు, పాఠశాలలకు వెళ్ళే హడావిడిలో వుండగా ఈ విపత్తు సంభవించింది. భవన శిథిలాల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక బృందాలు ...11లో

ఏడిపిస్తున్న ఎర్ర బంగారం



నిండిన కోల్డ్ స్టోరేజీలు

- ఎగుమతి లేదంటూ ధరలు తగ్గిస్తున్న వ్యాపారులు
- కేంద్రం విధానాలతో రైతులకు తీవ్ర నష్టం

నవతెలంగాణ-కాశీబుగ్గ

ఆసియాలోనే అతిపెద్ద రెండవ మార్కెట్ అయిన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఎర్ర బంగారంతో కళకళలాడుతున్నా ధరలు లేక రైతులు కంట నీరు పెడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంటను మార్కెట్‌కు తీసుకొస్తే గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు దక్కడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటసాగుకు ఆరంభం నుంచి లక్షలాది రూపాయలు ఖర్చు చేసినట్టు వాపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు రెట్టింపైనా పంట విక్రయిస్తే అందులో సగం కూడా వచ్చే పరిస్థితి లేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎగుమతి విధానంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్రం వైఖరి పట్ల వారు తీవ్రంగా మండిపడుతున్నారు. మార్కెట్‌లో మిరప ఎగుమతి లేకపోవడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొంటున్నారు.

వరంగల్ మార్కెట్‌కు భారీగా మిర్చి రాక..తగ్గిన ధరలు

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లా నుండే కాకుండా ఆదిలాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, చెన్నూరు, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నల్లగొండ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రైతులు ఎక్కువ సంఖ్యలో తమ పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు వస్తుంటారు. గతేడాదితో పోలిస్తే ఈసారి పంట దిగుబడి పెరిగినా ధరలు మాత్రం చాలా తగ్గాయి. గతేడాది జనవరి నెలలో 53,025 క్వింటాళ్ల (1,32,564 బ్యాగ్స్) మిర్చి రాగా గరిష్ఠ ధర రూ.81,000 పలికింది. ఈ ఏడాది జనవరిలో 1,24,163 క్వింటాళ్లు (3,07,439 బ్యాగ్స్) రాగా ధర రూ.24,000 మాత్రమే పలుకుతోంది. గతేడాది మార్చిలో మార్కెట్‌కు 2,83,929 క్వింటాళ్లు (7.09,823 బ్యాగ్స్) మిర్చి రాగా ధర గరిష్ఠంగా రూ.80,000 పలకగా, ఈ ఏడాది మార్చిలో 3,12,260 క్వింటాళ్లు (7,80,651 బ్యాగ్స్) అమ్మకానికి తీసుకురాగా ధర గరిష్ఠంగా రూ.21,200 పలికింది.

నిండిన కోల్డ్ స్టోరేజీలు...

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో మొత్తం 25 కోల్డ్ స్టోరేజీలు ఉండగా అందులో ...11లో

నవతెలంగాణ
గురువారం 04 ఏప్రిల్ 2024

రెండు నెలలుగా నిలిచిన విజయ పాల బిల్లులు

- ఆగ్రహంతో రోడ్డెక్కిన పాడి రైతులు
- ఇరువైపులా నిలిచిన వాహనాల రాకపోకలు



నవతెలంగాణ-కోటగిరి

విజయ పాలకేంద్రం రెండు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాడి రైతులు ఆందోళన చేపట్టారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 68 మంది రైతులు విజయ పాల కేంద్రంలో ప్రతిరోజూ 350 లీటర్ల పాలను పోస్తున్నట్టు తెలిపారు. 15 రోజులకు ఒకసారి సుమారు రూ.మూడున్నర లక్షల విలువగల బిల్లులు చెల్లించవలసి ఉంటుందని, కానీ ఇప్పటివరకు మూడు బిల్లులు కూడా రాకపోవడంతో రుణాలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముద్ర లోన్ ద్వారా రుణం తీసుకున్నామని, బ్యాంక్ అధికారులు రుణాలు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. డబ్బులు లేక పాడిపశువులకు సరైన దాణా తీసుకురాలేక పోతున్నామని, దాంతో పాల దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. పాల బిల్లు రాకపోవడంతో అన్ని రకాల ఇబ్బందులకు గురవుతున్నామని, పాల కేంద్రం అధ్యక్షులు పలుమార్లు విజయ పాల కేంద్రం జిల్లా అధికారికి తెలియజేసినప్పటికీ స్పందన లేకపోవడంతో రోడ్డెక్కినట్టు తెలిపారు. బిల్లులు సకాలంలో రాక అప్పుల పాలవుతున్న తమను ఇప్పటికైనా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, సుమారు గంటసేపు రాస్తారోకో నిర్వహించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పాఠశాల బస్సులు, పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సందీప్ ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను అధికారులకు తీసుకెళ్తానని రాస్తారోకో విరమించమని కోరడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ విషయంపై ఎస్ఐ సందీప్ పాల కేంద్రం పీడీ నందకుమారిని వివరణ కోరగా.. ఆలస్యమైన మాట వాస్తవమేనని బుధవారం సాయంత్రానికి ఒక బిల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా వెంటనే బిల్లు మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఆందోళనలో శ్రీధర్, రమేష్, రవి, తదితర రైతులు పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో మిర్చి రైతు మృతి

- భయాందోళనలో ప్రజలు
- అడవిలోకి మళ్లించేందుకు అధికారుల యత్నం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఏనుగు దాడి చేయడంతో రైతు ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం బూరెపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. మహారాష్ట్ర ప్రాణహిత నది సరిహద్దు నుంచి ఏనుగు బూరెపల్లి గ్రామ శివారులోకి ప్రవేశించింది. రైతు అల్లూరి శంకర్(45) మిర్చి తోటలో భార్యతో కలిసి పనిచేస్తున్న క్రమంలో ఏనుగు తోటలోకి వచ్చింది. దాన్ని చూసి శంకర్ భార్య అరుస్తూ, కేకలు వేస్తూ పరిగెత్తగా.. ఆయన తోటలోనే మిర్చి చెట్ల కింద అనిగి కూర్చున్నాడు. కానీ ఏనుగు ఒకేసారి ఆయనపై దాడి చేసింది. దీంతో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని స్థానికులు అటవీశాఖ అధికారులకు చేరవేశారు. డీఎఫ్ఓ నీరజ్ కుమార్, కౌటాల సీఐ సాదిక్ పాషా ఆధ్వర్యంలో ఏనుగును తిరిగి మహారాష్ట్ర అడవికి మళ్లించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఏనుగు బూరెపల్లి నుంచి రన్వెల్లి, గంగాపూర్ ప్రాణహిత చేవెళ్ల కెనాల్ వెంబడి వెళ్తూ కర్జల్లి, చింతలమానేపెల్లి గ్రామాల పొలాల్లోకి వచ్చినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా, తమకు సహకరించాలని అధికారులు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏనుగును మహారాష్ట్ర మళ్లించే ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు.

మార్చిలో ఎయిర్ పోర్టులో.. 12 కిలోల బంగారం పట్టివేత

- 27 కేసులు నమోదు



బంగారం స్వాధీనం చేసుకున్న దృశ్యం

నవతెలంగాణ - శంషాబాద్

మార్చి నెలలో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెద్ద ఎత్తున బంగారం పట్టుబడింది. దీనిపై ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ అధికారులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ రూపాల్లో ఎయిర్‌పోర్టుకు ప్రయాణికులు అనధికారికంగా తీసుకువచ్చిన 12 కిలోల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్చి నెలలో అక్రమంగా బంగారం తరలిస్తున్న నిందితులపై 27 కేసులు నమోదు చేశారు. ప్రధానంగా నిందితులు చెక్ ఇన్ బ్యాగేజీ, శరీర అంతర్గత భాగాల్లో రహస్యంగా దాచి ఉంచగా, వస్తువుల్లో దాచడంతో పాటు వస్తు రూపంలోకి మార్చుకొని పేస్టులా తయారుచేసినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో కస్టమ్స్ అధికారులు ముందస్తు సమాచారం మేరకు అప్రమత్తమై లేదా తనిఖీల్లో భాగంగా గుర్తించి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, 27 కేసుల్లో నిందితులనూ అరెస్టు చేశారు.

2023-24 వార్షిక సంవత్సరంలో 132 కిలోల బంగారం సీజ్ చేశారు. అక్రమంగా బంగారం తరలిస్తున్న కారణంగా 247 కేసులు నమోదు చేసి 31 మందిని అరెస్టు చేశారు.

కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ లీగల్ నోటీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై అవాస్తవాలను ప్రచారం చేశారంటూ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కేకే మహేందర్ రెడ్డిలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం లీగల్ నోటీసులు పంపించారు. ట్యాపింగ్ అంశంలో పదే పదే తన పేరును వారు కుట్రపూరితంగా ప్రస్తావిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా మాట్లాడుతున్న వీరిపై న్యాయపరమైన చర్యలు తీసుకోనున్నట్టు కేటీఆర్ తెలిపారు. వీరితో పాటు తన పేరును ప్రస్తావిస్తూ అసత్యాలు ప్రచారం చేసిన మరికొన్ని మీడియా సంస్థలకు, యూట్యూబ్ ఛానళ్లకు ఆయన మరోసారి నోటీసులు పంపించారు. తనకు సంబంధం లేని అంశంలో తన పేరును, తమ పార్టీ పేరును ప్రస్తావిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి అయినా సరే వదిలిపెట్టేదే లేదని తేల్చిచెప్పారు. వారం రోజుల్లోగా క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా వేస్తామని ఆయన నోటీసుల్లో హెచ్చరించారు.

ప్రజాస్వామ్యమా...నీవెక్కడ?

- అరెస్టులు...నిర్బంధాలు... వేధింపులతో ప్రతిపక్షాల ఉక్కిరిబిక్కిరి
- నోటీసులు...ఖాతాల స్తంభనతో అష్టదిగ్బంధం
- కరపత్రాలు, పోస్టర్లకూ డబ్బు లేని దుస్థితి
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న రాజ్యాంగ సంస్థలు



న్యూఢిల్లీ: దేశంలో ప్రజాస్వామ్యం అంతరించిపోతోందా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఈ ప్రశ్నకు అవుననే సమాధానం వస్తోంది. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు ప్రభుత్వంలోని అన్ని విభాగాలు...పాలనా యంత్రాంగం, పోలీసులు, ఈడీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఆదాయపన్ను శాఖ ... తమ వంతు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. న్యాయ వ్యవస్థ సైతం కొంత మేర ఇందులో భాగస్వామి అవుతోంది.

వెంటాడి...వేటాడుతూ

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఉప ముఖ్యమంత్రి, ఇద్దరు మంత్రులు సైతం కటకటాలు లెక్కబెడుతున్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత పరిస్థితి కూడా అంతే. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ రెండు నెలలుగా జైలు జీవితం గడుపుతున్నారు. మిగిలిన ప్రతిపక్ష నేతలను కూడా ఏ క్షణంలో అయినా, ఏ కారణం చేతనైనా అరెస్ట్ చేయవచ్చు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రినాటేను మహిళా కమిషన్, ఎన్నికల కమిషన్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, కేంద్ర ప్రభుత్వానికి చెందిన అన్ని విభాగాలు కొంతకాలంగా వెంటాడుతు న్నాయి. ఆమెను జైలుకు పంపేందుకు ప్రయత్నిస్తున్నాయి. సుప్రియ సోషల్ మీడియా అకౌంటులో వచ్చిన ఓ వ్యాఖ్య దీనింతటికీ కారణం. తన సోషల్ మీడియా అకౌంటును దుర్వినియోగం చేసి, ఎవరో ఈ వ్యాఖ్య పెట్టారని ఆమె వివరణ ఇచ్చారు. అందుకు క్షమాపణ కూడా చెప్పారు. ఆ వ్యాఖ్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని పదేపదే అన్నారు. అయినా ఆమెను వదలడం లేదు.

పార్టీలనూ వదలడం లేదు

నాయకులనే కాదు...పార్టీలనూ కేంద్ర దర్యాప్తు సంస్థలు, అధికారులు వదిలిపెట్టడం లేదు. రూ.11 కోట్ల పన్ను బకాయి చెల్లించాలంటూ సీపీఐకి నోటీసు ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్‌కు ఏకంగా పదిహేను నోటీసులు అందాయి. రూ.1,800 కోట్ల పన్ను బకాయిలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీకి తాఖీదు పంపారు. తనకు రావాల్సిన బకాయిలు రాబట్టుకునేందుకు అంతకుముందే ఆదాయపన్ను శాఖ కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసింది. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. మీ బ్యాంక్ ఖాతా నుండి ఏ ప్రభుత్వ విభాగమైనా ఎలా సొమ్మును విత్‌డ్రా చేసుకుంటుంది? ఆదాయపన్ను శాఖకు బీజేపీ ఏమైనా బకాయి పడిందా అనే విషయంపై ఏ కార్పొరేట్ మీడియా సంస్థ అయినా అధికారులను ప్రశ్నిస్తోందా?

బీజేపీలో కలిసిపోయిన ప్రభుత్వ విభాగాలు

ఈవీఎంలపై కూడా నిపుణులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ ఎన్నికల కమిషన్ మాత్రం తన వైఖరిని ఏ మాత్రం మార్చుకోవడం లేదు. ఎన్నికల ప్రక్రియే అవినీతిలో కూరుకుపో యినప్పుడు, పక్కదారి పట్టినప్పుడు ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని ఎలా ఆశించగలం? దేశంలో కార్పొరేట్ మీడియా గత పది సంవత్సరాలుగా బీజేపీ కొమ్ము కాస్తోంది. ప్రతిపక్షాల వాణిని వినిపించకుండా చేస్తోంది. అధికార పార్టీ నిరంకుశంగా వ్యవహరించినప్పుడు మిగిలిన సంస్థలు కలసికట్టుగా ప్రజాస్వామ్య, రాజ్యాంగ ప్రక్రియల రక్షణకు నడుం బిగించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రభుత్వంలోని అన్ని అంగాలూ బీజేపీలో కలిసిపోతే ఇక అడిగేవారెవరు? చివరికి సైనికాధికారులు కూడా బీజేపీ భాషలోనే మాట్లాడుతున్నారు. ఇది ఆశ్చర్యకరం, ఆందోళనకరం.

జైలా ? దర్యాప్తు సంస్థ కార్యాలయమా?

ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇప్పటి వరకూ లోక్‌సభ ఎన్నికలను అవినీతిమయం చేశాయంటూ ప్రభుత్వాలపై ఆరోపణలేవీ రాలేదు. అధికార పార్టీకి తప్పనిసరిగా కొన్ని ప్రయోజనాలు ఉంటాయి. అయినా ప్రతిపక్షాల విషయంలో నిష్పాక్షికంగానే వ్యవహరించే వారు. దేశంలో నియంతలా పేరు తెచ్చుకున్న ఇందిరాగాంధీ సైతం ఎమర్జెన్సీ తర్వాత ప్రతిపక్ష నాయకులను జైళ్ల నుండి విడుదల చేశారు. ఇప్పుడు ప్రతిపక్ష నాయకులు జైలులోనో లేదా దర్యాప్తు సంస్థల కార్యాలయాలలోనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

సర్కారు సొమ్ముతో ప్రచారం

ఇన్ని కుట్రలు, కుతంత్రాలు చేస్తూ బీజేపీకి పోటీయే లేదని చెప్పుకుంటున్నారు. ప్రధానమంత్రికి విశేషంగా ప్రచారం కల్పిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత మోడీ భూటాన్‌లో పర్యటించి ప్రభుత్వ అవార్డును అందుకున్నారు. ఆ విధంగా ఆయన ప్రభుత్వ సొమ్ముతో ప్రచారం చేసుకుంటున్నారు.

నిధుల కొరతలో కాంగ్రెస్

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలోనే ఆదాయపన్ను శాఖ నిద్ర లేచినట్లు కన్పిస్తోంది. ఎన్నికల ప్రచారం కోసం రాజకీయ పార్టీలు వనరుల సమీకరణకు ప్రయత్నిస్తున్న తరుణంలోనే ఈ శాఖ రంగంలోకి దిగింది. దానికి డబ్బు కావాలి. దానితో పాటు తమ అధినేతల ప్రాపకం కూడా కావాలి. చివరికి పరిస్థితి ఎలా తయారైందంటే పార్టీ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి జీతాలు చెల్లించడానికి కాంగ్రెస్ వద్ద డబ్బే లేకుండా పోయింది. ఎన్నికల ప్రచారానికీ సొమ్ము లేదు. కనీసం కరపత్రాలు, పోస్టర్లు ముద్రించడానికి లేదా నేతల రైలు, విమాన ప్రయాణ టిక్కెట్లు కొనుగోలు చేయడానికి కూడా పైసలు లేని పరిస్థితి.

ప్రతిపక్షాల చేతులు కట్టేసి...

ఐదు సంవత్సరాల విచారణ తర్వాత ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది...అది కూడా సార్వత్రిక ఎన్నికలకు ముందు. అప్పటికే బీజేపీ ఖాతాలో వేల కోట్ల రూపాయలు జమ అయ్యాయి. ఆ విషయంలో ప్రతిపక్ష పార్టీలు దానితో పోటీ పడలేకపోయాయి. ఒకవేళ ఆయా పార్టీలకు కొద్దో గొప్పో నిధులు అందినా వాటిని దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకుంటున్నాయి.

ఇప్పుడు ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. కానీ జరుగుతోంది ఏమిటి? ప్రతిపక్షాల చేతులు కట్టేశారు.

ఇక ఆయా పార్టీల నాయకులు ప్రచారంలో బీజేపీతో ఎలా పోటీ పడగలరు?

ప్రశ్నించలేకపోతున్న మీడియా, ఈసీ

పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయడానికి నాయకులు ఓ వైపు సంసిద్ధులవుతుంటే మరోవైపు వివిధ దర్యాప్తు సంస్థలు ఒక దాని వెంట మరొకటి సమన్లు జారీ చేస్తూ చీకాకు కలిగిస్తు న్నాయి. తమ ఎదుట హాజరు కావాలంటూ తాఖీదులు పంపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిపక్ష నేతలు ఇక ఎలా ప్రచారానికి వెళతారు? ఇంత జరుగుతుంటే ప్రజలు మౌనంగా చూస్తూ ఉండి పోవాల్సిందేనా? కార్పొరేట్ మీడియా ఎందుకు ప్రశ్నించదు? ఆ సంస్థలను ఎన్నికల కమిషన్ ఎందుకు నియంత్రించదు? న్యాయస్థానాలు ఎందుకు జోక్యం చేసుకోవు? దాడులు, ఆంక్షలు, అరెస్టులు, వేధింపులు ఎదుర్కొంటున్న ప్రతిపక్ష నేతలు తమ తమ పార్టీలను వదిలేసి ఎందుకు వెళ్లిపోతున్నారో, ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారో అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు.

కాంగ్రెస్ అంటేనే లీకులు, ఫేక్ న్యూస్‌లు

- పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని బొంద పెట్టాలి
- బీఆర్ఎస్‌ను వీడిన వారికి మూడో స్థానమే : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ -భువనగిరి

కాంగ్రెస్ అంటేనే లీకులు.. ఫేక్ న్యూస్‌లు.. పాలన గాలికొదిలేసి అక్రమ కేసులతో కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండమని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, కానీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ బయటికి రాగానే రాష్ట్రంలో కాల్వల్లో నీళ్లు పారుతున్నాయని తెలిపారు. ఎన్నికల కోడ్ సాకుతో హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మాట తప్పిందన్నారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. కార్యకర్తలు కాంగ్రెస్ మోసాలను గ్రామాల్లో విడమర్చి చెప్పాలన్నారు. కొంత మంది స్వార్థపరులు పార్టీని వీడి పోతున్నారని, వాళ్లను ప్రజలు నమ్మడం లేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తేనే 6 గ్యారంటీల పథకాలు అమలవుతాయని అన్నారు. నలభై రోజులు కష్టపడితే భువనగిరిలో గెలుస్తామన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిందన్నారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ టికెట్ పై పోటీ చేస్తున్న దానం నాగేందర్, కడియం కావ్య, రంజిత్ రెడ్డి, పట్నం సునీత మూడో స్థానంలో ఉంటారని జోస్యం చెప్పారు.

స్వార్థపరులే పార్టీలు మారుతున్నారని, వారిని ఓడించాలని కార్యకర్తలు కసితో ఉన్నారని అన్నారు. ప్రజల మాస్ లీడర్, బలహీన వర్గాల నాయకుడు క్యామ మల్లేష్ భువనగిరిలో తప్పకుండా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. స్వయానా రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేసి పార్టీ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తి భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో కొట్లాడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేనని చెప్పారు. కొంత మంది పార్టీ వీడి పోతే నష్టమేమి లేదన్నారు. పార్టీ వదిలి పోయిన వారు కాళ్లు పట్టుకొని బతిమిలాడినా మళ్లీ వారిని పార్టీలో చేర్చుకోమన్నారు.

ఈ భూమి ఉన్నంత కాలం బీఆర్ఎస్ ఉంటుందని, కార్యకర్తలు అంతా ఉద్యమ స్ఫూర్తితో పోరాటం చేయాలన్నారు.

ఈ సమావేశంలో భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జెడ్పీ చైర్మెన్ సందీప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, నాయకులు బడుగుల లింగయ్య యాదవ్, కర్నె ప్రభాకర్, పొన్నాల లక్ష్మయ్య, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణ చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల ప్రస్తుతం రాష్ట్రంలో తాగు, సాగు నీటికి కొరత ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రిజర్వాయర్లలోని నీటిని వెంటనే వదిలి, హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లోని ప్రజల దాహార్తిని తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద తదితరులతో కలిసి కేటీఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ తాగునీటికి తండ్లాట మొదలైందని ఆయన ఈ సందర్భంగా వాపోయారు. దీంతో ప్రజల గొంతెండి పోతుంటే, సీఎం రేవంత్ గొంతు చించుకుని బూతులు తిడుతున్నారని విమర్శించారు. మహిళలు ఖాళీ బిందెలతో నిరసనలు తెలుపుతుంటే, ముఖ్యమంత్రి లంకెల బిందెల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి ధనరాశులను తరలిస్తున్న రేవంత్‌కు, జనానికి జలరాశులు తరలించే ఓపిక లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాము ప్రజల అవసరాలను ఎలా తీర్చాలనే అంశంపై దృష్టి సారిస్తే, ఇప్పటి కాంగ్రెస్ సర్కార్ మాత్రం చేరికలపై దృష్టి సారించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తండాల నుంచి మొదలుకుని హైదరాబాద్ దాకా ఏ ఒక్క రోజూ తాగునీటికి ఇబ్బందులు రానివ్వలేదని చెప్పారు. తమ ప్రభుత్వం మంచినీళ్లను మానవ హక్కుగా భావించిందని అన్నారు. అందుకే రూ.38 వేల కోట్లతో మిషన్ భగీరథను చేపట్టి, పూర్తి చేశామని వివరించారు. 50 ఏండ్లపాటు హైదరాబాద్‌కు తాగునీటి కొరత లేకుండా చేశామన్నారు. రేవంత్ సర్కార్‌కు ఆయా పథకాల నిర్వహణ కూడా సాధ్యం కావటం లేదని విమర్శించారు.

కేసీఆర్ పాలన ముగియగానే రాష్ట్రంలో ఇన్వెర్టర్లు, జనరేటర్లతోపాటు వాటర్ ట్యాంకర్ల దందా మొదలైందని కేటీఆర్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు సాధారణ రేట్ల కంటే మూడు నాలుగు రెట్లు అధికంగా డబ్బులు వెచ్చించి, ట్యాంకర్లను బుక్ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. గతేడాది సాధారణం కంటే 14 శాతం అధికంగా వర్షాలు పడ్డాయని గుర్తు చేశారు. అయినా తాగునీటికి కొరత ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు. నాగార్జున సాగర్, ఎల్లంపల్లి, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లలో నీళ్లు ఉన్నా... ప్రజలు ట్యాంకర్లను బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు తలెత్తిందంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేఆర్ఎంబీకి రాష్ట్ర ప్రాజెక్టులను అప్పగించటం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించారు. తాగునీటి కోసం ఇప్పుడు ఢిల్లీ వద్ద బిచ్చమెత్తుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 75 శాతం పూర్తయిన సుంకిశాలను కాంగ్రెస్ సర్కార్ పక్కనబెట్టిందని విమర్శించారు. మరోవైపు కేసీఆర్ మీద రాజకీయ కక్షతో కాళేశ్వరాన్ని విఫల ప్రయోగంగా చూపిస్తున్నారని దుయ్యబట్టారు. అది విఫలమైతే... హరీశ్‌రావు హెచ్చరికలతో ఇప్పుడు మళ్లీ అక్కడి పంప్ హౌస్‌లు ఎట్లా ప్రారంభమయ్యాయని ప్రశ్నించారు.

హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేయలేదు కాబట్టే.. వారికి సీఎం రేవంత్ తాగు నీరివ్వకుండా కక్ష గట్టారని కేటీఆర్ విమర్శించారు. ట్యాంకర్ బుక్ చేసుకుంటే 12 గంటల్లో నీటిని సరఫరా చేస్తున్నామని చెబుతున్న సీఎం... అసలు ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటి వరకూ 2.30 లక్షల ట్యాంకర్లు బుక్కయ్యాయనీ, ఆ మేరకు ప్రజలపై భారం పడిందని చెప్పారు. ఆ భారాన్ని సీఎం భరిస్తారా..? లేక కాంగ్రెస్ భరిస్తుందా..? అని నిలదీశారు. ఆ పార్టీ ఏలుబడిలో ఉన్న బెంగళూరులో నీటిని వృథా చేస్తే జరిమానాలు విధిస్తున్నారనీ, మరి ప్రజల గొంతుల్ని ఎండబెట్టిన రేవంత్‌కు ఎన్ని జరిమానాలు వేయాలంటూ ప్రశ్నించారు. తక్షణమే రిజర్వాయర్లలోని నీటిని విడుదల చేసి, ప్రజల దాహార్తిని తీర్చాలని డిమాండ్ చేశారు. ట్యాంకర్లతో నీటిని ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. ప్రజలకు నీటి బిల్లులు రాకుండా చూడాలనీ, బకాయిలు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే జలమండలి ముందు ధర్నాలు చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకెలాంటి సంబంధమూ లేదని కేటీఆర్ వివరణిచ్చారు. ఈ విషయమై అడ్డగోలుగా మాట్లాడితే... ముఖ్యమంత్రినైనా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. హీరోయిన్లను తాను బెదిరించినట్టు కొందరు అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారనీ, వారు తమ పద్ధతి మార్చుకోకపోతే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ ప్రభుత్వ హయాంలో ఇంటిలిజెన్స్, ఇతర పోలీసు విభాగాలకు సంబంధించిన అధికారులుగా శివధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రవిగుప్తా ఉన్నారని గుర్తు చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఒక్క కేసీఆరే బాధ్యుడా..? ఈ అధికారులెవరు బాధ్యులు కాదా..? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్‌కు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా... 2004 నుంచి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గత సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తమ ఫోన్లను ట్యాప్ చేశారంటూ ఆనాటి కాంగ్రెస్ నేతలే స్వయంగా ఆరోపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఎంతమాత్రం ప్రేమ లేదని విమర్శించారు. దాదాపు రెండొందల మంది అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నా సర్కారు పట్టటం లేదని వాపోయారు. సంబంధిత జాబితాను ప్రభుత్వానికి పంపుతామని వివరించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటికి అవస్థ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రమంతటా తాగునీటి ఎద్దడి రోజురోజుకు తీవ్రమవుతున్నది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమస్య తీవ్రరూపం దాలుస్తున్నది. రాజధాని హైదరాబాద్‌లోనూ ఇదే దుస్థితి. వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాల నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాల వారీగా 10 మంది ఐఏఎస్ అధికారులను నియమించింది. ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని వారికి అధికారాలిచ్చింది. ప్రత్యామ్నాయ వనరులను అన్వేషించాలని ఆదేశించింది. రాష్ట్రంలో తాగునీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాలనీ, జులై చివరి వరకు ఈ ప్రత్యేక అధికారులు సెలవు పెట్టకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాష్ట్రంలో గత ఆరు నెలల్లో వర్షాభావ పరిస్థితులతో పాటు ప్రస్తుత ఎండల తీవ్రత కారణంగా జలాశయాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ప్రధాన జలాశయాలు తాగు అవసరాలకు మినహా సాగుకు ఎంతమాత్రం నీటిని ఇవ్వలేని పరిస్థితి (డెడ్ స్టోరేజీ)కి చేరాయి. భూగర్భ జలమట్టాలు సైతం గత పదేండ్లల్లో ఎన్నడూ లేనిస్థాయిలో పడిపోయాయి. ఈ నేపథ్యంలో నీటి వథాను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర జనాభా దాదాపు నాలుగు కోట్లు. హైదరాబాద్‌లోనే దాదాపు సగం వరకు నివసిస్తారు. వీటికితోడు ఏజెన్సీలోనూ మంచినీటి సమస్య ముందుకొచ్చింది.

ప్రత్యేక అధికారుల నియామకంతో తాగునీటి సమస్య అధికం కాకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఆమేరకు ఇప్పటికే సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు సమీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదే పదే కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కొంతమేర ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నా ఫలితం లేకుండాపోయింది. వర్షపాతం సాధారణం కంటే ఈమారు 14 శాతం తక్కువగా ఉన్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఉత్తర తెలంగాణతోపాటు దక్షిణ తెలంగాణలోనూ నీటి ఎద్దడి తప్పడం లేదు. మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లోనూ సమస్య తలెత్తింది. వరంగల్, నల్లగొండతోపాటు ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో పరిస్థితులు మరింత దిగజారాయి. ఉట్నూర్ నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో సమస్య విలయతాండవం చేస్తున్నది. జైనూర్, కెరామెరి, ఆసిఫాబాద్, వాంకిడి, సిర్పూర్ పట్టణం, తిర్యాని తదితర గిరిజన ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా కనిపిస్తున్నది. గత బీఆర్ఎస్ సర్కారు నిర్మించిన మిషన్ భగీరథ ప్రాజెక్టు నుంచి గిరిజన గూడెలకు నీళ్లందడం లేదనే ఫిర్యాదులు మంత్రులు, కలెక్టర్లకు వెల్లువెత్తుతున్నాయి. అక్కడక్కడా కొంతమేర వస్తున్నా, అందులో కలుషిత నీరే ఉంటున్నదని ఆవేదన వ్యక్తమవుతున్నది. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా ఉత్తర తెలంగాణలో రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరుగుతున్నది. నల్లాల్లో తగినంత ప్రెజర్ లేక, సరఫరా తీవ్ర ఆలస్యమవుతున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో క్రమం తప్పకుండా నీటి సరఫరా కావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా రబీ పంటలకూ నీరందడం లేదు. భూగర్భజలాలు సగటున 7.34 అడుగుల మేర పడిపోయాయని అధికారిక సమాచారం.

ఐఏఎస్ అధికారి	జిల్లాలు
ప్రశాంత్‌జీవన్ పాటిల్, సాగునీటి శాఖ ప్రత్యేక కార్యదర్శి	ఆదిలాబాద్, నిర్మల్
కృష్ణ ఆదిత్య, కార్మిక శాఖ డైరెక్టర్	ఆసిఫాబాద్, మంచిర్యాల
ఇర్.వి.కర్ణన్, ఆరోగ, కుటుంబ శాఖ డైరెక్టర్	కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
అనితా రామచంద్రన్ , పీఆర్ కమిషనర్	నల్లగొండ, యాదాద్రి-భువనగిరి, సూర్యాపేట
ఏ.శరత్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి	నిజామాబాద్, కామారెడ్డి
బి. విజయేంద్ర, ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి	రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి
శృతి ఓజా, ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్	మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ-గద్వాల, నాగర్‌కర్నూల్
బి. గోపి, వ్యవసాయ శాఖ డైరెక్టర్	వరంగల్, హన్మకొండ, జనగామ, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్
భారతి హోలికేరి, ఆర్కియాలజి డైరెక్టర్	మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
కె.సురేంద్రమోహన్, ప్రభుత్వ కార్యదర్శి	ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం

‘ఉపాధి’లో సంస్కరణలు అవశ్యం

ఉద్యోగ కల్పనలో ప్రభుత్వ వైఫల్యం
భారత్‌పై ప్రపంచబ్యాంక్ తాజా నివేదిక



• లేకుంటే 2047 నాటికి సంపన్న దేశంగా ఆవిర్భవించలేదు • ప్రధాన సమస్యగా నిరుద్యోగం




న్యూఢిల్లీ : ఉపాధి కల్పన కోసం సంస్కరణలు చేపట్టని పక్షంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న లక్ష్యాన్ని భారత్ సాధించలేదని ప్రపంచబ్యాంక్ సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. 2047 నాటికి భారతావనిని సంపన్న దేశంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోడీ పలు సందర్భాలలో చెబుతుంటారు. అప్పటికి భారత్ స్వాతంత్ర్యం సాధించి వంద సంవత్సరాలు పూర్తవుతుందని ఆయన గుర్తు చేస్తుంటారు. లక్ష్యసాధనలో చేయూత అందించాలని దేశ ప్రజలను కోరుతుంటారు. అయితే సంస్కరణలు చేపట్టకపోతే ఆ లక్ష్యం కలగానే మిగిలిపోతుందని ప్రపంచబ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త (దక్షిణాసియా) ఫ్రాన్‌జిస్కా ఆన్‌సర్జ్ హెచ్చరించారు.

‘స్థితిస్థాపకత కోసం ఉద్యోగాలు’ పేరిట ప్రపంచబ్యాంక్ మంగళవారం తాజాగా ఓ నివేదికను విడుదల చేసింది. 2010 ప్రాంతంలో ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉద్యోగ వృద్ధి బాగా తక్కువగా ఉన్నదని ఆ నివేదిక తెలిపింది. 2000-2022 మధ్యకాలంలో దేశంలో ఉపాధి నిష్పత్తి నేపాల్ మినహా ఇతర దక్షిణాసియా దేశాల కంటే బాగా వెనుకబడిందని చెప్పింది. ఉపాధి నిష్పత్తి అంటే ఏదైనా ఒక దేశంలో పనిచేసే వయసున్న ప్రజల సంఖ్యతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిని పోల్చడం. మొత్తంమీద 2000-2023 మధ్య ఉపాధి వృద్ధి పనిచేసే వయసున్న ప్రజల సగటు వృద్ధి కంటే బాగా తక్కువగా ఉంది.

దక్షిణాసియా ఆర్థిక వ్యవస్థ రాబోయే రెండు సంవత్సరాలలో మరే ఇతర ప్రాంతం సాధించని వృద్ధిని సొంతం చేసుకుంటుందని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది. అయితే దాని ఉపాధి నిష్పత్తి మాత్రం తగ్గుతోందని తెలిపింది. అంటే దీనర్థం ఆయా దేశాలు అవసరమైన ఉపాధి అవకాశాలను కల్పించలేకపోతున్నాయన్న మాట. దక్షిణాసియా ప్రాంతం ఈ సంవత్సరం 6 శాతం, వచ్చే సంవత్సరం 6.1 శాతం ఉత్పాదక వృద్ధి సాధిస్తుందని అంచనా. దక్షిణాసియాలో ఉపాధి నిష్పత్తి గత సంవత్సరం 59 శాతంగా ఉంది. ఇతర వర్ధమాన దేశాలలో అది 70 శాతంగా ఉండడం గమనార్హం. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సంస్థ నివేదిక ప్రకారం గత సంవత్సరం మన దేశంలో యువతలో నిరుద్యోగ రేటు 45.4 శాతంగా ఉంది. దక్షిణాసియా ప్రాంతంలో మాత్రమే గత రెండు దశాబ్దాలుగా పనిచేసే వయసున్న పురుషుల వాటా పడిపోతోందని ప్రపంచబ్యాంక్ హెచ్చరించింది. భారత్ సహా పలు దక్షిణాసియా దేశాలలో మహిళల ఉపాధి రేటు 40 శాతం కంటే తక్కువగా ఉన్నదని, ఇది ప్రపంచంలోనే అతి తక్కువ రేటని ఎత్తిచూపింది. భారత్‌లో ఆర్థికాభివృద్ధి వేగవంతంగా జరుగుతున్నప్పటికీ సరిపడినంత పనిచూపించలేకపోతోందని, నిరుద్యోగం అనేది అక్కడ పెద్ద సమస్యగా తయారైందని తెలిపింది. ‘భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ నిరుద్యోగాన్ని రాజకీయ అంశంగా మార్చాలని ప్రధాని మోడీ వ్యతిరేకులు భావిస్తు న్నారు. ఉద్యోగ కల్పనలో తన వైఫల్యాలను కప్పిపుచ్చుకు నేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే ఉద్యోగ కల్పన కోసం అనేక ముఖ్యమైన చర్యలు చేపట్టానని ప్రభుత్వం చెప్పుకుంటోంది. ఉత్పత్తిని పెంచేందుకు సంస్కరణలు తీసు కొచ్చానని, అభివృద్ధిని వేగవంతం చేసేందుకు మౌలిక సదు పాయాల నిర్మాణంపై పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నానని అంటోంది’ అని ప్రపంచబ్యాంక్ నివేదిక వివరించింది.

అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా ‘భారత్‌లో ఉపాధి’పై మార్చిలో ఓ నివేదికను విడుదల చేశాయి. భారత్‌లోని మొత్తం నిరుద్యోగ జనాభాలో నిరుద్యోగ యువత 82.9 శాతం ఉన్నారని ఆ నివేదిక తెలిపింది. సెకండరీ స్థాయి విద్య లేదా ఉన్నత విద్య అభ్యసించిన యువతలో నిరుద్యోగం పెరుగుతోందని వివరించింది. భారత్‌లో 2050 నాటికి మొత్తం జనాభాలో వృద్ధుల సంఖ్య 20 శాతానికి పెరుగుతుందని ఐక్యరాజ్యసమితి గత సంవత్సరం సెప్టెంబరులో తెలియజేసింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ సమస్య పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, యువతలో నైపుణ్యాన్ని పెంచాలని, వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. గ్రీన్ టెక్నాలజీ, కృత్రిమ మేథ, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన నైపుణ్యాలపై భారత్ దృష్టి సారించాలని ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ గత జూన్‌లోనే సలహా ఇచ్చారు.



‘అవినీతి’కే బీజేపీ అందలం

దర్యాప్తు ఎదుర్కొంటున్న వారు కాషాయపార్టీ వైపునకు

- **2014 నుంచి ఇలా కమలం వైపునకు వెళ్లిన కీలక నాయకులు 25 మంది**
- **వీరిలో 23 మందికి కేసుల నుంచి ఊరట**
- **ఆంగ్ల వార్త సంస్థ కథనం**

న్యూఢిల్లీ: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కోసం బీజేపీ ‘వాషింగ్ మెషిన్’లా పనిచేస్తున్నదన్న ఆరోపణలను ప్రతిపక్ష పార్టీలు చేస్తున్నాయి. ఈ ఆరోపణలను సమర్థించే విధంగానే.. ఆ పార్టీలోకి చేరిన, సమర్థించిన నాయకుల జాబితా ఉన్నది. ఇతర పార్టీలలో ఉండి కేంద్ర ఏజెన్సీ దర్యాప్తులను ఎదుర్కొంటున్న అనేక మంది ముఖ్యమైన రాజకీయ నాయకులు బీజేపీ పంచన చేరారు. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. వీరిలో 23 మంది నేతలు తమ కేసుల్లో ఊరటను పొందారు. ఒక ఆంగ్ల వార్త పత్రిక దీనికి గురించి కథనాన్ని వెలువర్చింది.

ఇలా బీజేపీకి జై కొట్టి.. కేసులు, దర్యాప్తుల నుంచి ఉపశమనం పొందిన వారిలో అసోం సీఎం హిమంత విశ్వ శర్మ, పశ్చిమ బెంగాల్ కీలక నాయకుడు సువెందు అధికారి, ఎన్సీపీ చీలిక నేత అజిత్ పవార్, ప్రముఖ వ్యాపారవేత్త నవీన్ జిందాల్ వంటి వారు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి 10 మంది, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), శివసేనల నుంచి నలుగురు చొప్పున, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) నుంచి ముగ్గురు, టీడీపీకి చెందిన ఇద్దరు, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), వైసీపీల నుంచి ఒక్కరు చొప్పున ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న ఆరుగురు రాజకీయ నాయకులు ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలకు కొన్ని వారాల ముందే బీజేపీలోకి రావటం గమనార్హం.

అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్, అశోక్ చవాన్, హిమంత విశ్వ శర్మ సువేందు అధికారి, ప్రతాప్ సర్నాయక్, హసన్ ముష్రిఫ్, భావన గవాలీ వంటి కీలక నాయకులు బీజేపీ పక్షాన చేరి, దర్యాప్తుల నుంచి ఉపశమనం పొందినవారిలో ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ), ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ) డిపార్ట్‌మెంట్ వంటి కేంద్ర ఏజెన్సీలను మోడీ ప్రభుత్వం “దుర్వినియోగం” చేయటంపై ప్రతిపక్షాలు గత కొన్నేండ్లుగా గొంతెత్తుతున్న విషయం విదితమే. లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలల ముందే ఇద్దరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల (హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్)ను ఈడీ అరెస్టు చేసింది. మరికొందరు నేతలపై దాడి చేసి విచారణకు పిలిచింది.

బీజేపీ “క్లీన్” పార్టీ అని చెప్పుకుం టుండగా.. ఎలక్టోరల్ బాండ్లతో పాటు దర్యాప్తు సంస్థల కేసులను ఎదుర్కొంటున్న నాయకులు కాషాయపార్టీకి ఫిరాయించటం వంటివి అసలు వాస్తవాలను తెలియజేస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎన్సీపీ అజిత్ పవార్ వర్గానికి చెందిన ప్రఫుల్ పటేల్ అవినీతి కేసులో సీబీఐ క్లోజర్ రిపోర్టు దాఖలు చేసిందనీ, అక్రమ మైనింగ్ కుంభకోణం నిందితుడు గాలి జనార్దన్ రెడ్డి బీజేపీలో చేరారని ఆంగ్ల వార్త సంస్థ వివరించింది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 95 శాతం ఈడీ కేసులు ప్రతిపక్ష ఆప్ నేతలపైనే ఉన్నాయని తేలింది. 2014 నుంచి 2022 మధ్య, 121 మంది ప్రముఖ నాయకులు ఈడీ దర్యాప్తు కిందకు వచ్చారని, వారిలో 115 మంది ప్రతిపక్షాలకు చెందినవారేనని సదరు ఆంగ్ల వార్త సంస్థ తన కథనంలో వివరించింది.

ఆ ఐదు పార్టీలకే 75 శాతం ‘బాండ్ల’ విరాళాలు

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేడీ...ఈ ఐదు పార్టీలకే 75 శాతం విరాళాలు అందాయి. అయితే ఈ పార్టీలకు పెద్ద మొత్తంలో విరాళాలు ఇచ్చిన కొందరు దాతలు బాండ్ల పథకం రాకముందు... అంటే 2018కి ముందు వాటికి ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. కొద్ది మంది విరాళాలు ఇచ్చినా ఆ మొత్తం స్వల్పమే. ఈ ఐదు పార్టీలలో ప్రతి పార్టీకీ పెద్ద మొత్తంలో విరాళాలు అందించిన 30 మంది దాతల జాబితాను ‘ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ పత్రిక పరిశీలించింది. 2019 ఏప్రిల్ 12, ఈ సంవత్సరం ఫిబ్రవరి 15 తేదీల మధ్య రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్న బాండ్లలో సగానికి పైగా ఈ దాతలు ఇచ్చినవే కావడం గమనార్హం.

బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టడానికి ముందు కంటే దానిని అమలు చేసిన తర్వాతే తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేడీ పార్టీలకు 16 రెట్లు అధికంగా విరాళాలు అందాయి. పథకం రాకముందు ఈ 30 మంది దాతల్లో ఒక్కరు కూడా తృణమూల్, బీజేడీ పార్టీలకు నేరుగా విరాళాలు ఇవ్వలేదు. బీజేపీకి సంబంధించినంత వరకూ ఏడు కంపెనీలు...ఇన్ఫినా ఫైనాన్స్, యునైటెడ్ ఫాస్ఫరస్, టొరంట్ ఫార్మా, మోడరన్ రోడ్ మేకర్స్, నవయుగ ఇంజినీరింగ్, లక్ష్మీ సివిల్ ఇంజినీరింగ్...మాత్రం ఆ పార్టీకి 2013-14, 2017-18 మధ్య విరాళాలు అందించాయి. కాగా బీజేపీకి అత్యధిక విరాళాలు ఇచ్చిన మేఘా గ్రూపు ఈ జాబితాలో లేదు.

పథకానికి ముందు ఇచ్చింది స్వల్పమే

పథకం ప్రారంభం తర్వాతే విరాళాల వరద

బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టడానికి ముందు ఈ ఏడు కంపెనీలు బీజేపీకి రూ.50 కోట్ల విరాళం అందించాయి. బాండ్ల ద్వారా ఇచ్చింది రూ.350 కోట్లు. కాంగ్రెస్, బీఆర్ఎస్ విషయానికి వస్తే ఇద్దరు దాతలు మాత్రం బాండ్లకు ముందు కూడా ఆ పార్టీలకు నిధులు సమకూర్చారు. ఈ రెండు



పార్టీలకూ అధిక మొత్తంలో విరాళం ఇచ్చిన మేఘా గ్రూపు ఈ దాతల జాబితాలోనూ లేదు. కాంగ్రెస్‌కు టొరంట్ పవర్, నిర్మా లిమిటెడ్ కంపెనీలు బాండ్ల పథకం రావడానికి ముందు కేవలం రూ.3 కోట్లు విరాళం ఇవ్వగా వచ్చిన తర్వాత రూ.30 కోట్లు అందజేశాయి.

బీఆర్ఎస్‌కు బాండ్లకు ముందు హెటెరో డ్రగ్స్, అరబిందో ఫార్మా కంపెనీలు రూ.1.75 కోట్లు ఇవ్వగా పథకం ప్రారంభించిన తర్వాత రూ.45 కోట్లు అందజేశాయి.

ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా...

ఎన్నికల బాండ్ల పథకం ద్వారా బీజేపీ, కాంగ్రెస్‌కు విరాళాలు అందించిన బడా దాతలు దానికి ముందు కూడా నిధులు సమకూర్చినప్పటికీ నేరుగా ఇవ్వలేదు. ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా ఆయా పార్టీలకు నిధులు చేరవేశాయి.

ఉదాహరణకు కాంగ్రెస్ విషయంలో జేకే లక్ష్మి సిమెంట్, టొరంట్ పవర్, హల్దియా ఎనర్జీ కంపెనీలు ఎన్నికల ట్రస్టులకు విరాళాలు ఇచ్చాయి. వాటి ద్వారా 2013-14, 2017-18 మధ్య కాంగ్రెస్‌కు నిధులు చేరాయి. బీజేడీకి అల్ట్రాటెక్ సిమెంట్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ సంస్థలు బాండ్ల ద్వారా విరాళాలు అందజేశాయి. అంతకుముందు అవి ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా నిధులు సమకూర్చాయి. అయితే ఆ సొమ్ము బీజేడీ ఖాతాలో చేరిందా లేదా అన్నది తెలియలేదు.

నిండుకుంటున్న టీబీ మందులు

న్యూఢిల్లీ : దేశంలో క్షయ వ్యాధి నివారణకు వాడే మందులకు కొరత వచ్చింది. గత ఏడు నెలల కాలంలో ఇలా కొరత ఏర్పడడం ఇది రెండోసారి. దీంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దేశంలోని పలు ఆరోగ్య కేంద్రాలలో మందుల నిల్వలు నిండుకున్నాయి. కొన్ని రాష్ట్రాలకు అరకొరగా సరఫరా అవుతున్నప్పటికీ అవి ఏ మాత్రం చాలడం లేదు. గత సంవత్సరం ఆగస్టులో కూడా పలు రాష్ట్రాల్లో క్షయ మందులకు కొరత ఏర్పడింది. గత నెల 18న కేంద్ర టీబీ విభాగం రాష్ట్రాలకు లేఖలు రాసింది. మూడు నెలలకు సరిపడా మందులను స్థానికంగా కొనుగోలు చేసుకోవాలని సలహా ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం మందులు సేకరిస్తోందని, అయితే అనూహ్య, ఇతర పరిస్థితుల కారణంగా సరఫరాలలో జాప్యం జరగవచ్చునని టీబీ విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేంద్ర జోషీ ఆ లేఖల్లో వివరించారు. సాధారణంగా రాష్ట్రాల వద్ద ఆరు నెలలకు సరిపడా మందులు నిల్వ ఉంటాయి. అయితే ఇప్పుడు నెల రోజుల అవసరాలు తీర్చే మందులు కూడా వాటి వద్ద లేవు. సొంతగా మందులు కొనుగోలు చేసేందుకు పలు రాష్ట్రాల నోడల్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో మందుల కొనుగోలు కష్టతరంగా మారింది. మందుల కొరతపై కర్నాటక ఆరోగ్య మంత్రి దినేష్ గుండూరావు ఈ వారం ప్రారంభంలో కేంద్ర ఆరోగ్య మంత్రికి ఓ లేఖ రాశారు. గత సంవత్సరం దేశంలో 25.55 లక్షల కొత్త టీబీ కేసులు నమోదయ్యాయి. వీటిలో 1.43 లక్షలు చిన్న పిల్లల కేసులు. క్షయ వ్యాధి నివారణకు వాడే రెండు ఔషధాల సరఫరాకు జనవరిలోనే అంతరాయం ఏర్పడింది.



తెలంగాణ గడ్డ నుంచే కాంగ్రెస్ ‘జంగ్ సైరన్’

6న తుక్కుగూడలో భారీ బహిరంగ సభ

దేశ ప్రజల కోసం అదే రోజు మ్యానిఫెస్టో విడుదల

హాజరుకానున్న ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక

- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఘనంగా ఏర్పాట్లు...భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశానికి కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డ మీద నుంచే కాంగ్రెస్ పార్టీ ‘జంగ్ సైరన్’ మోగించ నుంది. అసెంబ్లీ ఎన్నికల సభలకు తొలిసారి వేదికైన తుక్కుగూడ నుంచే ఈనెల 6న జనజాతర బహిరంగ సభకు నాంది పలకనుంది. ఇప్పటికే కొనసాగుతున్న కాంగ్రెస్ జైత్రయాత్రకు జనజాతర మరో మైలు రాయికానుంది. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు ఇచ్చే భరోసా (మ్యానిఫెస్టో)ను ఈ వేదిక నుంచే విడుదల చేయనుంది. జనజాతర సభను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ ఈ సభకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇదే స్థలంలో హస్తం పార్టీ తొలి బహిరంగ సభను నిర్వహించింది. అప్పుడు తలెత్తిన ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఆ సమయంలో శ్రీశైలం హైవేపై పది గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సభా ప్రాంగణంతోపాటు కొన్ని కిలోమీటర్లమేర భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు.

పదేండ్లపాటు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్... పదేండ్ల ఎన్డీఏ నిరంకుశ, దుష్పరిపాలనకు చరమగీతం పాడాలనే కృతనిశ్చయంతో ఉన్నది. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన మ్యానిఫెస్టోను శాసనసభ ఎన్నికలకు సమరశంఖం పూరించిన తుక్కుగూడ వేదికగానే విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నెల 6వ తేదీన తుక్కుగూడలో జనజాతర పేరిట నిర్వహించే బహిరంగ సభలో మ్యానిఫెస్టోతోపాటు తాము అధికారంలోకి వస్తే అమలు చేయనున్న ఐదు గ్యారంటీలను కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ప్రకటించనుంది.

పది లక్షల జనసమీకరణ

తుక్కుగూడలోని 60 ఎకరాల విశాలమైన మైదానంలో జనజాతర బహిరంగ సభను కాంగ్రెస్ నిర్వహించనుంది. మైదానం పక్కనే వాహనాల పార్కింగ్‌కు సుమారు 300 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం వంద రోజుల్లోనే పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీని విజయవంతంగా అమలు చేస్తున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. 30 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చింది. 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు బంధు నిధులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. ప్రతినెలా మొదటి తారీఖునే ఉద్యోగులకు జీతాలు, పింఛనర్లకు పింఛన్లు అందజేస్తోంది. పదేండ్ల నిర్బంధ పాలన తర్వాత ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు తెలియజేస్తున్నారు. ఇవన్నీ తమ పార్టీకి సానుకూల అంశాలని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు వాటి పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. ఫలితంగా రాష్ట్రంలోని మహిళలు, యువత, రైతులతోపాటు అన్ని వర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై సానుకూల స్పందన వెల్లువెత్తుతున్నది. ఈ నేపథ్యంలో జనజాతర సభకు ఆదిలాబాద్ మొదలు అలంపూర్ వరకు, జహీరాబాద్ నుంచి భద్రాచలం వరకు అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడానికి సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. కనీసం పది లక్షల మంది ఈసభకు హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తున్నది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇప్పటికే తుక్కుగూడ జన జాతర సభ ప్రాంగణాన్ని సందర్శించి సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీ సంఖ్యలో ప్రజలు సభకు తరలివచ్చినా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఉండేలా సీఎం ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

తుక్కుగూడనే ఎందుకు...?

శాసనసభ ఎన్నికలకు కాంగ్రెస్...టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తుక్కుగూడ నుంచే సమరశంఖం పూరించింది. తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17న తుక్కుగూడలో విజయభేరి పేరిట భారీ బహిరంగ సభను కూడా నిర్వహించింది.

విజయభేరి వేదిక మీద నుంచే సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. ఆయా గ్యారంటీలు తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంతో కాంగ్రెస్ శాసనసభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరింది. ఈ నేపథ్యంలో తమకు కలిసివచ్చిన తుక్కుగూడ నుంచే లోక్‌సభ ఎన్నికలకు సమరశంఖం పూరించాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించింది. తెలంగాణ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల హామీ ప్రజల్లోకి దూసుకెళ్లినట్టుగానే లోక్‌సభ ఎన్నికలకు ఇచ్చే ఐదు గ్యారంటీలు దేశంలోని అన్ని మూలలకు, అన్ని వర్గాల్లోకి వెళతాయని కాంగ్రెస్ అగ్ర నాయకత్వం బలంగా నమ్ముతున్నది.

నాటి మాటలే పునరావృతమవుతాయా...?

తుక్కుగూడ వేదికగా నిర్వహించిన విజయభేరి సభలో పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ, డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని కుండబద్దలు కొట్టి చెప్పారు. సీఎం ప్రమాణస్వీకారానికి ప్రజలంతా ఆహ్వానితులేనని ప్రకటించారు. అవే మాటలను ఆయన ఎన్నికల ప్రచారంలో పదే పదే పునరుద్ఘాటించారు. ఆయన చెప్పినట్టే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. డిసెంబరు 9కి రెండు రోజుల ముందే ఏడో తేదీన రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరింది.

తాజాగా

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ, ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో లక్షలాది ప్రజల సమక్షంలో తమ ప్రభుత్వం కొలువుదీరుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. జూన్ 9న ఎర్రకోటపై జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శాసనసభ ఎన్నికలకు మాదిరిగానూ ఇప్పుడు ఆయన చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి.

రైతుల ఆదాయం పెంచని బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలి?

పార్టీ మారిన నాయకులను.. శిక్షించాల్సిన బాధ్యత కార్యకర్తలదే

- చేవెళ్లలో కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

పార్టీ మారిన నాయకులను శిక్షించాల్సిన బాధ్యత కార్యకర్తలే తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వికారాబాద్ జిల్లా చేవెళ్లలో నిర్వహించిన చేవెళ్ల పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశారని విమర్శించారు. మంత్రి కావాలని రాజకీయల్లోకి వచ్చినప్పటి నుంచి కలలు కన్నారని, ఆ కలను మాజీ సీఎం కేసీఆర్ నెరవేర్చి.. ఒకసారి కాదు రెండు సార్లు మంత్రిగా అవకాశం కల్పించారని తెలిపారు. చేవెళ్ల ప్రజలకు అనామకుడైన రంజిత్‌రెడ్డిని కేసీఆర్ ఎంపీగా గెలిపించారని, అయినా వారు పార్టీకి ద్రోహం చేసి మరో పార్టీలోకి వెళ్లారని, ఆ ఇద్దరిని శిక్షించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా పోటీ పడేందుకు ముందుకు వచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇక్కడి ప్రజలను తక్కువ అంచనా వేస్తున్నారని, మోడీ, రేవంత్‌రెడ్డి దొరికారని వీళ్ల సంబురపడిపోతున్నారని తెలిపారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో జరిగిన వైఫల్యాలు, ప్రభుత్వ మోసాలను, కరువు తదితర విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పరిగి సమావేశంలో మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి డ్రామాలు చేశారని తెలిపారు. యాక్టింగ్‌కు ఆస్కార్ వారికే ఇవ్వాలని తెలిపారు. కేసీఆర్‌ను, పార్టీని మోసం చేసిన వాళ్లకు బుద్ధి చెప్పాలన్నారు. రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుద్దామన్నారు. ఒక్క మెడికల్ కాలేజీ, నవోదయ పాఠశాల ఇవ్వని, రైతుల ఆదాయం డబుల్ చేస్తానని చెప్పి మోసం చేసిన బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. రూ. 70 ఉన్న పెట్రోలను రూ. 110 చేసినందుకు, డీజిల్ రేట్లు పెంచినందుకు, సిలిండర్ రేట్లు పెంచినందుకు, పప్పు, ఉప్పులు ధరలు పెంచినందుకు బీజేపీకి ఓటు వేయాలా అని ప్రశ్నించారు. డిసెంబర్ 9న రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పాడు కానీ ఇప్పటికి అమలు చేయలేదని విమర్శించారు.

మల్కాజ్‌గిరిలో పోటీకి రమ్మంటే ఇప్పటికీ రేవంత్‌రెడ్డి నుంచి స్పందన లేదని, ఓడిపోతామని రేవంత్‌కు తెలుసని, అందుకే మల్కాజ్‌గిరి, చేవెళ్లలో డమ్మీ అభ్యర్థులను పోటీలో పెట్టారని విమర్శించారు. చేవెళ్లలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్యనే పోటీ అని తెలిపారు. రేవంత్.. నువ్వు మగాడివైతే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని, మహిళలకు ఇస్తానన్న రూ.2,500 ఇవ్వాలని, రుణమాఫీ చెయ్యాలని, అవ్వ, తాతలకు రూ. 4 వేలు ఇవ్వాలని, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తీసుకురావాలని కేటీఆర్ సవాల్ విసిరారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

సంపాదకీయం

ఇరాన్ కాన్సులేట్ భవనంపై ఇజ్రాయిల్ దాడి!

గాజాలో పాలస్తీనియన్లపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్ మొత్తం మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాను రణరంగంగా మార్చాలని చూస్తున్నది. ఏప్రిల్ ఒకటవ తేదీన సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్ భవనంపై దాడి చేసి పన్నెండు మందిని బలిగొనటమే దానికి పక్కా తార్కాణం. ఇద్దరు సీనియర్ కమాండర్లు, మరో ఐదుగురు మిలిటరీ సలహాదారులు, ఐదుగురు సిరియన్ పౌరులు ఆ దాడిలో మరణించారు. దీనికి బాధ్యురాలైన ఇజ్రాయిల్‌తో పాటు దాని వెనుక ఉన్న అమెరికా మీద కూడా తగిన చర్య తీసుకుంటామని ఇరాన్ ప్రకటించింది. ఆక్రమిత గోలన్ గుట్టల నుంచి ఎఫ్-35 యుద్ధ విమానాలతో ఆరు క్షిపణులను ప్రయోగించింది. ఒక దౌత్య కార్యాలయం మీద దాడి చేయటం అన్ని రకాల నిబంధనలు, సాంప్రదాయాలను ఉల్లంఘించటం తప్ప మరొకటి కాదు.ఆ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని, దాడికి వెళుతూ అస్పష్టంగా ఇజ్రాయిల్ ఉప్పందించింది తప్ప వివరాలు చెప్పలేదని అమెరికా బుకాయించింది. కానీ ఈ దాడిని ఖండించకపోగా, దాడితో సంబంధం ఉందని చెప్పి తమపై దాడులకు దిగితే ప్రతిదాడులు చేస్తామని బెదిరింపులకు దిగింది. రష్యా కోరికపై మంగళవారం సాయంత్రం భద్రతామండలి అత్యవసర సమావేశం జరిపింది. ప్రతిదాడులు జరిపేందుకు తమకు హక్కు ఉందని ఇరాన్ ఈ సమావేశంలో స్పష్టం చేసింది. ఒక దేశ రాయబార కార్యాలయం మీద దాడి జరపటమంటే ఆ దేశం మీద దాడిగానే చూస్తారు.

చర్యకు ప్రతి చర్య లేకపోతే సామ్రాజ్యవాదులను నిలువరించటం కష్టం. రెండు ప్రపంచ యుద్ధాలు సామ్రాజ్యవాదుల మధ్య ప్రపంచాన్ని పంచుకొనే క్రమంలో వచ్చిన పేచీలతోనే జరిగాయి. ఆ రెండు యుద్ధాలలో పరస్పరం తలపడిన సామ్రాజ్యవాదులు ఇప్పుడు రాజీపడి ఏకమయ్యారు. తమను ప్రతిఘటిస్తున్నవారిని సహించలేకపోతున్నారు. కీలకమైన మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాలో అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులకు చైనా, రష్యా, ఇరాన్ దగ్గర కావటం మింగుడుపడటం లేదు. ఓమన్ గల్ఫ్‌లో ఈ మూడు దేశాల నౌకాదళాలు సంయుక్తంగా సముద్ర భద్రత (మెరైన్ సెక్యూరిటీ బెల్ట్ 2024) పేరుతో భారీ విన్యాసాలు జరుపుతున్నాయి.

అమెరికా దన్నుతో తెగబడుతున్న ఇజ్రాయిల్ ఒకవైపు ఇరుగుపొరుగు దేశాల మీదనే కాదు గాజాలో మానవతాపూర్వక సాయం అందిస్తున్న విదేశీయుల మీద కూడా దాడులు చేసి చంపివేస్తున్నది. దాని చర్యల మీద



ప్రపంచమంతటా తీవ్ర నిరసన వెల్లడి అవుతున్నది. హమాస్ తీవ్రవాదుల అణచివేత ముసుగులో ఆసుపత్రులను కూడా వదలకుండా దాడులు చేస్తున్నది. అక్టోబరు ఏడు నుంచి ఇప్పటి వరకు 33వేల మంది ప్రాణాలు తీసింది, లక్షలాది మందిని గాయపరచింది. గాజాలోని నివాసాలన్నింటినీ నేలమట్టం గావిస్తున్నది. గాజా పౌరుల మీద జరుపుతున్న మారణకాండకు వ్యతిరేకంగా హౌతీ, హిజబుల్లా సాయుధులు ఎర్ర సముద్రం నుంచి ఇజ్రాయిల్ వైపు ప్రయాణించే ఓడలు, ఇజ్రాయిల్ మీద దాడులు జరుపుతున్నారు. గాజా మారణకాండను తక్షణమే నిలిపివేయటం, పాలస్తీనా స్వతంత్ర రాజ్యాన్ని పునరుద్ధరించటం తప్ప మరో పరిష్కారమార్గం లేదు. అందుకు సిద్ధంగాని అమెరికా ఆ ప్రాంతంలో చిచ్చురేపేందుకు కుట్రలు చేస్తున్నది.దానిలో భాగమే ఇరాన్ రాయబార కార్యాలయంపై దాడి. ఇది ఇరాన్ మీదనే కాదు, సిరియా సార్వభౌమత్వం మీద కూడా దాడిగానే ప్రపంచం చూస్తున్నది. ఉద్రిక్తతలను మరింత పెంచేందుకు తప్ప తగ్గించేందుకు ఇలాంటి చర్యలు తోడ్పడవు. అమెరికా, పశ్చిమ దేశాలు ఎందుకీ కుట్రలకు పాల్పడుతున్నాయన్నది ప్రశ్న.

చర్యకు ప్రతి చర్య లేకపోతే సామ్రాజ్యవాదులను నిలువరించటం కష్టం. రెండు ప్రపంచ యుద్ధాలు సామ్రాజ్యవాదుల మధ్య ప్రపంచాన్ని పంచుకొనే క్రమంలో వచ్చిన పేచీలతోనే జరిగాయి. ఆ రెండు యుద్ధాలలో పరస్పరం తలపడిన సామ్రాజ్యవాదులు ఇప్పుడు రాజీపడి ఏకమయ్యారు. తమను ప్రతిఘటిస్తున్నవారిని సహించలేక పోతున్నారు. కీలకమైన మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాలో అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులకు చైనా, రష్యా, ఇరాన్ దగ్గర కావటం మింగుడుపడటం లేదు. ఓమన్ గల్ఫ్‌లో ఈ మూడు దేశాల నౌకాదళాలు సంయుక్తంగా సముద్ర భద్రత (మెరైన్ సెక్యూరిటీ బెల్ట్ 2024) పేరుతో భారీ విన్యాసాలు జరుపుతున్నాయి. వీటిలో రష్యా నుంచి వచ్చిన రెండు విమానవాహక యుద్ధ నౌకలతో పాటు మూడు దేశాలకు చెందిన ఇరవై ఆధునిక యుద్ధ నౌకలు ఉన్నాయి. రాత్రి, పగలు నిర్వహించే విన్యాసాలలో ఉపరితల, గగనతల లక్ష్యాలను చేరుకొనే ఆయుధ ప్రయోగాలు జరుపుతారు. వీటికి పాకిస్థాన్, భారత్, కజకస్తాన్, అజర్‌బైజాన్, ఓమన్, దక్షిణాఫ్రికా నౌకాదళాల ప్రతినిధులు పరిశీలకులుగా ఉన్నారు. ఇవి 2019 నుంచి ఏటా జరుగుతున్నాయి.

ఈ ప్రాంతంతో, ఖండంతో సంబంధం లేని నాటో దేశాల కూటమి వీటికి పోటీగా ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన మూడుదశాబ్దాల తరువాత తొలిసారిగా ఈ ప్రాంతంలో విన్యాసాల పేరుతో బల ప్రదర్శన జరపనుంది. ఈ పరిణామాలను విడివిడిగా చూడలేము. అందుకే మధ్య ప్రాచ్యంలో మారణహోమానికి అమెరికా కూటమి తెరతీస్తున్నదని, దానిలో భాగంగానే ఇరాన్‌పై దాడి అని చెప్పాల్సి వస్తోంది.

ఏ కుక్కో వచ్చి చెరిపివేస్తే..
పోయేది కాదు.. కమ్యూనిస్టుల చరిత్ర
ఏ నక్క పన్నాగానికో మసక బారేది కాదు
సాయుధ పోరాట గాథ

భూమి కోసం.. భుక్తి కోసం..
వెట్టి చాకిరి విముక్తి కోసం
సాగిన పోరే తెలంగాణ
రైతాంగ సాయుధ పోరాటం
ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేకం

ఉత్తి చేతులను బంధూకులుగా
ముల్లుగట్టెలను ఈటెలుగా
బండరాళ్లను ఫిరంగి గుండ్లుగా చేసి
కారంపొడి, గుత్పకట్టెలతో
రాక్షస మూక రజాకార్లను
తరిమిన పోరు
నా తెలంగాణ చరిత్ర

చిత్రహింసలకు ఒళ్లు ఛిద్రమవుతున్నా..
మర్మాంగాలు కోసి సజీవదహనం చేస్తున్నా..
ఆ మంటల్లో రగిలిన జ్వాలే
నా తెలంగాణ చరిత్ర

విరిగిన ఎముకలు బూడిదైన శరీరం
ఎరుపు రంగునద్దుకుని
రజాకార్లనూ, దేశ్‌ముఖ్‌లనూ
అంతమొందించి

చరిత్రకు చెద 'రజాకార్'

నిజాంనే గడగడలాడించింది
నా తెలంగాణ చరిత్ర

గతిలేక, గత్యంతరం లేక నిజామోడు
పటేల్ ముందు మోకరిల్లితే
యూనియన్ సైన్యం దన్నుగా నిలిచి
రైతాంగ పోరాట వీరులనే ఊచకోత కోసే..

దేశమంతా స్వేచ్ఛావాయువులు పీల్చుతుంటే
తెలంగాణలో విముక్తి కోసం,
స్వాతంత్ర్యం కోసం
వీరోచితంగా పోరాడుతున్న వీరులను
నెత్తురు మడుగులో
మాంసం ముద్దలు చేసింది ఆ సైన్యమే

రైతులకూ, రైతు కూలీలకూ
పంచిన భూమినీ ఆస్తులనూ
తిరిగి దేశ్‌ముఖ్‌లకూ
నిజాంకూ అప్పగించిందీ ఆ సైన్యమే
నిజాంను గవర్నర్‌ను చేసింది
ఆ సర్దార్ వల్లభాయ్ పటేలే

ఏదో ఓ సినిమా తీసి మతమే కారణమంటే
అంతకంటే తెలంగాణా సాయుధ పోరాటానికి
అవమానమేముందీ? అయినా..
గాడిదకు కామధేనువు జన్మించిందనీ
ఆ కామధేనువు కుండెడు పాలిచ్చిందనీ
ఆ పాలు తాగితే స్వర్గమేనని నమ్మించే
ప్రబుద్ధ పార్టీ బుర్రలోంచి వచ్చిన
సినిమా నుంచి ఇంతకంటే ఏం
ఆశించగలం?

('రజాకార్' చిత్రాన్ని నిరసిస్తూ..)
- ఎం.విష్ణు ప్రసాద్

పటేల్ సైన్యాలు ఎవరికోసం వచ్చాయి?



బి. ప్రసాద్
9490098901

సెప్టెంబర్ 17ను విమోచన దినంగా ప్రభుత్వం నిర్వహించాలని ఇటీవల కాలంలో కేంద్ర హోంశాఖ ఒక సర్క్యులర్‌ను విడుదల చేసింది. అదే సమయంలో సంఘ్ పరివార్ ప్రమేయంతో తీసిన 'రజాకార్' సినిమా విడుదలైంది.ఈ రెండు అంశాలను పరిశీలిస్తే గనుక తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించడం, హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకునేని స్పష్టమవుతున్నది. హైదరాబాద్ నైజాం సంస్థానంలో ముస్లిం రాజుపై మెజారిటీగా ఉన్న హిందువులు పోరాడి విజయం సాధించారని బీజేపీ వాదనలు చేస్తోంది. ఆనాడు హోంశాఖ మంత్రిగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ సైన్యాల పోలీసు చర్యతోనే హైదరాబాద్ విముక్తి సాధించిందని, లేకపోతే అఖండ భారత్ నిర్మాణానికి గుండెకాయ లాంటి హైదరాబాద్‌ను నైజాం నవాబ్ పాకిస్తాన్‌లో కలిపేవాడనే వదంతుల్ని ప్రచారం చేస్తున్నది. ఇది భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆంధ్ర మహాసభ నాయకత్వం, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ విప్లవ పోరాట చరిత్రను వక్రీకరించడం తప్ప మరొకటికాదు. ఈ పోరాటంలో ఆవగింజంత

> కమ్యూనిస్టులను అణచడం కోసం 50 వేల మంది సాయుధ బలగాలను రంగంలోకి దింపినా ప్రజలు కమ్యూనిస్టుల నాయకత్వంలో ముందుకు సాగారే తప్ప వెనక్కి తగ్గలేదు. ఆ పోరాట సంకల్ప ఫలితంగానే మూడు వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలను నెలకొల్పారు. భూస్వాములు, దొరలను వారి కోటలైన గడీల నుంచి తరిమికొట్టారు. పది లక్షల ఎకరాల భూమిని భూమిలేని పేదలకు పంచారు. రైతులను భూముల నుండి బేదాఖల్ చేయడం, వెట్టిచాకిరీ, అధిక వడ్డీల వ్యాపారం వంటి చర్యలు రద్దు చేయించారు. వ్యవసాయ కార్మికులకు కూలి రేట్లు పెంచి కనీస వేతనాలు అమలు పరిచారు. ఆటవిక తెగల ప్రజలను పీడించే ఫారెస్ట్ అధికారుల బృందాలను అడవుల నుంచి తరిమారు. రెండు వేల మంది గెరిల్లా సాయుధ దళ సభ్యుల అండతో లక్షలాదిమంది ప్రజలు మొదటిసారి రెండు పూటలా భోజనం చేయగలిగారు.

పాత్రలేని బీజేపీకి నైజాం రాజు లొంగిపోయిన రోజును విమోచన దినంగా జరపాలనడం సహేతుకం కానేకాదు. 1942-1951 వరకు ఫ్యూడల్ భూస్వాములు, రజాకార్లు చేసిన నిర్బంధ పన్నుల వసూళ్ల దోపిడీ, రైతులను సాగు భూముల నుండి బేదాఖల్ చర్యలకు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ సంస్థానంలో ప్రజలు సాగించిన వీరోచిత పోరాటమది. ఈ పోరాటం ప్రజలకు మాట్లాడే హక్కు, సభలు నిర్వహించుకునే హక్కు, పత్రికా స్వేచ్ఛ వంటి ప్రజాతంత్ర పౌర హక్కులు కావాలనే డిమాండ్లను సమాజం ముందుకి తెచ్చింది. కౌలు రైతులకు భూమిపై హక్కులు కల్పించాలని, దున్నే వానికి భూమి కావాలని నినదించేలా చేసింది. 'బాంఛన్ దొర నీ కాల్మొక్తా' అన్న బక్కోనితో బంధూకు పట్టించింది.

పసలేని పటేల్ మిలిటరీ సైన్యాలతో తెలంగాణ విముక్తి ప్రచారం

ఆపరేషన్ పోలో పేరుతో పటేల్ మిలిటరీ, పోలీసు చర్య గవర్నర్ జనరల్ జే ఎన్ చౌదరి నాయకత్వంలో మూడు వైపుల నుంచి 24వేల మంది భారత యూనియన్ సైన్యం హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించింది. వీరిలో శిక్షణ పొందిన వారు కేవలం 6వేల మంది మాత్రమే. 1948 సెప్టెంబర్ 13న పోలీస్ చర్య చేపట్టింది. కేవలం ఐదు రోజులకే 1948 సెప్టెంబర్ 17న నైజాం నవాబు లొంగిపోతున్నట్టు ప్రకటించారు. అయినప్పటికీ సైన్యాలు వెనక్కి తిరిగిపోకుండా 1951 అక్టోబర్ 1 వరకు హైదరాబాద్ సంస్థానంలో ఉన్నాయి. ఎవరికి రక్షణ కోసం పటేల్ సైన్యం ఉన్నదో? లొంగిపోయిన ప్రజాకంఠకుడైన నైజాం నవాబు, రజాకార్ సైన్యం అధ్యక్షుడు కాసీం రజ్వీలను అరెస్టు చేసి ఎందుకు శిక్షించలేదో బీజేపీ నేతలే సమాధానం చెప్పాలి? పైగా నెహ్రూ ప్రభుత్వం నైజాం నవాబుతో లాలూచి పడింది. హైదరాబాద్ సంస్థానానికి రాజ్‌ప్రముఖ్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. రాచ మర్యాదలతో ప్రత్యేక విమానంలో రాజుతో పాటు కుటుంబీకులను, కాసీం రజ్వీని పాకిస్తాన్‌కు పంపింది. ప్రజల ఆగ్రహానికి బలి కావాల్సిన వీరికి పటేల్ సైన్యం విమోచన కలిగించింది తప్ప హైదరాబాద్ సంస్థానానికి కాదు. ప్రజా పోరాటానికి భయపడి గ్రామాలొదిలి పట్టణాల్లో దాక్కున్న భూస్వాములను గ్రామాలకు తీసుకొచ్చి తిరిగి భూస్వామ్య వ్యవస్థను పునరుద్ధరణ చేయడానికి పటేల్ సైన్యాలు కృషి చేశాయే తప్ప ప్రజల బాధలకు కారణమైన వారిని శిక్షించలేదు.



ముస్లింలపై హిందువుల తిరుగుబాటు వాదన వాస్తవమా?

గ్రామీణ ప్రాంతాలలో విపరీతమైన భూకేంద్రీకరణ, వెట్టి చాకిరి, కౌలు దోపిడీ విధానం పెరిగింది. వ్యవసాయ భూమి మొత్తం ఐదు కోట్ల 30 లక్షల ఎకరాలు. దీనిలో మూడు కోట్లు దివాని పేరుతో ప్రభుత్వ భూమి శిస్తు కింద, కోటి 50 లక్షల ఎకరాలు భూమి జాగీర్దార్ విధానం కింద, పది శాతం సర్ఫిఖాస్ విధానం కింద నైజాం సొంత భూమిగా ఉండేది. పైగాలు పేరుతో ముస్లిం భూస్వాముల ఎస్టేట్స్ ఉండేవి. పన్నులు వసూళ్లు చేసే పటేల్, పట్వారి, మాలి పటేల్‌లకు వతన్లు పేరుతో 5 నుంచి 10 గ్రామాలు ఉండేవి. దేశ్‌ముఖ్‌లు వీటిపై పెత్తనం చెలాయించే వారు. వీరిలో ఎక్కువమంది హిందువులే ఉన్నారు. ఆనాటి రికార్డుల ప్రకారం హైదరాబాద్ సంస్థానంలో 975 మంది జాగిర్‌దార్లు ఉంటే వీరిలో 872 మంది హిందువులు, 102 మంది ముస్లింలున్నారు. వీరి చేతిలో 21 వేల గ్రామాలుండేవి. సాగులో ఉన్న అతి సారవంతమైన భూములను రకరకాల తప్పుడు పద్ధతుల్లో సామాన్య రైతాంగం నుంచి భూస్వాములు కబళించారు. సర్వే సెటిల్మెంట్ సందర్భంలోనే రైతులకు తెలియకుండా తమ పేర్లపై రాయించుకునేవారు.తమ వశంకాని వాటిని కరువు, కాటకాలతో పంటలు పండక, పన్నులు కట్టలేకపోయిన రైతులను బెదిరించి స్వాహా చేశారు. దీంతో తమ సొంత భూమిలోనే కౌలుదారులుగా సాగుచేసుకునే స్థితికి రైతులు నెట్టబడ్డారు. ఈ విధంగా జన్నపురెడ్డి ప్రతాపరెడ్డి సూర్యాపేట భూస్వామి1,50,000 ఎకరాల భూమి, కల్లూరు దేశముఖ్ లక్ష ఎకరాలు భూమి, అదిలాబాద్ జిల్లా లక్షెటిపేట్ నర్సాపూర్ సంస్థాన భూస్వామి 50 వేల నుంచి లక్ష ఎకరాల భూమి, విసునూరు దేశ్ ముఖ్ 40 వేల ఎకరాల భూమి, బాబా సాహెబ్ పేట దేశ్‌ముఖ్‌కు పదివేల ఎకరాల భూమి, పొలంపల్లికి చెందిన అల్వాల కుటుంబం సుందమేరీ మాధవరావు పదివేల ఎకరాల భూములను ఆక్రమించి పేరు మోసిన భూస్వాములయ్యారు. దీంతోపాటు వీరు అనేక గ్రామాలపై పెత్తనం కలిగి ఉండేవారు. 1950-51 పరిపాలన నివేదికల ప్రకారం 500 ఎకరాల పైబడిన భూమి పట్టా గలిగిన భూస్వాములు 550 మంది ఉండేవారు. వీరి పొలాల్లో, ఇండ్లల్లో వృత్తిదారులు, వ్యవసాయ కార్మికులు, సన్న, చిన్నకారు రైతులు ఉచితంగా నిర్బంధ వెట్టిచాకిరి చేసే స్థితికి నెట్టబడ్డారు. ఈ విధానం రద్దు కోసం ఆంధ్ర మహాసభ సంఘం ఇచ్చిన పిలుపునందుకొని వీరనారి చాకలి ఐలమ్మ పోరాటానికి నడుం బిగించింది. 1920లో విసునూరు దేశముఖ్ గుండాల చేతిలో షేక్ బందగి, జఫర్గడ్ జాగీర్దార్ ఖాదర్ ఆలీ, మహమ్మద్ ఖాసిం, దొడ్డి కొమరయ్య హత్య గావించబడ్డారు. నిజాం అరాచకాలపై కలాన్ని ఎక్కుపెట్టిన షోయబుల్లాఖాన్‌ను హైదరాబాద్ నడిబొడ్డున హతమార్చారు. ఇలా అనేకమంది పేద ముస్లిం రైతాంగం వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు.ఇలాంటి పోరాటాన్ని ముస్లింలపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రించడం బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనం.

మారణహోమం సృష్టించిన పటేల్ సైన్యం

భూస్వాములతో పటేల్, రజాకార్ సైన్యాలు మూకుమ్మడిగా ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు కార్యకర్తల ఇండ్లపై దాడి చేసి 4వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. వారికి ఆశ్రయం కల్పించి భోజనాలు పెట్టిన సానుభూతి పరులను నిర్బంధించారు. మహిళలపై సామూహిక అత్యాచారాలకు తెగబడ్డారు, హత్యలకు పాల్పడ్డారు. మిలిటరీ క్యాంపుల్లో పెట్టిన చిత్రహింసలకు 6వేల మంది పైగా మరణించారనేది అంచనా. ఒక గ్రామం తర్వాత మరొక గ్రామాన్ని తగలబెడుతూ సైన్యాలు పైశాచికానందాన్ని పొందాయి. ఇదే సమయంలో నైజాంకు వ్యతిరేకంగా పోరాడిన ముస్లింల పైన దాడులు జరిగిన అనేక గ్రామాల్లో వారిని హిందువులు కాపాడారు. వారి కుటుంబాల్లో రక్షణ కల్పించారు. హిందూ, ముస్లింల మధ్య సృష్టించిన మత ఘర్షణలను కమ్యూనిస్టు ఉద్యమం తిప్పికొట్టింది. కానీ కమ్యూనిస్టు ఉద్యమం బలహీనంగా ఉన్న ఇతర ప్రాంతాలలో ముస్లిం వ్యతిరేక విద్వేషం, వారిపై దాడులు విస్తారంగా జరిగాయి. విలీన ప్రక్రియ పేరుతో పటేల్ మిలటరీ పోలీసు, ప్రయివేట్ రజాకారు సైన్యం కలిసి జరిపిన మారణ హోమంపై నెహ్రూ ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా విమర్శలనెదుర్కొంది. దిక్కుతోచనిస్థితిలో సుందర్‌లాల్ నేతృత్వంలో విచారణ కమిషన్ వేసింది.1948 నవంబర్ నుండి డిసెంబర్ వరకు హింసాత్మక ఘటనలు జరిగిన తొమ్మిది జిల్లాల్లో పర్యటించి నివేదిక అందించింది. ఈ రిపోర్టు ప్రకారం ఉస్మానాబాద్, గుల్బర్గా, బీదర్, నాందేడ్ ఈ నాలుగు జిల్లాల్లో సుమారుగా 18వేల మంది ముస్లింలను ఊచకోత కోశారు. ఔరంగాబాద్, నల్లగొండ, మెదక్ జిల్లాల్లో 3,500 నుండి 4వేల మందిని హతమార్చారు. హైదరాబాద్ సంస్థానంలో 30 వేల మంది ముస్లింలు చంపబడ్డారు. అనేక మసీదులు కూల్చి వేయబడ్డాయి. బలవంతపు మతమార్పిడులు జరిగాయి. దీనికి ప్రధాన కారణం హైదరాబాద్ సంస్థానం బయట నుండి సాయుధ శిక్షణ పొందిన హిందూ మతోన్మాద సంస్థకు చెందిన వారేనని నివేదికలో పేర్కొన్నారు. యూనియన్ సైన్యం, స్థానిక పోలీస్ యంత్రాంగంలో ఉన్న మతమౌఢ్యుల సహకారంతో ఈ దుర్మార్గాలు జరగడానికి మరొక కారణంగా తెలిపింది.

కమ్యూనిస్టులను అణిచేసే కుట్ర

పటేల్ సైన్యం రెండు వ్యూహాలతో హైదరాబాద్‌లోకి ప్రవేశించింది. ఒకటి నైజాం నవాబును విలీనం కోసం ఒప్పించడం, రెండు కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మూలించడం. ఇది స్వయంగా ఆనాటి గవర్నర్ జనరల్ రాజాజీ చేసిన ప్రకటన. అప్పటికే రెండు జిల్లాలకు పైగా కమ్యూనిస్టుల ఆదీనంలోకి వెళ్లాయి. వారి పట్టు

> 1950-51 పరిపాలన నివేదికల ప్రకారం 500 ఎకరాల పైబడిన భూమి పట్టా గలిగిన భూస్వాములు 550 మంది ఉండేవారు. వీరి పొలాల్లో, ఇండ్లల్లో వృత్తిదారులు, వ్యవసాయ కార్మికులు, సన్న చిన్నకారు రైతులు ఉచితంగా నిర్బంధ వెట్టిచాకిరి చేసే స్థితికి నెట్టబడ్డారు. ఈ విధానం రద్దు కోసం ఆంధ్ర మహాసభ సంఘం ఇచ్చిన పిలుపునందుకొని వీరనారి చాకలి ఐలమ్మ పోరాటానికి నడుం బిగించింది. 1920లో విసునూరు దేశముఖ్ గుండాల చేతిలో షేక్ బందగి, జఫర్గడ్ జాగీర్దార్ ఖాదర్ ఆలీ, మహమ్మద్ ఖాసిం, దొడ్డి కొమరయ్య హత్య గావించబడ్డారు. నిజాం అరాచకాలపై కలాన్ని ఎక్కుపెట్టిన షోయబుల్లాఖాన్‌ను హైదరాబాద్ నడిబొడ్డున హతమార్చారు. ఇలా అనేకమంది పేద ముస్లిం రైతాంగం వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు.ఇలాంటి పోరాటాన్ని ముస్లింలపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రించడం బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనం.

సంస్థానం మొత్తం వ్యాపించే ప్రమాదముందని కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ పదేపదే చేసిన ప్రకటనలు చూస్తే పాలకవర్గాలకు కమ్యూనిస్టు ఉద్యమంపై పెరిగిన విద్వేషానికి నిదర్శనంగా చెప్పొచ్చు. ఆ పోరాటాన్ని అణచడం కోసం 50 వేల మంది సాయుధ బలగాలను రంగంలోకి దింపినా ప్రజలు కమ్యూనిస్టుల నాయకత్వంలో ముందుకు సాగారే తప్ప వెనక్కి తగ్గలేదు. ఆ పోరాట సంకల్ప ఫలితంగానే మూడు వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలను నెలకొల్పారు. భూస్వాములు, దొరలను వారి కోటలైన గడీల నుంచి తరిమికొట్టారు. పది లక్షల ఎకరాల భూమిని భూమిలేని పేదలకు పంచారు. రైతులను భూముల నుండి బేదాఖల్ చేయడం, వెట్టిచాకిరీ, అధిక వడ్డీల వ్యాపారం వంటి చర్యలు రద్దు చేయించారు. వ్యవసాయ కార్మికులకు కూలి రేట్లు పెంచి కనీస వేతనాలు అమలు పరిచారు. ఆటవిక తెగల ప్రజలను పీడించే ఫారెస్ట్ అధికారుల బృందాలను అడవుల నుంచి తరిమారు. రెండు వేల మంది గెరిల్లా సాయుధ దళ సభ్యుల అండతో లక్షలాదిమంది ప్రజలు మొదటిసారి రెండు పూటలా భోజనం చేయగలిగారు. ఇదీ వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర. దీన్ని బీజేపీ-ఆరెస్సెస్ పరివారం వక్రీకరించేందుకు చేస్తున్న ప్రయత్నం దుర్మార్గం. దీన్ని తెలంగాణ సమాజం ఈసడించుకుంటోంది.

> 1948 సెప్టెంబర్ 13న పోలీస్ చర్య చేపట్టింది. కేవలం ఐదు రోజులకే 1948 సెప్టెంబర్ 17న నైజాం నవాబు లొంగిపోతున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ సైన్యాలు వెనక్కి తిరిగిపోకుండా 1951 అక్టోబర్ 1 వరకు హైదరాబాద్ సంస్థానంలో ఉన్నాయి. ఎవరికి రక్షణ కోసం పటేల్ సైన్యం ఉన్నదో? లొంగిపోయిన ప్రజాకంఠకుడైన నైజాం నవాబు, రజాకార్ సైన్యం అధ్యక్షుడు కాసీం రజ్వీలను అరెస్టు చేసి ఎందుకు శిక్షించలేదో బీజేపీ నేతలే సమాధానం చెప్పాలి? పైగా నెహ్రూ ప్రభుత్వం నైజాం నవాబుతో లాలూచి పడింది. హైదరాబాద్ సంస్థానానికి రాజ్‌ప్రముఖ్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. రాచ మర్యాదలతో ప్రత్యేక విమానంలో రాజుతో పాటు కుటుంబీకులను, కాసీం రజ్వీని పాకిస్తాన్‌కు పంపింది. ప్రజల ఆగ్రహానికి బలి కావాల్సిన వీరికి పటేల్ సైన్యం విమోచన కలిగించింది తప్ప హైదరాబాద్ సంస్థానానికి కాదు.

అసమానతల భారతం



జి వెంకటేశ్వరరావు
9966135289

భారత రాజ్యాంగ పీఠికలో భారతదేశాన్ని సామ్యవాద దేశంగా ప్రకటించుకున్నాము. ఆదేశిక సూత్రాల్లో ఆర్టికల్ 39సి సంపద కేంద్రీకరణ కాకుండా చూడాలని సూచించింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75వ సంవత్సరంలో అడుగుపెట్టిన ఈ తరుణంలో సంపద కేంద్రీకరణపై ప్రపంచ అసమానతల ల్యాబ్, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి సంస్థ సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలోని అంశాలు రాజ్యాంగ లక్ష్యాలకు వ్యతిరేక దిశలో దేశం ఎంతవేగంగా పయనిస్తుందో తెలియజేస్తోంది. దిగువ 50 శాతం మంది తలసరి ఆదాయం మొదటి పది శాతం మంది తలసరి ఆదాయం కన్నా 20రెట్లు తక్కువగా ఉంది. మొత్తం జాతీయాదాయంలో మొదటి 10శాతం దగ్గర 57శాతం, మొదటి ఒక శాతం మంది దగ్గర 22 శాతం సంపద పోగుబడింది. ప్రపంచంలోనే అత్యంత అసమానతల దేశంగా పేదలు(22.89 కోట్లు)ఎక్కువగా ఉన్న దేశంగా భారతదేశం మారిపోయింది. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2030 నాటికి ఏడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మారుస్తామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు పెరిగిన సంపద దేశ ప్రజలకు పంపిణీ చేయడంలో శ్రద్ధ వహించడం లేదు.మొదటి పదిశాతం మంది వద్ద మూడింట రెండు వంతుల సంపద చేరితే అది దేశ అభివృద్ధి అవుతుందా?సంపదను సృష్టిస్తున్న అధిక శాతం మంది ప్రజల వద్దకు ఈ సంపద చేరకుండా దేశ అభివృద్ధి సాధ్యమా? నాడు 'దేశమంటే మట్టి కాదు.. దేశమంటే మనుషులని' గురజాడ అంటే నేటి పాలకులు దేశమంటే ఆ పది శాతం మందే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. వారి కోసమేనా సంస్కరణలన్నీ?

బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో (1858-1947) మొదటి 10శాతం మంది వద్ద దాదాపుగా 50శాతం సంపద కేంద్రీకరించబడింది. స్వాతంత్ర్యానంతరం సామ్యవాద స్ఫూర్తితో అమలు చేసిన పంచవర్ష ప్రణాళికలు ఈ సంపద కేంద్రీకరణను 35 శాతానికి తగ్గించాయి.కానీ 1990 నుంచి ప్రారంభించిన నూతన ఆర్థిక సంస్కరణలు ఈ 34 సంవత్సరాల అమలులో అసమానతల్ని తీవ్రంగా పెంచాయి.ఈ సంస్కరణల వలన లబ్ధి పొందింది మొదటి ఒక శాతం బిలియనీర్లు మాత్రమే. దిగువ, మధ్యతరగతి ప్రజల అభివృద్ధి చాలా మందకొడిగా ఉందని నివేదికలు తెలియజేస్తున్నాయి దిగువ 50 శాతం మంది వద్ద 6శాతం సంపద ఉంటే మొదటి 10శాతం దగ్గర 65శాతం ,మొదటి ఒక శాతం దగ్గర 33శాతం సంపద పోగుబడిందంటే ఈ సంస్కరణలు సంపన్నులకు ఏ విధంగా ఉపయోగపడ్డాయో అర్థం చేసుకోవచ్చు.2023లో విడుదల చేసిన ఆక్స్ఫామ్ నివేదిక కూడా మొదటి 30 శాతం మంది వద్ద 90 శాతం సంపద చేరిందని పేర్కొంది. ఇదే కాలంలో బిలినియర్ల సంఖ్య 2020లో 102 నుంచి 2022 నాటికి 166కి చేరింది. మొదటి వందమంది ధనవంతుల మొత్తం సంపద రూ.54.12 లక్షల కోట్లు, మొదటి పదిమంది ధనవంతుల రూ.27.52 లక్షల కోట్లకు చేరింది.వీరి సంపద 2021 నుండి 32.8శాతం పెరిగింది.

> ఈ సంపద కేంద్రీకరణను తగ్గించడం కోసం పన్నుల విధానంలో మార్పులు చేయవలసిన అవసరం ఉంది.కానీ ప్రస్తుత పాలకుల పన్నుల విధానం అసమానతలు తగ్గించకపోగా మరింత పెంచేలా ఉన్నాయి. సంపన్నులపై పన్నులు వేయడం ద్వారా వచ్చిన ఆదాయం విద్య ,వైద్యం, ఉపాధి వంటి ప్రజా అవసరాలపై ఖర్చు చేయడం ద్వారా ప్రజల ఆదాయాన్ని పెంచవచ్చు. కానీ పాలకులు ఒకవైపు పేదలపై పన్నులు ఎక్కువగా వేయడం, ప్రజా అవసరాలపై ఖర్చును తగ్గించడం, మరోవైపు కార్పొరేట్లకు రాయితీలివ్వడం, రుణమాఫీలు చేయడం, ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కట్టబెట్టడం వంటి విధానాల ద్వారా కార్పొరేట్ల వైపు నిలబడుతున్నారు. ఈ విధానాలు ప్రజల జీవితాలలో వెలుగులు నింపకపోగా కారు చీకట్లను అలుముకునేలా చేశాయి.



ఈ సంపద కేంద్రీకరణను తగ్గించడం కోసం పన్నుల విధానంలో మార్పులు చేయవలసిన అవసరం ఉంది.కానీ ప్రస్తుత పాలకుల పన్నుల విధానం అసమానతలు తగ్గించకపోగా మరింత పెంచేలా ఉన్నాయి. సంపన్నులపై పన్నులు వేయడం ద్వారా వచ్చిన ఆదాయం విద్య వైద్యం, ఉపాధి వంటి ప్రజా అవసరాలపై ఖర్చు చేయడం ద్వారా ప్రజల ఆదాయాన్ని పెంచవచ్చు. కానీ పాలకులు ఒకవైపు పేదలపై పన్నులు ఎక్కువగా వేయడం, ప్రజా అవసరాలపై ఖర్చును తగ్గించడం, మరోవైపు కార్పొరేట్లకు రాయితీలివ్వడం, రుణమాఫీలు చేయడం, ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కట్టబెట్టడం వంటి విధానాల ద్వారా కార్పొరేట్ల వైపు నిలబడుతున్నారు. ఈ విధానాలు ప్రజల జీవితాలలో వెలుగులు నింపకపోగా కారు చీకట్లను అలుముకునేలా చేశాయి. ప్రజలు వాడుకునే నిత్యావసరాలపై పన్నులు పెంచడమనేది అసమానతలకు దారితీస్తుంది.పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై ఎక్సైజ్ డ్యూటీని పెంచడం ద్వారా 2014-15లో రూ.99 వేల కోట్ల నుండి 2021 నాటికి 3.73 లక్షల కోట్ల రూపాయలను (277శాతం పెరుగుదల) ప్రజల నుంచి వసూలు చేశారు. పెట్రోలు 79 శాతం, డీజిల్ 101 శాతం, వంట గ్యాస్ 300శాతం ధరలు పెంచడమనేది ఒక ఉదాహరణ మాత్రమే. పేదలు వారి సంపాదనలో అధిక భాగం పన్నులకు చెల్లించవలసి వస్తుంటే వారి జీవన ప్రమాణాలు ఏరకంగా మెరుగవుతాయి? దిగువ 50శాతం మంది మొదటి 10 శాతం మంది కంటే ఆరు రేట్లు ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నారు. ఆహార, ఆహారేతర ఉత్పత్తులపై పన్నులలో 64.3శాతం పన్నులు దిగువ 50 శాతం మంది ప్రజలు నుండే వసూలు చేస్తున్నారు.

మొత్తం జీఎస్టీలో మూడింట రెండువంతుల పన్నును దిగువ 50 శాతం మంది నుండి ,మొదటి 10 శాతం మంది నుంచి 3శాతం నుంచి 4శాతం పన్నులు మాత్రమే రాబెట్టేలా పన్ను విధానాన్ని రూపొందించారు. పేదరిక స్థాయిని తగ్గించి చూపడం ద్వారా పేదలు తగ్గినట్లు చెబుతున్న లెక్కలలో బూటకాన్ని పోషక ఆహారంపై, విద్యా, వైద్యంపై వినియోగ స్థాయిని బట్టబయలు చేస్తున్నాయి. పోషకాహార లోపంతో కూడిన వ్యాధులతో ప్రతి సంవత్సరం1.7 మిలియన్ల ప్రజలు చనిపోతున్నారంటేనే దేశంలోని పేదరికం ఏ స్థాయిలో విజృంభిస్తుందో అర్థం చేసుకోవచ్చు. భారతదేశంలోని బిలినియర్లపై మూడు శాతం పన్నుల ద్వారా దేశం మొత్తం జాతీయ ఆరోగ్య పథకానికి మూడేండ్లకు అవసరమైన (37,800 కోట్ల)నిధులను సేకరించవచ్చు.

మొదటి 10 శాతం మందిపై కేవలం 5 శాతం పన్ను ద్వారా ఐదేండ్ల పాటు దేశంలోని గిరిజనులందరి ఆరోగ్యాన్ని అందించవచ్చు. దేశంలోని బిలియనీర్లపై కేవలం రెండు శాతం పన్ను ద్వారా మూడేండ్ల పాటు ఒక్కరికి కూడా పోషకాహార లోపం లేకుండా చేయవచ్చు. మొదటి 100మంది పై 2శాతం పన్ను ద్వారా జీడీపీలో ఆరోగ్య రంగంపై 3శాతం నిధులను ఖర్చు పెట్టవచ్చు. మొదటి పదిమందిపై కేవలం 5శాతం పన్నుల ద్వారా దేశంలో బడిబయట పిల్లలందరినీ పాఠశాలలోచేర్చి విద్య అందించవచ్చు. మొదటి 10 మందిపై కేవలం ఒక శాతం పన్ను ద్వారా 13ఏండ్ల పాటు ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేసి నాణ్యమైన విద్యనందించవచ్చు. కానీ దీనికి విరుద్ధంగా కార్పొరేట్ పన్నును 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించారు,14.5 లక్షల కోట్ల కార్పొరేట్ల రుణాలను నిరార్థక ఆస్తుల పేరుతో రద్దు చేశారు.

దేశ సంపదను సంపద సృష్టించే వారికి చేర్చకుండా ప్రజల జీవన ప్రమాణాలను, ఆనందాన్ని ఎలా పెంచగలం? దేశంలో వెలుగులను ఎలా నింపగలరు? అందుకే దేశ ప్రజలుపెరిగిన సంపదలో మా వాటా ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు? ఈ అసమానతలు దేశంలో వారి ఆనందాన్ని ఆవిరిచేశాయి. అందువలన గ్యాలప్ వరల్డ్ పోల్ సంస్థ వారు విడుదల చేసిన ఆనందదాయక దేశాల జాబితా-2024లో భారతదేశం 149 దేశాలలో 126వ స్థానంలో ఉంది. మన పొరుగునే ఉన్న పాకిస్తాన్, నేపాల్ కన్నా దిగువన ఉన్నాము.సంపదలో మా వాటా మాకేనని ఈ అసమానతలకు కారణమైన నూతన ఆర్థిక సంస్కరణలు, ప్రయివేటీకరణ విధానాలపై ప్రజలు పోరాడుతున్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ - భగత్‌నగర్

ఇటీవల కరీంనగర్ జిల్లా కోర్టులో నిర్వహించిన ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం అధ్యక్షుడు పి.వి.రాజ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి కార్యవర్గ సభ్యులను అభినందించి శాలువాలతో సత్కరించారు. అనంతరం అయన మాట్లాడుతూ రానున్న కాలంలో న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, కార్యదర్శి కార్యదర్శి బీమాసాహెబ్, స్పోర్ట్స్ సెక్రటరీ మడిపల్లి రవి, లైబ్రరీ సెక్రెటరీ కటకం రాజేందర్, మహిళా ప్రతినిధి దేవులపల్లి రేణుక, సీనియర్ సభ్యులు సుంకే దేవాకిషన్, కందుల అరుణ్ కుమార్, మాతంగి రవీందర్, జూనియర్ ఈసి సభ్యులు బెజ్జంకి శ్రీకాంత్, కొంద్ర లక్ష్మయ్య, పస్తం ఆంజనేయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తే జోడెద్దుల అభివృద్ధి

వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఎమ్మెల్యే గంగుల కమలాకర్

నవతెలంగాణ - కరీంనగర్



ఎన్నికల ప్రచారంలో గంగుల కమలాకర్, వినోద్‌కుమార్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ని భారీ మెజారిటీతో గెలిపిస్తే కరీంనగర్ అభివృద్ధి జోడెద్దుల పరిగెడుతుందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కిసాన్‌నగర్ 3, 25వ డివిజన్‌లో మార్నింగ్ వాకర్స్, డివిజన్ ప్రముఖులతో అభ్యర్థి వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కిసాన్‌నగర్ అభివృద్ధిలో వెనుకబడిందని, ఈ ప్రాంతంలో ఎక్కువగా బడుగు బలహీన వర్గాలు, వెనుకబడిన కులాలు నివసించే వారని, గత పాలకులు వారి సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసిన రోడ్ల మీద మురుగు కాలువలు, దుమ్ము దూళి దర్శనం ఇచ్చేవని, తాగునీటికి కటకట ఉండేదని తెలిపారు. కరీంనగర్‌ను స్మార్ట్ సిటీ జాబితాలో చేరిస్తేనే అభివృద్ధి జరుగుతుందని గ్రహించి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకత తనతో పాటు అప్పటి ఎంపీ వినోద్ కుమార్, మున్సిపల్ పాలకవర్గం సభ్యులు అంతా ఢిల్లీకి వెళ్లి అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడుని కలిసి కరీంనగర్ సిటీని స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. తమ విజ్ఞప్తితో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కరీంనగర్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ అర్హత లేకున్నా స్మార్ట్ సిటీ జాబితాలో చేర్పించారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక స్మార్ట్ సిటీ నిధులతో పాటు ముఖ్యమంత్రి హామీ నిధులు రూ.360కోట్లతో కరీంనగర్ నగరాన్ని అద్దంలా తీర్చిదిద్దామని తెలిపారు. కరీంనగర్ ప్రజల జీవన ప్రమాణాలు పెంచామని, కరీంనగర్ రాష్ట్రంలో రెండో నగరంగా మారిపోయిందని అన్నారు. కరీంనగర్‌కు ఇప్పటికే తాను ఎమ్మెల్యేగా ఉన్నానని, ఎంపీగా వినోద్ కుమార్ గెలిస్తే రాష్ట్ర నిధులతో కేంద్ర నిధులు వస్తాయని, కరీంనగర్ అభివృద్ధి జోడెద్దుల పరిగెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాళేశ్వరం జలాలతో తాగు, సాగునీటికి ఢోకా లేదని తెలిపారు.

కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుంది

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్



కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న శ్రీనివాస్

నవతెలంగాణ - మానకొండూర్

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించకుండా ఉపాధి హామీ పనులను నిర్వీర్యం చేస్తూ, చట్టాన్ని ఎత్తివేసే కుట్రలుచేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పర్యటించి ఉపాధి హామీ కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు గత సంవత్సరం చేసిన పనులకు డబ్బులు ఇప్పటికి చెల్లించకపోవడం దారుణం అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకూలి రూ.6వందలు ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రోజుకు రెండుసార్లు ఫొటోలు తీయాలని నిబంధనలు పెట్టడం మూలంగా ఎండలో పనిచేస్తున్న కూలీలకు వడదెబ్బ తాకి అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అమ్మాయిల భద్రత కోసమే షీ టీం..

ఏఎస్ఐ విజయమణి

నవతెలంగాణ - తిమ్మాపూర్



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏఎస్ఐ

మహిళలు, అమ్మాయిల భద్రత కోసమే షీ టీం ఏర్పడిందని షీ టీం ఎస్ఐ విజయమణి అన్నారు. మండలంలో నేదునూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ అంబాసిడర్ ఇన్వెస్టి టూర్ సెరిమని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ క్రైమ్ జరిగితే 1930నెంబర్‌కు డయల్ చేయాలని చెప్పారు. సోషల్ మీడియాలో అమ్మాయిలు డీపీలుగా తమ ఫొటోలు షేర్ చేయొద్దన్నారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో ఎలాంటి ఫొటోలు షేర్ చేయకూడదు అన్నారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి విద్యార్థులకు వివరించారు. అమ్మాయిలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ఫోన్లో వచ్చి ఎలాంటి లింకులను క్లిక్ చేయరాదని సూచించారు. 18 సంవత్సరాలలోపు వారు వాహనాలను నడపొద్దని, అలా జరిగితే తల్లిదండ్రులు బాధ్యులవుతారని చెప్పారు. సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫామ్‌లో అంబాసిడర్ కోర్స్ పూర్తి చేసిన అరుణ్‌తేజ్, శ్వేత, అఖిల, సజన్‌కు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ పుష్పలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు, పద్మ, అనిస్, ఫాతిమా ప్రభాకర్ పాల్గొన్నారు.

దేశరాజుపల్లిలో పోలీసు కవాతు

నవతెలంగాణ - రామడుగు



పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని చొప్పదండి సీఐ ప్రకాష్‌గౌడ్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీసులు, కేంద్రబలగాలతో మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో శనివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రామడుగు ఎస్ఐ యం.సురెందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం ఉదయం 7.35గంటలకు ఒక గుర్తు తెలియని పురుషుడు వయస్సు సుమారు 25-30 సంవత్సరాలు రైల్వే స్టేషన్ ఎగువ మేయిన్ లైన్ రైల్వేట్రాక్ మధ్యన కూర్చుండి తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. బ్లూ ఫుల్ షర్ట్‌పై తెలుపు చుక్కల డిజైన్ కలదు. నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. నలుపు తల వెంట్రుకలు గడ్డం కలవు. శవాన్ని జమ్మికుంట గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీలో భద్రపర్చామని, వివరాలు తెలిసినవారు 9949304574, 8712658604 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం తెలుపాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోరారు.

భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేపట్టాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఇల్లందకుంటలో శ్రీరామనవమి వేడుకల ఏర్పాట్లపై సమీక్ష

నవతెలంగాణ - కరీంనగర్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

ఇల్లందకుంటలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు భక్తులు మెచ్చేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి 17వ తేదీన సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలు, శ్రీరామనవమి వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై బుధవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎండాకాలం నేపథ్యంలో శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. చలువ పందిళ్లు, క్యూ లైన్లు, బారికేడ్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, 108, 104 వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఎక్కడికక్కడ భక్తుల కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయాలని, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆలయ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, ఆర్టీసీ అధికారులు భక్తులకు అవసరమైన బస్సులను ఇల్లందకుంట వరకు నడిపించాలని సూచించారు. 17న సీతారాముల కల్యాణం, 24న జరిగే పెద్ద రథం కార్యక్రమానికి భక్తులు లక్షలాదిగా తరలివచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చేపట్టాల్సిన ఏర్పాట్లు, పనులపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డీఆర్ఓ పవన్ కుమార్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీఓ రవీందర్, జిల్లా వైద్యాధికారి సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కే.మహేశ్వర్, రమేష్ బాబు, ఇల్లందకుంట ఆలయ ఈవో కే.సుధాకర్, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి..

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, పనుల నిర్వహణపై సమీక్ష

జిల్లా, మండల సమైక్య సంఘాల ప్రతినిధులు పాఠశాలలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంఈఓలు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, జిల్లా, మండల సమైక్య సంఘాల ప్రతినిధులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, పాఠశాలలో చేపట్టాల్సిన పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమైక్య సంఘాల ప్రతినిధులకు సూచించారు. మనస్ఫూర్తిగా పని చేస్తూ పాఠశాలల రూపు రేఖలు మార్చాలన్నారు. పాఠశాలల్లో టాయిలెట్స్, కిచెన్ షేడ్స్, కాంపౌండ్ వాల్స్, అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సరఫరాతో పాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పనులు చేపట్టడంలో వీవో అధ్యక్షురాలు కీలకంగా వ్యవహరిస్తారని తెలిపారు. పాఠశాలల్లో చక్కగా పనులు చేసి సంఘాల ప్రతినిధులు ఇతరులకు రోల్ మోడల్‌గా నిలవాలని సూచించారు. పనులు చేయించినందుకు మూడు శాతం అడ్మినిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వం అందిస్తుందని, దీంతో అదనపు ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. వారం రోజుల్లోగా మండల స్థాయిలో పనుల నిర్వహణపై వర్క్ షాప్ లు పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాలకు ఇదొక మంచి అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో అన్ని పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈఓ జనార్దన్ రావు, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీఓ రవీందర్, డీఆర్డీఓ శ్రీధర్, మెప్మా పీడీ రవీందర్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపా రాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్

నవతెలంగాణ - చొప్పదండి



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్

ఉపాధి హామీ పథకంలో కూలీలకు పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఆర్నకొండ గ్రామంలో ఉపాధి పనుల పనిప్రదేశాలకు వెళ్లి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు మూడు నెలల నుండి డబ్బులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారి కూలి 300 రూపాయలు ప్రకటించి, రోజుకు 120 నుంచి 150 వరకు అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రంలో పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలీలకు 600 రూపాయలు ఇస్తుంటే ఇక్కడ మాత్రం అది అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాద బీమా 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకు గడ్డపార, గంపలు, పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సునీత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని చొక్కారావుపల్లి, యస్వాడ, చాకలివానిపల్లి, మాదాపూర్, గోపాలపూర్ గ్రామాలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి అటికం తిరుపతిగౌడ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్ట్ ప్రకాష్‌కు ఎమ్మెల్యే గంగుల పరామర్శ



నవతెలంగాణ - కరీంనగర్

నమస్తే తెలంగాణ బ్యూరో చీఫ్ కడపత్రి ప్రకాష్ తల్లి సావిత్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం (చీర్లవంచ) నాయిని వానిపల్లి గ్రామంలో ఆయన కుటుంబాన్ని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. ఆయన వెంట నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, వైస్ ఎంపీపీ బుక్య తిరుపతినాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రెడ్డవేణి మధు తదితరులున్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



నవతెలంగాణ - గంగాధర

ఆత్మ రక్షణకు కరాటే దోహదపడుతుందని అమెచ్యూర్ టేక్వాండో కరీంనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ కుమార్, ఒకినోవ మార్షల్ ఆర్ట్స్ ఛీప్ వసంత్ కుమార్ అన్నారు. గంగాధర మధురానగర్ చౌరస్తాలోని సురభి కాన్వెంట్ హై స్కూల్, గంగాధరలోని వివేకానంద హై స్కూళ్లలో కరాటే బెల్టుల ప్రదానోత్సవం జరిగాయి. కరాటే పోటీలలోని వివిధ భాగాలలో ప్రతిభ కనబరిచిన సురభి హైస్కూల్ కు చెందిన 62 మంది విద్యార్థులు, వివేకానంద హైస్కూల్ కు చెందిన 120 మంది విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్, వసంత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో పాటు సమాజంలో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు కూడా కరాటే నేర్చుకోవాలని, అమ్మాయిలు కరాటే నేర్చుకోవడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. అమ్మాయిలు కరాటే నేర్చుకోవడం వల్ల కలిగే లాభాలు ఏమిటో వివరిస్తూ ఇటీవల హైదరాబాద్ లో జరిగిన సంఘటనను గుర్తు చేశారు. ఈ సందర్భంగా సురభి హైస్కూల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో వివేకానంద విద్యాలయం కరస్పాండెంట్ పర్రెం లక్ష్మారెడ్డి, సురభి స్కూల్ కరస్పాండెంట్ చిప్ప వీరేశం, హెచ్ఎంలు అనంతరెడ్డి, ఉషారాణి, డైరెక్టర్ వీరనర్సయ్య, టేక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, కోచ్ సిహెచ్ రాజేందర్, కోచ్ సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొన్న జివిఆర్

నవతెలంగాణ - మానకొండూర్

మానకొండూర్, సదశివాపల్లి, శ్రీనివాస్‌నగర్ గ్రామాల గౌడ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మతల్లి బోనాల జాతరలో బుధవారం బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణారావు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గడ్డం నాగరాజు, మాజీ సర్పంచులు రొడ్డ పృథ్వీరాజ్, రామంచ గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతుల పేర బీజేపీ దొంగ దీక్ష సిగ్గుచేటు

-సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం

నవతెలంగాణ - కరీంనగర్



రైతులకు నష్టం కలిగించి, కార్పొరేట్ శక్తుల జేబులు నింపడానికి తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా పోరాటం చేస్తున్న 12వందల మంది రైతుల ప్రాణాలను బలి గొన్న బీజేపీ ప్రభుత్వం, కరీంనగర్‌లో రైతుల పేరు మీద దొంగ దీక్షలు చేయడం సిగ్గుచేటని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. కరీంనగర్ నియోజకవర్గానికి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఏమి అభివృద్ధి సాధించారని, మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. రైతుల ఉద్యమానికి తలొగ్గి, మీడియా ముందే క్షమాపణ కోరిన నరేంద్ర మోడీ, రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని, అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చి ఇప్పటికి అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. పైగా రైతులపై ప్రేమ ఉన్నట్లు ఎన్నికల ముందు ఓట్ల కోసం దొంగ దీక్షలు చేస్తున్నారని, కార్మిక, రైతు, మహిళా వ్యతిరేక బీజేపీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించారని, ఉత్తరప్రదేశ్‌లో కులదురంకార హత్యలు, మానభంగాలు, అత్యాచారాలు జరుగుతుంటే బీజేపీ ప్రభుత్వం చేష్టలుడిగి చూసిందని, దేశ వ్యాప్తంగా కార్మికులకు నష్టం కలిగించే విధంగా లేబర్ చట్టాలను కుదించి, కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే విధంగా 4లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని పది సంవత్సరాల క్రితం ఎన్నికల హామీలు ఇచ్చి యువతను మోసం చేసిందని అన్నారు. దేశ సంపదనంతా కార్పొరేట్ కంపెనీలకు నరేంద్ర మోడీ అమ్ముకుంటారని, రాజ్యాంగాన్ని మార్చి దేశ సమగ్రతకు, ఐక్యతకు విఘాతం కలిగిస్తారని అన్నారు. మతకల్లోలాలు సృష్టించి, రాజకీయ పబ్బం గడుపుకుంటారని, ప్రజలు ఆలోచించి బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కరీంనగర్ నియోజకవర్గ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ నగరాన్ని అభివృద్ధి చేయకుండా ఎన్నికల ముందు రైతు దీక్షలు, ప్రజాహిత యాత్రలు చేస్తున్నారని, అవి ప్రజాహిత యాత్రలు కాదని, ప్రజాహత యాత్రలని ఎద్దేవా చేశారు.

ఇష్టానుసారంగా ముందస్తు అడ్మిషన్లు..

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్

నవతెలంగాణ - కరీంనగర్

జిల్లాల్లో ప్రయివేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ముందస్తు అడ్మిషన్లు, వేసవి తరగతులు నిర్వహిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయివేట్ జూనియర్ కళాశాలలు ఎలాంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వివిధ కోర్సుల పేరు మీద, పండగల పేరు మీద, వివిధ ఆకర్షణీయమైన పేర్లు పెట్టి విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ ఫీజుల రాయితీ ఇస్తామంటూ ఇష్టానుసారంగా అడ్మిషన్లు చేపడుతున్నా జిల్లా ఇంటర్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికే కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు ఇంకా ఫలితాలు రాకముందే రెండో సంవత్సరం తరగతులు నిర్వహిస్తూ, ఒక్కో విద్యార్థి నుంచి 50 శాతం శాతం ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి విద్యా ప్రమాణాలు పాటించకుండా ఇరుకు గదులలో తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిబంధనలు పాటించని జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'కాంగ్రెస్ ఎంపీ టికెట్ వెలిచాల రాజేందర్‌రావుకు ఇవ్వాలి'

నవతెలంగాణ - భగత్‌నగర్



కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావుని అధిష్టానం వెంటనే ప్రకటించాలని కాంగ్రెస్ నాయకులు గండి రాజేశ్వర్, పులి నర్సింగరావు కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెలిచాల జగపతిరావు పార్టీకి చేసిన సేవలు మరువలేనివని, ఆయన తనయుడు రాజేందర్‌రావు తండ్రి సమర్థవంతమైన నాయకుడని అన్నారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడంతో ప్రచారం చేసే సమయం లేక ఓటమి పాలైందని ఈ విషయం కార్యకర్తలను నిరాశ గురిచేసిందని తెలిపారు. ఇప్పటికైనా ఈ విషయాన్ని గుర్తించి కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పరిశీలకులుగా ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ జాప్యం చేయకుండా బలమైన అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుని ప్రకటిస్తే ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తద్వారా కరీంనగర్ పార్లమెంటరీ స్థానం గెలుపుని అధిష్టానానికి కానుక ఇచ్చి కాంగ్రెస్ పార్టీ కేంద్రం లో ప్రభుత్వ ఏర్పాటు చేసేలా కృషి చెయ్యాలని వారు విజ్ఞప్తి చేశారు.


రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ -హుజురాబాద్



జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఏప్రిల్ 2 నుండి 8 వరకు నిర్వహించే రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని బుధవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాల మహానాడు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కాడే శంకర్ మాట్లాడుతూ.. న్యాయం, సమానత్వం సౌభ్రాతృత్వం మూల స్తంభాలుగా భారత రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందిస్తే నేడు కేంద్ర ప్రభుత్వ పాలనలో రాజ్యాంగంలోని మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసం అవుతున్నాయని అన్నారు. జీవించే హక్కు మాట్లాడే హక్కు కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 5న కరీంనగర్‌లో నిర్వహించే యాత్రలో హుజురాబాద్ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గూడ కనకయ్య, ప్రచార కార్యదర్శి తాళ్ల వెంకన్న, నాయకులు దామెర సత్యం, తొగరు స్వామి, సొల్లు బాబు సొల్లు దశరథం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలో తెలంగాణ వీరుడు దొడ్డి కొమురయ్య 97వ జయంతిని కురుమ సంఘం నాయకులు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జిట్ట కుమార్, ఉపాధ్యక్షుడు నీట్టు మునిష్, రాజన్నల తిరుపతి, గుంటి స్వరూప, శ్రీనివాస్, సంపత్, అనిల్, శ్రీనివాస్, వంశీ, రాకేష్ బీరయ్య, వంశీ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కరీంనగర్

కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. చలివేంద్రంలో డీఎంహెచ్ఓ సుజాత సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుధాకర్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంఘం లక్ష్మణరావు రాగి శ్రీనివాస్, మహిళా జేఏసీ చైర్మెన్ ఇరుమల శారద, సుమలత, టీఎన్జీవోస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జగిత్యాల
గురువారం | ఏప్రిల్ 4, 2024 | www.navatelangana.com

సింగరేణి అభివృద్ధిలో సూపర్‌వైజర్లది కీలక పాత్ర



అభివాదం తెలుపుతున్న సూపర్ వైజర్లు

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ

సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికులతో పాటు సూపర్‌వైజర్లది కీలక పాత్ర అని, సంస్థ స్థితిగతులను కార్మికులకు వివరిస్తూ సంస్థ పురోభివృద్ధికి మరింత అంకిత భావంతో పని చేయాలని ఓసీపీ.1 పీఓ ఎస్ రాధాకృష్ణ కోరారు. ఓసీపీ.1 కాన్ఫరెన్స్ హాల్‌లో బుధ వారం సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. పోటీ మార్కెట్లో సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే ఉత్పాదకత మరింత పెరగాలని, దీనికోసం ప్రతి అధికారి, సూపర్వైజర్, కార్మికుడు పూర్తి పని గంటలు సద్వినియోగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కంపెనీని లాభదాయకంగా నడిపిస్తే కార్మికులతో పాటు సూపర్వైజర్లకు కూడా తగిన విధంగా ప్రోత్సాహకాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓసిఎం.1 ప్రాజెక్ట్ ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్, గని మేనేజర్ ఉదయ్ హరిజన్, సేఫ్టీ ఆఫీసర్ అందె కోటయ్య, వెల్ఫేర్ ఆఫీసర్ సాయికృష్ణ ఆర్జీ ఓసిఎం 1లోని సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో అపరిశుభ్రం

నవతెలంగాణ-మేడిపల్లి



మేడిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో విరిగిన కుర్చీలు, తెలంగాణ హరితహారం సీడీలు, చీపుళ్ళు, ఇతర వ్యర్థ పదార్థాలతో అపరిశుభ్రంగా దర్శనమిస్తుంది. దీంతో వివిధ గ్రామాల నుంచి కార్యాలయానికి వచ్చే ప్రజాప్రతినిధులు, ఫిర్యాదు దారులు అధికారుల తీరు చూసి అవాక్కు అవుతున్నారు. మండల పరిషత్ కార్యాలయానే శుభ్రంగా ఉంచుకోలేని అధికారులు గ్రామాలపై ఏం శ్రద్ధ పెడుతారనే విమర్శలు వస్తున్నాయి.

గ్రామాల్లో దళారీల దందా!



తూకం వేస్తున్న మొక్కజొన్నలు

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలంలోని కట్లకుంట, పోరుమళ్ళ, తొంబర్రావుపేట, మేడిపల్లి, వల్లంపల్లి, దమ్మన్నపేట, గోవిందారం, భీమారం, మాచాపూర్, లింగంపేట గ్రామాలలో దళారీలు రైతుల వద్ద నుంచి వడ్లు, మొక్కజొన్నలు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ వారి మోసం చేస్తున్నారు. దళారీ వ్యాపారులపై జిల్లా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేసవి సెలవులలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

వేసవి సెలవుల్లో పిల్లలను జాగ్రత్తగా చూసుకో వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి సూచించారు. పట్టణానికి చెందిన ఏడుగురు యువకులు మోతె చెరువులో ఈతకు వెళ్లగా అందులో ఒక అబ్బాయి చెరువులో మునిగి మృతి చనిపోయాడు. అలాగే బైపాస్ రోడ్లో బైక్‌పై వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనదారుడు ఢీ కొట్టడంతో అబ్బాయి మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న తరుణంలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాని ప్రారంభించిన తహసిల్దార్ యాకన్న

నవతెలంగాణ-ఓదెల

ఓదెల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసిల్దార్ యాకన్న చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ యాకన్న మాట్లాడుతూ.. ఎండా కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎండ తీవ్రంగా పెరిగుతున్న సందర్భంగా ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు తహసిల్దార్ యాకన్నకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, చిలకడ ఎంపిటిసి రవీందర్ రెడ్డి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలిసిన తెలంగాణ పూసల, సంచార జాతుల సంఘం నాయకులు

నవతెలంగాణ-మంథని



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ సంచర జాతుల పూసల సంఘం నాయకులు గుడ్ల సమ్మయ్య ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం సమ్మయ్యతో పాటు సంచార జాతుల సంఘం నాయకులు నరేందర్,శ్రీనివాస్,కృష్ణ, సదానందం, కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పేట భాస్కర్‌కు సన్మానం



సన్మానిస్తున్న జమాతే ఇస్లాం హింద్ నాయకులు

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని జమాతే ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్‌ను సన్మానించారు. ప్రజా సమస్యలపై పోరాడి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చినందుకు గాను డాక్టరేట్ అవార్డు వచ్చిందని, పట్టణ జమాతే ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్త మహ్మద్ షేక్, చెన్న విశ్వనాథం, సుతారి రాములు, లతీఫ్, మసూద్, అలీ, అబ్దుల్లాఖాన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం:

అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ మండలంలోని వాల్గొండ నుండి ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్, యామాపూర్ గ్రామాల మధ్య నుండి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. కాగా మల్లాపూర్ మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన ఇస్లావత్ రాకేష్, బోధస్ భూమేష్ ఇద్దరి యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు

ఎండలు మండుతున్నా కార్మికులను పట్టించుకోరా?

ప్రాజెక్టు అధికారికి,కాలరీ మేనేజర్‌కి సీఐటీయూ వినతి పత్రం

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ



వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

రోజు రోజుకూ ఎండలు మండుతున్నా కార్మికులను పట్టించుకోరా అని సీఐటీయూ నాయకులు ప్రశ్నించారు. బుధవారం ఆర్జీ.2 ఏరియాలోని ఓసిపి త్రీ కృషి భవన్‌లో కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రాజెక్టు అధికారికి,కాలరీ మేనేజర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓసిపి.3లో మొదటి బదిలీ, రెండవ బదిలీ,రిలేటివ్ కార్మికుల డ్యూటీ సమయాలు మార్చాలని, డస్ట్ సమస్య మరింత ఎక్కువ ఉన్నందున అదనంగా వాటర్ ఫిల్లింగ్ పాయింట్స్ పెంచి మిషనరీల మెయింటెనెన్స్ సరిగ్గా చేసి ఓకే ఇవ్వాలని కోరారు. రెస్ట్ హాల్స్‌లో క్యాంటీన్లో కూలర్లు ఏర్పాటు చేయాలని, సర్ఫేస్ ఫీడర్ వద్ద పర్మినెంట్ ఏసి ట్రిప్ మ్యాన్ షెల్టర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులు ఎక్కువ మంది ఉన్నందున మంచినీటి సౌకర్యం మెరుగు పరిచి చల్లటి నీరు అందరికీ అందే విధంగా చూడాలని, ప్రాజెక్టులో పని చేసే వారికి ఎండ తీవ్రత తట్టుకునే విధంగా షెల్టర్లు, డ్రింకింగ్ వాటర్ ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ సమస్యలన్నీ తీర్చకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉదయం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఉల్లి మొగిలి, ఎస్‌సిఈయూ డివిజన్ అధ్యక్షులు కుంట ప్రవీణ్ కుమార్, చీఫ్ ఆర్గనైజర్ సెక్రెటరీ సంపత్,వైస్ ప్రెసిడెంట్ రామ్ ప్రసాద్, సహాయక కార్యదర్శి భూమయ్య, సాంబారావ్, ఓసిపి త్రీ ఫిట్ సెక్రెటరీ సారంగం, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ వినేష్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

అధిక ఉత్పత్తికి కారణమైన కార్మికులను యాజమాన్యం విస్మరిస్తోంది

కార్మికుల సమస్యలు తీరకపోవడానికి 'గుర్తింపు' లేకపోవడమే కారణం

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ



సమావేశంలో మాట్లాడుతున్న జిగురు రవీందర్

ఆర్జీ2 ఏరియాలో 2023-2024 సంవత్సరానికి సంబంధించి 102శాతం సాధించిన కార్మికుల శ్రమను గుర్తించడంలో మాత్రం యాజమాన్యం విఫలమైందని కనీసం స్వీట్ బాక్సులు కూడా ఇవ్వలేని దౌర్భాగ్యం ఉందని ఏఐటీయూసి ఆర్జీ.2 బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్ ఆరోపించారు. 8వ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఆర్జీ.2 102శాతం బొగ్గు ఉత్పత్తికి కారణమైన కార్మికులకు, అధికారులకు, కాంట్రాక్ట్ కార్మికులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. 7 సంవత్సరాల తరువాత వార్షిక టార్గెట్ 70.02 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించడంలో భాగస్వామ్యం కావడం గొప్ప విషయమన్నారు. సింగరేణి స్కూల్స్‌లలో సిబీఎస్ఈ సెలబస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా గెలిచినా కూడా లెటర్ ఇవ్వడం లేదని లెటర్ ఇప్పించి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారంలో సహకరించాలని కోరారు.అలాగే ఆర్జీ.2 ఏరియాలో 2023 నుండి రావాల్సిన ఈపి గ్రీజర్/హెల్పర్, హెచ్ఈఎంఎం జనరల్ మజ్దూర్, ఆఫీస్ అటెండెంట్, సర్వే మజ్దూర్, ఇష్యూ మజ్దూర్,ఈపి ఆపరేటర్,కంటిన్యూస్ మైనర్ ఆపరేటర్, జంబో ఆపరేటర్, ట్రిప్ మెన్ మొదలగు ఖాళీలను వెంటనే నింపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 11 మెన్ కమిటీ మెంబెర్, కేంద్ర ఉపాధ్యక్షులు ఎల్. ప్రకాష్ , బ్రాంచ్ ఉపాధ్యక్షులు బి.అన్నారావు, ఓసీపి.3 ప్రాజెక్ట్ సెక్రటరీ ఎజ్జే రాజయ్య, సహాయ కార్యదర్శి ఎం. మహేందర్ నాయకులు జి. వెంకటేష్, దేవేందర్ సింగ్, కె. సతీష్,డి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వృత్తి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్ రావు

నవతెలంగాణ-రామగిరి



మాట్లాడుతున్న సేవా అధ్యక్షురాలు ఎన్ అలివేణి

సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహించిన పలు ఉచిత వృత్తి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి పొందాలని సింగరేణి ఆర్జీ-3 ఏరియా సేవ అధ్యక్షురాలు ఎన్. అలివేణి సుధాకర్‌రావు అన్నారు. బుధవారం సెంటినరీకాలనీలోని సేవా భవన్‌లో టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, బ్యూటిషియన్ మొదలగు విభాగాలలో సెంటినరీ కాలనీలోని సేవాభవన్, రత్నాపూర్, జూలపల్లి, లద్నాపూర్, కల్వచర్ల, లొంకకేసారంలో నిర్వహించిన వివిధ ఉచిత వృత్తి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి సేవా అధ్యక్షురాలు ఎస్.అలివేణి సుధాకరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2023-24 సంవత్సరంలో వివిధ విభాగాలలో మొత్తం 11 బ్యాచ్‌ల నిరుద్యోగ మహిళలకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ శిక్షణను మహిళలందరూ సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి పొందుతూ, ఆర్థికంగా బలపడాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, కోఆర్డినేటింగ్ అధికారి గుర్రం శ్రీహరి, డి.వై.పి.ఎం సునీల్, సేవా సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సేవా సమితి సమన్వయ కర్త బి.రాయమల్లు, కె.సుధాకర్ లతోపాటు సేవా సభ్యులు, శిక్షకులు, మహిళలు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలి

మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య

నవతెలంగాణ-మంథని



మాట్లాడుతున్న నూకల బానయ్య

రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, మంథని డివిజన్ కన్వీనర్ ఎరుకల రమేష్‌లు కోరారు. బుధవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహనీయుల మాసోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 02 నుంచి 08 వరకు జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగ రక్షణ యాత్రను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామిక వాదులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఈ యాత్రకు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు కోరారు.అదే విధంగా పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నా గడ్డం వంశీ అభ్యర్థిత్వాన్ని మాలలందరు బలపర్చి పార్లమెంట్ ఎన్నికల్లో వంశీ గెలుపుకు సహకరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో మండల ప్రెసిడెంట్ జంజర్ల రాజు,జిల్లా ఉపాధ్యక్షుడు అప్పాల పోచమల్లు, నాయకులు బడికల లింగన్న, దాసరి గట్టయ్య, బడికెల మనోజ్,పొనగంటి రమేష్, జంజర్ల చందర్,జంజర్ల శ్రవణ్, రాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో అధికారుల ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-రామగిరి



పాల్గొన్న అధికారులు

రామగిరి మండలం పన్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం రామగిరి, ముత్తారం మండలాల పంచాయతీ కార్యదర్శులతో డిపిఓ లత మండల ఎంపీడీవో బి.శైలజ రాణి, ఎంపీఓలు సమ్మిరెడ్డి, వేణు, అలాగే డిఎల్ పిఓ శంకర్ ఆధ్వర్యంలో పలు సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో పెన్షనర్లు ఎవరైనా మరణిస్తే వెంటనే నమోదు చేయాలని కార్యదర్శిలను ఆదేశించారు. అలాగే ఏప్రిల్ మాసంలోనే ఎండలు 40 డిగ్రీలు దాటిపోవడంతో ఉపాధి హామీ కూలీలకు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎండి కరీమాబి, పూరెళ్ళి ఆకాష్ గౌడ్ ,అమల, పరుశరామ్, శ్రీనివాస్, శ్రీధర్ ,రామ్మోహన్, పోచం, సరిత, రమాదేవి, వనిత, స్వాతి, సంతోష్, రాకేష్, తిరుపతి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడిగా బాలే అంజయ్య

నవతెలంగాణ- పెగడపల్లి



అధ్యక్షుడిని సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరాజ్యం

పెగడపల్లి మండల కేంద్రంలో బుధవారం తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి లక్ష్మీరాజ్యం అధ్యక్షతన మండల అంబేద్కర్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బాలె అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా బత్తుల ప్రదీప్, ఉపాధ్యక్షులుగా సుంకే అంజయ్య, భూంపెల్లి ఏసురత్నం, సుంకే ప్రకాష్, కార్యదర్శిగా ఆరెల్లి నారాయణ, సహాయ కార్యదర్శి తడగొండ తిరుపతి, అధికార ప్రతినిధి శ్రీరాం అంజయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకుడు బొమ్మెన స్వామి, ఇరుగురాల లక్ష్మణ్, నల్లాల చందు, ఆత్మకూరి చందు, మోదుంపల్లి అంజయ్య, ఉప్పులేటి నరేష్ , అరికట్ల సంజీవ్, ఆరెల్లిస్వామి, దీకొండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-యైటింక్లైన్‌కాలనీ



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాతవాహన విద్యానికేతన్ వెంకట్రావుపల్లికి చెందిన 1989 నుండి 2023 వరకు చదువుకున్న విద్యార్థులు 35 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం మారేడుపాకలో నిర్వహించుకున్నారు.ఈ సమ్మేళన కార్యక్రమానికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.అలాగే కొందరు తోటి మిత్రులను గుర్తుచేసుకుని మరణించినవారికి ఘనంగా నివాళులర్పించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ సంతోషంగా గడిపారు. వారు చదువుకున్న రోజుల్లో కొన్ని మధుర జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ కంట తడి పెట్టుకున్నారు. ఇటీవలి కాలంలో శాతవాహన విద్యానికేతన్ పాఠశాల వ్యవస్థాపకులు పురం.మాధవరావుకి విద్యారత్న అవార్డు రావడంతో ప్రత్యేకంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తీసుకున్న తీర్మానాలలో భాగంగా పాఠశాల కరెస్పాండెంట్ పురం వెంకట మాధవరావుకి గురుదక్షిణగా పూర్వ విద్యార్థులంతా కలిసి ఒక తులం(10గ్రాములు) బంగారం, 50 వేల నగదును వారి నివాసానికి వెళ్ళి నిర్వహణ కమిటీ ద్వార అందజేశారు.ఈ కార్యక్రమంలో సాంబారి రాజేష్ , రాజ్యలక్ష్మి , ఇసంపల్లి రమేష్ , దేవనపల్లి.చక్రపాణి ,నాగమణి , బత్తిని. శ్రీనివాస్,వేణు,నగేష్ ఆడెపు, సుధాకర్ రెడ్డి , రమణారెడ్డి,శ్రీదేవి ,గుండేటి రమేష్ , వేణు ,చంద్రమౌళి ,రవీందర్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకపేటలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో శ్రీ సాంబశివ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన అన్నదాన కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల డాక్టర్ సంజయ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఈ ప్రతిష్టాపన కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వరస్వామి విగ్రహ పున: ప్రతిష్టాపన

పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-మేడిపల్లి

మాచపూర్ గ్రామంలో జరిగిన శ్రీ రామలింగేశ్వర స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపనలో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ కుందూరి బాలరాజు, మేడిపల్లి మండల అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జెలెందేర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, సోషల్ మీడియా ఇంచార్జి సాయిని గంగారెడ్డి, బీసీ సేల్ అధ్యక్షులు మాధం వినోద్, గ్రామ శాఖ అధ్యక్షులు కూందిరి చిరంజీవి, చొప్పరి ఎర్రన్న, సాన నరేష్, కాటిపెల్లి చంద్రయ్య, సంజీవ్, మంతెన అంజయ్య, పేటరీ లక్ష్మణ్, చిన్న మల్లయ్య, దొడ్డి కొమురయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి బి. వాణీ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బి. వాణీ

నవతెలంగాణ-మేడిపల్లి

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యావసాయాధికారి బి.వాణి అన్నారు. మేడిపల్లి రైతు వేదికలో భీమారం, మేడిపల్లి మండలాలకు చెందిన ఫర్టిలైజర్ డీలర్స్, ప్యాక్స్ సీఈఓలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి బి.వాణి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం యూరియాను సబ్సిడీపై రైతులకు అందిస్తుందని, ప్రభుత్వం అందించే యూరియా నేరుగా రైతులకు చేరవేసేందుకు ఈపాస్ యంత్రాల ద్వారా రైతుల వేలిముద్రలతో పంపిణీ చేయాలని అన్నారు. భూమిలేని వారికి యూరియాను ఇవ్వవద్దని రైతుల పేరు మీద భూమి ఉన్న వారికి యూరియా ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి త్రివేదిక, ఏఈఓలు వంశీ,. సురేంద్ర నాయక్, ఫర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్ ఉమ్మడి మండలాల అధ్యక్షుడు మహమ్మద్ ఆఖీల్, కార్యదర్శి నగేష్, రాము, లక్ష్మినారాయణ,.రాజశేఖర్, మధు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ కమిటీపై, వేసవిలో నీటి పొదుపు , ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ కవిత మాట్లాడుతూ ఎస్ఎంసి కమిటీలకు బదులుగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని దానికి వివోఏ మహిళా సంఘ సభ్యుల నుండి ఒక సభ్యురాలను లేదా ఆ పాఠశాలలో చదివే తల్లులను ఈ కమిటీలలో చేర్చుకోవాలన్నారు. వారి పేరుపై ఏదైనా జాతీయ బ్యాంకులో పాఠశాల ప్రధానోపాధ్యాయుల పేరుతో ఖాతాను తీయాలని వారు కోరారు. అలాగే ఆర్డబ్ల్యూఎస్ విశాల మాట్లాడుతూ.. తాగునీటి వృథా చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబూబకర్, జిల్లా అధికారి షేక్, జిల్లా అగ్రికల్చర్ అధికారి శ్రీనాథ్, ఎంఈఓ కవిత, ఎంపీడీవో పద్మజ, ఎంపీఓ కిరణ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సువిశాల, డాక్టర్ సంపత్ రెడ్డి , పాల్గొన్నారు.

తహసీల్దార్లతో ఆర్డీవో సమావేశం



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో హనుమ నాయక్

నవతెలంగాణ-మంథని

మంథని ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్లతో ఆర్డీవో హనుమ నాయక్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్ ఇండియా ద్వారా లోక్ సభ ఎన్నికలు, 2024 షెడ్యూల్ జారీ చేయడం జరిగిందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18 నుండి 25 వరకు రిటర్నింగ్ అధికారి, 02-పెద్దపల్లి (ఎస్.సి.) పార్ల మెంటరి నియోజకవర్గం, కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్టు తెలిపారు. మే13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి దృష్ట్యా, సభలు, సమావేశాలు,ర్యాలీలకై రాజకీయ పార్టీలు ముందస్తుగా తమ ద్వారా అను మతి తీసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్

నవతెలంగాణ-ఓదెల

మండలంలోని కొలనూరు, ఓదెల, పొత్కపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ ప్రారంభించారు. కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ రూ.2203, సాధారణ రకంకు రూ.2183గా నిర్ణయించినట్టు తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని బాగా ఆరబెట్టి చెత్త,తాలు,మట్టి పెడ్డలు ,రాళు లేకుండా శుభ్రపరచడంతో పాటు తేమ 17శాతం కంటే తక్కువగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపీఓ భాస్కర్, డీపీఎం రవి,ఎపిఎం లతా మంగేశ్వరి ,సీసీలు మారెళ్ళ శ్రీనివాస్, విజయ, రాజకుమారి, మల్లయ్య, కొమురయ్య, ఆపరేటర్ పవన్ కుమార్, అకౌంటెంట్ భవాని పాల్గొన్నారు.

ఎస్ఐకి వాలీబాల్ క్రీడాకారుల సన్మానం



నవతెలంగాణ-రామగిరి

రామగిరి ఎస్ఐగా పని చేసి బదిలీపై వెళ్లిన కటికె రవిప్రసాద్‌ను వాలీబాల్ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. ప్రతీ రోజు సెంటినరీ కాలనీలోని సింగరేణి రాణి రుద్రమదేవి స్టేడియంలో ఎస్ఐ రవిప్రసాద్ రన్నింగ్ చేస్తూవుంటారు. ఈ క్రమంలో గోదావరిఖనికి బదిలీపై వెళ్లడం జరిగింది. ఈ సంద ర్భంగా ఆయనను క్రీడాకారులు సన్మానించారు.

నవతెలంగాణ
రాజన్న సిరిసిల్ల
గురువారం | ఏప్రిల్ 04, 2024 | www.navatelangana.com

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



నవతెలంగాణ - కొనరావుపేట : గ్రామాల్లో సీసీ కెమెరా ఏర్పాటు కోసం బాధ్యతగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్సై అంజనేయులు కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో పోలీస్ మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల రక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం తప్పనిసరి అన్నారు. కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, కుల సంఘాలు ముందుకు రావాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచితులు సంచరిస్తే వెంటనే పోలీస్లకు సమాచారం అందించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎవరూ కూడ కోడ్ ఉల్లంఘించవద్దన్నారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు చేయడంతో కేసుల పాలు కావద్దన్నారు. ఈ సమావేశంలో కానిస్టేబుల్ జగన్ గ్రామస్తులు నాయకులు పాల్గొన్నారు.

మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ బాధితులకు అందుబాటులోకి మెరుగైన సేవలు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



సిమ్ కార్డులను అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - సిరిసిల్ల : సైబర్ నేరాల కట్టడికి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ నేరాల పట్ల ప్రత్యేక శిక్షణను పొంది సైబర్ వారియర్స్ గా నియమింపబడిన సిబ్బందికి ఫోన్లు మరియు సిమ్ కార్డులను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక్కో సైబర్ వారియర్ చొప్పున 13మందిని నియమించామని, సైబర్ వారియర్స్‌గా శిక్షణ పొంది పోలీస్ స్టేషన్‌లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా ఒక ఫోన్ నెంబర్ ఉంటుందని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడిన ప్రజలు వెంటనే 1930కి కాల్ లేదా ఎన్‌సిఆర్‌పి పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. బాధితులు ఫిర్యాదులను నమోదు చేసుకుంటేనే గుర్తించడం సులువవుతుందన్నారు. సైబర్ నేరాల బారిన పడిన ఫిర్యాదు చేసిన బాధితుడికి సంబంధిత పోలీస్ స్టేషన్లో నియమింపబడిన సైబర్ వారియర్ ద్వారా తమ అప్లికేషన్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని, జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

సిరిసిల్ల వస్త్ర సంక్షోభాన్ని నివారించాలి

- నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలి
- వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ డిమాండ్
- ఏప్రిల్ 6న నేతన్నల గర్జన



మాట్లాడుతున్న వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక సభ్యులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

మూడు నెలల నుంచి సిరిసిల్లలో ఏర్పడ్డ వస్త్ర సంక్షోభాన్ని నివారించి నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మండల సత్యం, మూశం రమేష్, పంతం రవి, సిరిసిల్ల రవీందర్ మాట్లాడుతూ గత మూడు నెలల నుండి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఏర్పడ్డ సంక్షోభంతో దీనిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నల ఆకలి కేకలు, తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏప్రిల్ 6న నేతన్నల గర్జన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురువారం సిరిసిల్ల పట్టణంలో ప్రచార పాదయాత్ర, కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన ప్రతి పవర్ లూమ్, అనుబంధ రంగాల కార్మికులు, ఆసాములు, మ్యాక్స్ సంఘాల సభ్యులు, యజమానులు, వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల సంఘాల వారందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. అదేవిధంగా 6వ తేదీన వస్త్ర పరిశ్రమను బంద్ చేసి నేతన్న గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎల్లండి దేవదాస్, తాటిపాముల దామోదర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, పిస్క మధు, గౌడ రాజు, కోడం రమణ, వేముల దామోదర్, బొడ్డు శ్రీధర్, సిరిమల్ల సత్యం, మండల రాజు, నక్క దేవదాస్, ఒగ్గు గణేష్, గుండు రమేష్ బండారి అశోక్ పాల్గొన్నారు.



కాళేశ్వరం కట్టడమే బీఆర్ఎస్ చేసిన పాపం

ముస్తాబాద్ జెడ్పీటీసీ నర్సయ్య

నవతెలంగాణ - ముస్తాబాద్

కాళేశ్వరం కట్టడమే బీఆర్ఎస్ చేసిన పాపం.. ఆ ప్రాజెక్టు వలనే నేడు కరవు ఏర్పడిందని జెడ్పీటీసీ నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు పిల్లర్లు కుంగినప్పుడే నీటిని కిందికి విడుదల చేసి ఉంటే ఇప్పుడు కరువు వచ్చేది కాదన్నారు. తప్పు మీరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పదేండ్ల కాలంలో నష్టపోయిన పంటలకు బీఆర్ఎస్ ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు తప్పనిసరిగా ఎకరాకు పదివేల రూపాయలు నష్టపారిహారం అందిస్తామని తెలిపారున్నారు. కేవలం ఓట్ల కోసం మాత్రమే కేసీఆర్ బయటకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గజ్జలరాజు, పాక్స్ డైరెక్టర్ కొండల్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తలారి నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ పూర్తి



నవతెలంగాణ - సిరిసిల్ల : త్వరలో జరిగే లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయిందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి, వేములవాడ, సిరిసిల్ల సెగ్మెంట్ లకు కేటాయించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్ ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. కేంద్ర ఎన్నికల మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరిస్తూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్, సిరిసిల్ల ఏఆర్ఓ పి.గౌతమి, అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యా నాయక్, వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

తాగునీరు సమస్యలు ఉంటే చెప్పండి

టోల్ ఫ్రీ నంబర్ 9398684240

నవతెలంగాణ - సిరిసిల్ల : జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయ తీల పరిధిలో ఎక్కడైనా తాగునీరు సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వాలని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో తాగునీరు సమస్యలపై వచ్చే ఫిర్యాదులు స్వీకరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని వెల్లడించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆధ్వర్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ఇంచార్జీగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కంట్రోల్ రూం ప్రతిరోజు 24 గంటలు పనిచేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీరు సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు 9398684240 కాల్ చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండలంలోని హరిదాస్‌నగర్, పదిర, బండలింగంపల్లి, బొప్పాపూర్, కిస్టునాయక్ తండా గ్రామాలలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో ఆయా గ్రామ సంఘాల ద్వార నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం డీఆర్‌డీవో శేషాద్రి ప్రారంభించారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు గల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులు మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎం పాపారావు, ఏపీఎం మార్కెటింగ్ శ్రీనివాస్, సీసీలు, వీవోఏలు, బుక్ కిపర్లు, గ్రామ సంఘాల అధ్యక్షులు, మహిళలు, పంచాయతీ సెక్రెటరీ, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు కాదు.. ఆరు వందల అబద్దాలు

- కాళేశ్వరం ప్రాజెక్టును బదనాం చేయాలన్నదే కాంగ్రెస్ కుట్ర
- జిల్లా పరిషత్ చైర్మెన్ పుట్ట మధూకర్



నవతెలంగాణ-పెద్దపల్లి : ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్‌వి ఆరు గ్యారెంటీలు కావని ఆరు వందల అబద్దాలని జిల్లా పరిషత్ చైర్మెన్ పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును చిన్న చేసి ప్రాజెక్టునే బదనాం చేయాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రాజెక్టులో ఒక్క పిల్లర్ కుంగితే ప్రాజెక్టు పనికి రాదని మాట్లాడటం అవివేకమన్నారు. ఒక్క పిల్లర్ కుంగిపోతే మనిషి వెన్నెముఖ పోయినట్లేనని, ఇక మనిషి జీవితం ఎలా పనికి రాదో అదే రీతిలో ప్రాజెక్టు పనికి రాదని అంటున్నారని ఆయన వివరించారు. మనిషి వెన్నెముక పోతే సాంకేతిక పరిజ్ఞానంతో వెన్నె ముకను ఏర్పాటు చేసి నడిపించే రోజులు ఉన్న క్రమంలో పూర్తిగా అవగాహన లేకుండా మాట్లాడటం విడ్డూరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో చెరువులను కాపాడామని, ఇసుక బస్తాలు వేసి నీళ్లను మళ్లించామని తెలిపారు. భావితరాల భవిష్యత్ కోసం మాజీ సీఎం కేసీఆర్ ఆలోచన చేశారని ఆయన గుర్తు చేశారు. డిసెంబర్ మాసంలో ఇవ్వాల్సిన రైతుబంధు ఇప్పటికి పూర్తిస్థాయిలో ఇవ్వలేదని, ఎన్ని ఎకరాలకు ఇస్తారో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఇంకా సుమారు ఎనిమిది వేల మంది రైతులకు రైతుబంధు రావాల్సి ఉందని ఆయన చెప్పారు. పంటలకు సాగునీరు ఇవ్వకుండా, రైతుబంధు పైసలు వేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకులు అబద్ధాలతో ముందుకుసాగుతున్నారని ఆయన విమర్శించారు.

ఈవీఎం, వీవీప్యాడ్ల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

నవతెలంగాణ-జగిత్యాల : ఈవీఎం, వీవీప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించినట్టు జిల్లా ఎన్నికల అధికారిణి, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. బుధవారం ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాలులో సహాయ రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల మొదటి ర్యాడమైజేషన్ నిర్వహించారు. రానున్న లోకసభ ఎన్నికల దృష్ట్యా ఎలక్ట్రానిక్ యంత్రాలు, వివిప్యాట్‌లను జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలకు కేటాయించినట్లు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గానికి 327 బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, జగిత్యాలకు 317, ధర్మపురికి 336 యూనిట్లను కేటాయించామని, అదేవిధంగా కోరుట్లకి 366 వీవీ ప్యాట్‌లను, జగిత్యాలకు 355, ధర్మపురికి 376 కేటాయించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దివాకర, పి.రాంబాబు, ఆర్డీఓ లు మధుసూదన్, ఆనంద్ కుమార్, సంబంధిత తహశీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరకట్నపు హత్య కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు

నవతెలంగాణ - సిరిసిల్ల

వరకట్నపు హత్య కేసులో వ్యక్తికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతోపాటు రూ.30వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సేషన్ జడ్జ్ ఎన్.ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వివరాల మేరకు.. చందుర్తి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన ఎక్కల దేవయ్య కూతురు రేవతి అలియాస్ శిరీష2017 సంవత్సరంలో మామిడిపల్లి గ్రామానికి చెందిన కంటే నరేష్ అనే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. పెళ్లి సమయంలో రూ.10.50లక్షలతోపాటు 11తులాల బంగారం మోటార్ సైకిల్‌కు రూ.70వేలు ఇతర లాంఛనాలు ఇచ్చి పెళ్లి చేయగా, ఒక సంవత్సరం వరకు శిరీష, నరేష్ కలిసి ఉన్నారు. వారికి ఒక కూతురు ఉంది. కంటే నరేష్ తల్లిదండ్రులు, ఆడపడుచులు అదనపు కట్నం, రెండు తులాల బంగారం, గొర్రెలు, ఒక ప్లాట్ ఇవ్వాలని వేధింపులు గురి చేయగా రెండుసార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ జరిపి కంటే నరేష్, వారి కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి నాలుగు లక్షల రూపాయలు, 11 మేకలు అదనంగా ఇచ్చి, ప్లాట్ కూడా త్వరలో రిజిస్ట్రేషన్ నరేష్ పేరిట చేస్తానని చెప్పి 19 మార్చి 2021న తిరిగి గ్రామానికి వెళ్ళగా అదే రోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తన కూతురు ఉరి వేసుకొని చనిపోయిందని తెలువగా శిరీష తండ్రి దేవయ్య తన కూతురి భర్త అత్తా మామ ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేసి తన బిడ్డ మరణానికి కారణం అయ్యారని కొనరావుపేట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి అప్పటి డీఎస్పీ చంద్రకాంత్ నిందితుడు కంటే నరేష్ అతని తండ్రి తల్లి ఆడబిడ్డలను రిమాండ్‌కు తరలించడం జరిగింది. అప్పటి కేసు విచారణ అధికారి డిఎస్పీ చంద్రకాంత్ కోర్టులో చార్జిషీట్ దాకాలు చేయగా అప్పటి కోర్టు మానిటరింగ్ ఎస్సై శ్రీకాంత్ మరియు కోర్ట్ కానిస్టేబుల్ మోహన్, సి ఎం ఎస్ కానిస్టేబుల్స్ నరేందర్,లతీఫ్ లు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా స్పెషల్ పిపి నర్సింగరావు గారు కేసును వాధించగా కేసు పూర్వపరాలను పరిశీలించిన జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి ఎన్ ప్రేమలత నేరం రుజువు కావడంతో నిందితుడైన కంటె నరేష్‌కు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.30వేలు జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

పైపులైను లీకేజీతో వృధాగా తాగునీరు

నవతెలంగాణ - గంభీరావుపేట :



మండల కేంద్రంలో గల మూడో వార్డులో రెడ్డి సంఘం వద్ద మిషన్ భగీరథ పైపు పగిలి నీరు వృధాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆగ్రహం చెందారు. వేసవి కాలంలో నీటి కొరత ఉంటుందని తెలిసినా అధికారులు ఆ వైపు చూడకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండురోజులకొకసారి నీటిని విడుస్తున్నారని, మిషన్ భగీరథ పథకం ద్వారానే తాగునీరు మాత్రమే వస్తుందని ఒక్క కుటుంబానికి కూడా సరిపడా నీళ్లురావడం లేదని ప్రజలు స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. వార్డులోని సమస్యలను ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మాత్రం గ్రామపంచాయతీకే పరిమితమాయారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైప్ లైన్ లీకేజీని అరికట్టాలని వార్డు ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.

పోతారంలో ఈసీసీఈ డే

నవతెలంగాణ-మల్యాల : మల్యాల మండలంలోని పోతారం గ్రామంలో గల అంగన్వాడీ సెంటర్‌లో ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్) డే సెలబ్రేషన్స్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశ్రీ, అంగన్వాడీ టీచర్ జమున, వనజ, శ్రీలత, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో సిట్ సాధించిన విద్యార్థికి అభినందనలు

నవతెలంగాణ - ఇబ్రహీంపట్నం

మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన విద్యార్థి కుమ్మరిపెల్లి కార్తిక్ న్యూ విజన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో నవోదయ కోచింగ్ తీసుకుని ఇటీవల వెలువడిన ఫలితాల్లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కార్తిక్‌ను శాలువా తో సన్మానించి, పుస్తకాలు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ గుమ్మల తిరుపతి, నాయకులు సున్నం సత్యం,ఉపాధ్యాయులు అకు రాజేంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఏప్రిల్ నుంచి జూన్ మధ్య జిల్లాలో చాలా వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవు తాయని దాని దృష్ట్యా జిల్లా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్ అన్నారు. వేసవి, వడదెబ్బ నుండి జిల్లా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా విద్యాధికారి, జిల్లా పంచాయతీ అధికారులకు వర్చువల్ ఫోన్ కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు తెలిపారు. ప్రతి పాఠశాలలో ప్రార్థన సమయంలో పిల్లలకు వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించవల్సిందిగా జిల్లా విద్యాధికారిని ఆదేశించారు.

నేర ప్రవర్తనలో మార్పు రావాలి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- నేర ప్రవృతిలో మార్పు తెచ్చేందుకు జిల్లాలోని రౌడీ షీటర్స్‌కు కౌన్సిలింగ్




రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - సిరిసిల్ల

జిల్లాలో ఉన్న రౌడీ షీటర్ల నేర ప్రవత్తిలో మార్పు తెచ్చేందుకు బుధవారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్ల మేళ ఏర్పాటు చేసి వారు చేసిన చివరి నేరం, ప్రస్తుతం వారి జీవన విధానం గురించి అడిగి తెలుసుకొని వారి ప్రవర్తనలో మార్పు రావడానికి ఒక అవకాశం కల్పిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీ యొక్క ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర జీవితం వీడి ప్రస్తుత సమాజంతో మంచి జీవితం గడుపుతూ హుందాగా జీవిస్తూ ఉండాలని, తొందర పాటులో నేరాలు చేసినా సరే తప్పు చేయని మీ కుటుంబం కూడా దాని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతుందని తెలిపారు. రౌడీ షీటర్లు తన కుటుంబం, పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వారి ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని, రౌడీ షీటర్ అనే ఓ పదం తమ బిడ్డల భవిష్యత్ కూడా నాశనం చేస్తుందని గుర్తు చేశారు. సమాజంలో ఒక రౌడీగా కాకుండా మీ పిల్లలకు ఓ మంచి తల్లిదండ్రులుగా ఉంటూ హీరోగా మిగిలిపోవాలని ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఉన్న రౌడీషీటర్లకు ఒక అవకాశం కల్పిస్తున్నని పార్లమెంట్ ఎన్నికల అనంతరం డిసెంబర్‌లోగా మీ మీ ప్రవర్తనలో మార్పు వస్తే మీ మీద ఉన్న రౌడీ షీట్స్ తొలగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దానికి కోసం ప్రతి ఒక రౌడీ షీటర్ కదలికలు, చర్యలపై పోలీస్ నిఘా ఉంటుందని, నేర ప్రవృతి లో మార్పు రాకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోనే కాకుండా భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తనతో ఉండాలని, ఏలాంటి ప్రలోభాలకు గురై నేరాలకు పాల్పడకుండా నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. గత పది సంవత్సరాల నుంచి ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తన కలిగి ఉండి పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రాచారి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నవతెలంగాణ - చందుర్తి

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం జోగాపూర్ గ్రామంలో దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతోందన్నారు. ఎన్ని అప్పులున్నా సంక్షేమ పథకాలు ఆగవన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం కుమార్ ఎంపీటీసీ గణేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపండు రామస్వామి, గొట్టే ప్రభాకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య 97వ జయంతిని యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఉమ్మడి మండలాల గొల్ల, కురుమ, యాదవ సంఘం అధ్యక్షులు మెండే శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ పొలికేక గొల్ల, కురుమ, యాదవ ముద్దుబిడ్డ దొడ్డి కొమురయ్య అన్నారు. అతని ఆశయాలను కుల బాంధవులు అందరూ పాటించాలన్నారు. తెలంగాణ ప్రజల సామాజిక న్యాయం కోసం, హక్కుల పోరాటం కోసం, భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అన్నారు. ఆత్మ గౌరవాన్ని ఆకాశానికి ఎగురవేసి తెలంగాణ ప్రజలకు హక్కుల విముక్తి కలిగించరన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాం తూటాలకు బలి అయిన తెలంగాణలో తొలి అమరుడై తెలంగాణకు రైతులకు విముక్తి కలిగించిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య యాదవ్ అన్నారు. తెలంగాణ కష్టాలను, హక్కులను సాధించాలని వీర పోరాటం చేసి తెంగాణ రైతుల హక్కులను కాపాడిన గొప్ప నాయకుడు మహాయోధుడు దొడ్డి కొమురయ్య యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మందాటి దేవేందర్ యాదవ్, ఉపాధ్యక్షులు సిద్దిం బాలు యాదవ్, పాతపెల్లి రాములు యాదవ్, మండల ముఖ్య సలహాదారుడు బొల్లు భూమయ్య యాదవ్, మండల కోశాధికారి పెంజర్ల దేవయ్య యాదవ్, మందాటి రాము యాదవ్, కృష్ణ యాదవ్, గుంటి పర్శరాములు, కురుమ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మందాటి సతీష్ యాదవ్, నాగ మల్లేష్ యాదవ్‌లు పాల్గొన్నారు.



నిర్మల్ జిల్లాకు చెందిన ఆధార్ కిట్ రాయికల్‌లో వినియోగం?



ఆధార్ కిట్‌ను జప్తు చేయని అధికారులు

నవతెలంగాణ - రాయికల్

అంగట్లో ఆధార్ కార్డు సేవలు శీర్షికన నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ, ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. సంబంధింత ఆధార్ కిట్ ఎక్కడిది అనే కోణంలో నవతెలంగాణ విచారణ చేయగా నిర్మల్ జిల్లాకు చెందిన ఎస్.ఎస్.ఏ కిట్‌గా తెలిసింది. అక్కడి నుండి ఇక్కడికి కిట్ తీసుకరావడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దేశంలోని పౌరుల యూనిక్ గుర్తింపు కార్డుగా ఆధార్‌ను వినియోగిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఈ కిట్‌ను ఎక్కడెక్కడ వినియోగించారు. ఈ కిట్ ద్వారా ఎన్ని ఆధార్ కార్డులను నమోదు చేశారు. ఈ కిట్ ద్వారా ఎన్ని ఆధార్‌లను నవీకరణ చేశారనే విషయాలు మాత్రం అధికారులు తేల్చాల్సి ఉంది. అయితే ఈ కిట్‌ను బహిరంగంగా వినియోగిస్తున్న నిర్వాహకులపై తగు చర్యలు తీసుకొని కిట్‌ను వెంటనే స్వాధీనం చేసుకోవాలని లేకపోతే ఆధార్ సేవలు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎంటిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా తిరుమల

ప్రకటించిన పార్టీ జాతీయ అధ్యక్షులు అశోక్

నవతెలంగాణ-గోదావరిఖని:
మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ (ఎంటిఆర్ఎస్) పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా మేకల తిరుమల పేరును మంగళవారం ఎంటిఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షులు అశోక్ ప్రకటించారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ అభ్యర్థిగా పత్రాన్ని మేకల తిరుమలకు పార్టీ జాతీయ అధ్యక్షులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక చైతన్యం, సేవా రంగం, అలాగే జర్నలిస్టుగా ఎన్నో రంగాల్లో మంచి గుర్తింపుని తెచ్చుకున్న మేకల


.ఎంపీ అభ్యర్థిగా పత్రాన్ని అందజేస్తున్న అశోక్

తిరుమలను తమ పార్టీ తరుపున పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీలో ఉంచడం జరుగుతుందని, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

పాక్సో యాక్ట్, గంజాయి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్
పోక్స్ యాక్ట్, గంజాయి వలన కలిగే దుష్పరిణామాలు, సామాజిక అంశాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే విధంగా పోలీస్ కళాబృందం పని చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ స్థానంలో పోలీస్ కళాబృందం సభ్యులు ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు.


అభినందిస్తున్న జడ్జీ

ఎఫ్ఎసి ప్రిన్సిపాల్‌గా పి.రాజేష్ బాధ్యతలు స్వీకరణ


.సన్మానిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎఫ్ఎసిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ పి.రాజేష్ బుధవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని, శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు


వధూవరులను ఆశీర్వదిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండల కేంద్రంలోని వెంకటలక్ష్మి గార్డెన్స్‌లో బుధవారం జరిగిన అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గట్టు లక్ష్మి సదయ్య గౌడ్ రెండవ కూతురు గాయత్రి ప్రశాంత్ గౌడ్ వివాహం వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీఓ శ్రీనివాస్ గౌడ్


ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నవతెలంగాణ-పెద్దపల్లి
గ్రామాల్లో వేసవి కాలంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని అందుగులపల్లిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీటీసీ పందిళ్ల లక్ష్మణ్, ఎంపీడీవోలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తాగు నీరు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. వారి వెంట ఏపీవో రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి కిషోర్, టీఏ దివ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్ తదితరులున్నారు.

గాయత్రి విద్యానికేతన్‌లో యుకేజీ విద్యార్థుల కాన్వొకేషన్ వేడుకలు

నవతెలంగాణ-పెద్దపల్లి
పెద్దపల్లి పట్టణంలోని స్థానిక గాయత్రి విద్యానికేతన్‌లో ఈ విద్యా సంవత్సరంలో యుకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కాన్వొకేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల చైర్మెన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం యూకేజీ చదివి, వచ్చే సంవత్సరం ఒకటో తరగతికి ప్రమోట్ అవుతున్న సందర్భంగా విద్యార్థులకు ప్రీ ప్రైమరీ విద్య పూర్తి చేసుకోవడం అనేది ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోవాలనే ఒక వినూత్న ఆలోచనతో ఈ కాన్వొకేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు కాన్వొకేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సి పాల్ విజయ్, రజియుద్దీన్, శాంతలక్ష్మి, ఆఫ్రీన్, సౌమిని, రాజమణి, నవీన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కాన్వొకేషన్ తో విద్యార్థులు

పెద్దపల్లి ఎంపీగా గోమాసని గెలిపించండి

రామగుండం నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి

నవతెలంగాణ-గోదావరిఖని:
భారత్ నవ నిర్మాణం కోసం జన్మించిన మహానేత మోడీ అని రామగుండం నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కొనియాడారు. బుధవారం గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో వాకర్స్‌ని నేరుగా కలుసుకొని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోమాస శ్రీనివాస్ నాయకత్వాన్ని బలపరుస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి కమల వికాసానికి తోడ్పాటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి నాయకులు మెరుగు హన్మంతు గౌడ్, గాండ్ల ధర్మపురి, మావాది రామన్న, కొండపర్తి సంజీవ్, పాకాల నర్సిం హరెడ్డి ఉన్నారు.

మొదటి దశ ఈవీఎం ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-పెద్దపల్లి
లోక్‌సభ ఎన్నికలలో వినియోగించే ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జే.అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్‌లతో కలిసి కలెక్టర్ ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో మొదటి దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో, రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో జరుగుతుందని అన్నారు. ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ మొదటి దశలో జిల్లా


మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల అధికారి జిల్లాలో ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కేటాయించడం జరుగుతుందని, రెండో దశలో ఈవీఎం యంత్రాలను రిటర్నింగ్ అధికారి పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయింపు చేస్తారని అన్నారు. పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 290, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 290, రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 260 పోలింగ్ కేంద్రాలకు ప్రస్తుతం ఈవీఎం యంత్రాలను కేటాయించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో మనకు అవసరం ఉన్న బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు కంటే 25 శాతం అదనంగా, వీవీ ప్యాట్ లు 40 శాతం అదనంగా కేటాయించడం జరుగుతుందని, వీటిని కలిపి ర్యాండమైజేషన్ చేసామని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ర్యాండమైజేషన్ చేశామని అన్నారు. మొదటి ర్యాండమైజేషన్ సంబంధించి హార్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్, అదనపు కలెక్టర్లు అందించారు. ఈవీఎంలు నియోజకవర్గ కేంద్రంలో ఉన్న స్ట్రాంగ్ రూంకు తరలించే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, వి.హనుమా నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్, ఈడీఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ ప్రతిపాదనలు రూపొందించాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్
- భూ సేకరణ ప్రతిపాదనల రూపకల్పనపై సమీక్ష

నవతెలంగాణ-పెద్దపల్లి
వరంగల్-మంచిర్యాల మధ్య 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రతిపాదనలు శనివారం లోగా సంబంధిత నివేదికలు సమర్పించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి భూ సేకరణ సర్వే ప్రతిపాదనల రూపకల్పనపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

లాల్ మాట్లాడుతూ.. వరంగల్-మంచిర్యాల మధ్య 4 వరుసల గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి కోసం పెద్దపల్లి జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లో అవసరమైన భూ సేకరణ చేపట్టుటకు సర్వే చేసి ప్రతిపాదనలను శనివారం వరకు సిద్ధం చేయాలని సూచించారు. రోడ్లు, భవనాల శాఖ, అటవీ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మిషన్ భగీరథ ఇంట్రా, ఉద్యానవన శాఖ అధికారులతో జాతీయ రహదారి నిర్మించడం వల్ల ఆయా శాఖల పరిధిలో కలిగే నష్టాలకు, వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు, సేకరించాల్సిన భూమి, రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం తదితర అంశాలపై సంపూర్ణ నివేదిక రూపొందించాలని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయే 455 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం 36 కోట్లు మంజూరు చేసిందని, రామగిరి, ముత్తారం, మంథని తహసీల్దారులు సంబంధిత రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి శనివారం వరకు సమర్పించాలన్నారు. రైతులకు నష్టపరిహారం సొమ్ము వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఆర్ అండ్ బీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్యకు ఘన నివాళి

నవతెలంగాణ-జూలపల్లి
జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో దొడ్డి కొమురయ్య 97వ జయంతి వేడుకలను కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ యువత కచ్చు రమేష్, పబ్బాల శంకరయ్య, వేణు, రమేష్ పాల్గొన్నారు.

మంథని:మంథని పట్టణంలో యాదవసంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాల వేసి ఘనమైన నివాళులార్పించారు. ఈ కార్యక్రమంలో యాదవ కుర్మ సంఘమ్ జిల్లా నాయకులు కన్నెబోయిన కిష్టా స్వామి, కన్నెబోయిన ఓదెలు,డివిజన్ నాయకులు పాల్గొన్నారు.
బహుజనుల రాజ్యాధికారం కోసమే మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి


మెట్‌పల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మంథని పట్టణంలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తగరం.శంకర్ లాల్,ఆరెపల్లి కుమార్, వేల్పుల గట్టయ్య, పెగడ శ్రీనివాస్,శంకర్, తదితరులు పాల్గొన్నారు.
జగిత్యాలటౌన్ :టీబీసీ జేఏసీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడలో ఉన్న శివాజీ విగ్రహానికి టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
జిల్లా కేంద్రంలో 1వ వార్డులో దొడ్డి కొమురయ్య విగ్రహానికి టీ బీసీ జేఏసీ, కుర్మ సంఘ నాయకుడు దయ్యాల మల్లారెడ్డి, స్థానిక కౌన్సిలర్ కూసరి అనిల్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో హరి అశోక్ కుమార్, బీసీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ, విద్యార్థి జిల్లా అధ్యక్షుడు వరద సాయి, పట్టణ మహిళా అధ్య క్షురాలు మొగులోజి విజయ, సీనియర్ జర్నలిస్ట్ మాకు రాజలింగం పాల్గొన్నారు.
మెట్‌పల్లి:మెట్‌పల్లి పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణా సాయుధపోరాట యోధుడు దొడ్డికొమురయ్య 97వ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. కురుమ సంఘం అధ్యక్షుడు కోట రమేష్, కురుమ సంఘ సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులార్పించారు. కురుమ సంఘనాయకులు తుల ఉమా రాజేందర్ , కోట మహేష్,నడిపి సాయిన్న,కోరే రవి, కాచర్ల అంజయ్య ,కోరే మధు, గంగారం కురుమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బిజెపిని ఓడించడమే సామాజిక శక్తుల కర్తవ్యం

- రాజ్యాంగ రక్షకులు ఐక్యం కావాలి
- డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

నవతెలంగాణ-గోదావరిఖని:
రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించడమే సామాజిక శక్తులకు కర్తవ్యమని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. డిహెచ్‌పిఎస్ పెద్దపెల్లి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం భాస్కర్‌రావు భవన్‌లో ఎర్రల రాజయ్య అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలలో మనుస్మృతి శక్తులకు, రాజ్యాంగ శక్తులకు మధ్య ప్రధాన పోటీ నెలకొని ఉంద



మాట్లాడుతున్న మారుపాక అనిల్ కుమార్

న్నారు. మనుస్మృతి వారసురాలుగా ఉన్న బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించడం ద్వారా రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా రిజర్వేషన్లు లేకుండా చేయాలని బిజెపి సర్కార్ యోచిస్తుందని, తద్వారా సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుందని విమర్శించారు. 2018 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అత్యాచార నిరోధక చట్టంను నీరు గార్చే కుట్రలు కుతంత్రాలు బిజెపి చేసిందన్నారు. దానికి వ్యతిరేకంగా తీవ్రమైన ప్రతిఘటన రావడంతో తోకముడిచిందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పుడల్లా రాజ్యాంగానికి ప్రమాదగంటికలు మోగుతాయని, మనుస్మృతి చాందస భావాలను దేశంలో పెంచి పోషిస్తూ రాజ్యాంగ రద్దుకు కుట్ర చేస్తుందన్నారు. సామాజిక ప్రజా ఉద్యమాలకు విరోచిత వీర తెలంగాణ సాయుధ పోరాటానికి పురిటి గడ్డ అయిన తెలంగాణ లాంటి గడ్డపైన మనువాద మతోన్మాదుల ఆటలను సాగనివ్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కందుకూరి రాజారత్నం, రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల దినేష్, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు ఆశాల రమ, శనిగరపు తిరుమల, బుద్దుల రమేష్, నారపల్లి మానస్ కుమార్, జగదీశ్వర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ సెల్ డీఎస్పీ డీవీ రంగారెడ్డి

నవతెలంగాణ-మెట్ పల్లి
సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ సెల్ డీఎస్పీ డీవి రంగారెడ్డి అన్నారు. సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగృత దివాస్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మెట్ పల్లి పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుత కాలంలో వాట్సప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాను పిల్లలు ఎక్కువ వాడుతున్నారని, వాటిలో వచ్చే తెలియని లింక్‌లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫోన్‌లలో తెలియని వ్యక్తులతో మాట్లాడటం, చాటింగ్ చేయడం లాంటివి చేయకూడదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పుడు



మాట్లాడుతున్న సైబర్ సెల్ డిఎస్పీ డీ వి రంగారెడ్డి

కనిపెడుతూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సిఐ నవీన్, ఎస్ఐ చిరంజీవి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కోరుట్ల
కోరుట్ల మండలంలోని పెద్దాపూర్ గ్రామ పరిధిలోని ఎస్సారెస్పీ 36 కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. గ్రామస్తులు అటువైపు వెలుతుండగా మృతదేహాన్ని చూసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వ్యక్తి ఒంటిపై నల్లటి షర్టు, నల్లని లోయర్ దుస్తులు ఉన్నాయని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నిక


ఏకగ్రీవంగా ఎన్నికైన ఓదెల నాయి బ్రాహ్మణ సేవా సంఘం

నవతెలంగాణ-ఓదెల
ఓదెల మండల కేంద్రంలో శ్రీ పార్వతి శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో ఓదెల గ్రామ శ్రీ మల్లికార్జున నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా సూత్రాల స్వామిని, ఉపాధ్యక్షులుగా చెరకు సదయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా కమిటీ సభ్యులను పాతవారినే కొనసాగించాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సూత్రాల శ్రీనివాస్,నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడు చెరకు రాజు, సంగం సభ్యులు చెరకు శంకరయ్య, సూత్రాల శంకరయ్య, చెరకు సదానందం,సూత్రాల రవి, సూత్రాల మల్లయ్య, నాయి బ్రాహ్మణ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు చెరుకు మహేష్,సూత్రాల పోషాలు, సూత్రాల వెంకటేశ్వర్లు, చెరుకు శ్రీనివాస్, సూత్రాల శ్రావణ్,సూత్రాల నాగులు పాల్గొన్నారు

మహిళ ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-మల్యాల
జీవితంపై విరక్తి చెంది ఓ మహిళా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే..మేడిపెల్లి మండలంలోని కొండాపూర్‌కు చెందిన బొల్లె లక్ష్మి (35) జీవితంపై విరక్తి చెంది బుధవారం మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలోని వరద కాలువలో ఆత్మహత్యాయత్నం చేయగా..బ్లూ కోర్టు సిబ్బంది ప్రసాద్, నర్సింగారావు కాపాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ మల్యాల పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉంటున్న తన తల్లి ఇంటికి వస్తూ ఆత్మహత్యాయత్నం చేసింది. కాగా వరద కాలువలో నీరు తక్కువగా ఉండటంతో మహిళా ప్రాణాలతో బయటపడింది.

సమస్యలను తెలుసుకునేందుకే వార్డుల పర్యటన

నవతెలంగాణ -మెట్ పల్లి
నియోజకవర్గంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలనే ఉద్దేశ్యంతోనే కోరుట్ల నియోజకవర్గంలో గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మెట్‌పల్లి పట్టణంలోని 24వ వార్డులో పర్యటించి వార్డులోని సమస్యలను పరిశీలించారు. ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్, చర్లపల్లి ఆనంద్ గౌడ్, రమేష్, ఎనగందుల శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు .


సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే సంజయ్.

ఈనెల 7న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ధర్మారం
మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఈనెల 7న 6 నుంచి 10 వ తరగతి ప్రవేశ పరీక్ష ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ మన్నెదీనా తెలిపారు. ఆరో తరగతి విద్యార్థులకు 10 నుంచి 12 గంటల వరకు, ఏడు నుంచి పదవ తరగతి విద్యార్థులకు రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అలాగే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మీసేవకు వెళ్లి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని వివరించారు. విద్యార్థులు 9 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, బ్లాక్ ,బ్లూ పెన్ తీసుకురావాలని సూచించారు.

స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

మాజీ సింగల్ విండో డైరెక్టర్ నాగినేని జగదీశ్వర్ రావు

నవతెలంగాణ-ముత్తారం:
స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు వికలాంగులకు రాజకీయ రిజర్వేషనున్లు కల్పించాలని ముత్తారం మండల మాజీ సింగల్ విండో డైరెక్టర్ నాగినేని జగదీశ్వర్ రావు అన్నారు. బుధవారం ముత్తారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికాలంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించినప్పుడే వారి పక్షాన ప్రశ్నించే గొంతుకు నాంది పలికే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాల్లో 5 శాతం వికలాంగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 2024 లెక్కల ప్రకారం భారతదేశంలో సుమారు 15శాతం దివ్యాంగ కుటుంబాలు ఉండగా, అందులో 10కోట్లకు పైగా ఓటర్లు ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. వికలాంగులకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మాజీ సింగల్ విండో డైరెక్టర్ నాగినేని జగదీశ్వర్ రావు

కీటక జనిత వ్యాధులపై రీఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రారంభం

నవతెలంగాణ-జగిత్యాల
స్థానిక ఐఎంఏ హాల్లో కీటక జనిత వ్యాధుల నివారణ (ఎన్‌సివిబిడిసి)కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు సూపర్‌వైజర్లకు రీ ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎన్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమియోద్దిన్, డాక్టర్ జైపాల్ రెడ్డి, ఏఎంఓ సత్యనారాయణ సబ్ యూనిట్ ఆఫీసర్స్ శ్రీధర్ పాల్గొన్నారు.

బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలి

ఆర్డీఓ గంగయ్య

నవతెలంగాణ-పెద్దపల్లి
రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్స్‌ని నియమించుకోవాలని ఆర్డీఓ బి.గంగయ్య తెలిపారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ బి.గంగయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ..2024 ఏప్రిల్ ఒకటి వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 14 లోగా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని, అలాగే ఒక పోలింగ్ బూత్ నుంచి మరొక బూత్‌కు బదిలీ చేసుకోవడానికి అవకాశం ఉన్నదని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదై తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ

పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం : ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-పెద్దపల్లి


మాట్లాడుతున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం హైదరా బాద్‌లో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం పార్లమెంట్ ఇన్‌చార్జి, రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సమక్షంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపి స్తామన్నారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, వంశీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు విజయ రమణారావు, ప్రేమ్ సాగర్ రావు, మక్కాన్ సింగ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గడ్డం వినోద్, గడ్డం వివేక్, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు.

రైతుల పేరుతో దొంగ దీక్ష..

నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ రైతుల కోసం దొంగ దీక్ష చేసి మొసలి కన్నీరు కారుస్తున్నారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం కరీంనగర్‌లోని నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ.. రైతులను నల్ల చట్టాల ద్వారా ఇబ్బందులు పెట్టి ఎంతోమంది రైతులు పోరాటం చేస్తే రబ్బర్ బుల్లెట్లతో గాయపరిచి కారులతో తొక్కిచ్చిన చరిత్ర బీజేపీది అన్నారు. ఆ చట్టాలను వాపసు తీసుకుని, ఇచ్చిన హామీలను నెరవేర్చక రైతులు మళ్లీ ధర్నాలు చేస్తే మళ్లీ రబ్బర్ బుల్లెట్లతో గాయపరిచి ఇబ్బందులకు గురి చేస్తున్న పార్టీ అభ్యర్థికి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఐదేండ్లలో ఏ పని చేయలేని అసమర్థ ఎంపీ బండి సంజయ్ అన్నారు. బండి సంజయ్ బీఆర్ఎస్ చేసిన స్మార్ట్ సిటీ పనుల అవినీతిలో భాగస్వామి అన్నారు. అవినీతిని కప్పి పుచ్చుకొని రాముని పేరు మీద ఓట్లు అడగడం తగదన్నారు. దేవుని పేరుతో ప్రజలను విభజించడం కాదు దేవుడు అందరివాడు అన్నారు. ఆరు గ్యారెంటీల నిధులు సరిపోకపోతే కేంద్రం నుంచి నిధులు తెస్తా అని అంటే నమ్మేవారు లేరన్నారు. రాష్ట్ర అధ్యక్షుడుగా ఉండి ఎన్ని నిధులు వచ్చాయో ప్రజలందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల గురించి మాట్లాడుతున్నారు, మీ పార్టీ ఎమ్మెల్యేలది తలోదారి ఉందన్నారు. మహేశ్వర్‌రెడ్డి మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నాడన్నారు. బీఆర్ఎస్ వాళ్లు కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇస్తున్నారు, ముందు మీరు రైతుల వద్దకు వెళ్లి క్షమాపణ అడగాలన్నారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

బీడీ కార్మిక సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



నవతెలంగాణ-జగిత్యాల:

టేకేదార్లు బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్‌లో బీడి కార్మికులు, టేకేదార్లు, కార్మికుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి హాజరయ్యారు. పలువురు టేకేదార్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీడి టేకేదార్లు మాట్లాడుతూ.. సైనికుల్లా పని చేసి ఎంపీగా గెలిపిస్తామన్నారు. బీడీ కార్మికుల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. బీడిలు చేసే కార్మికులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, రోజంతా కష్టపడినా గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికుల వేతనాలు టేకేదార్ల ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగిత్యాలలో పీఎఫ్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. పీఎఫ్‌లో మార్పుకు నేందుకు సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కాలేదన్నారు.ప్రశ్నించే గొంతు పార్లమెంట్‌లో అడుగు పెడితే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ టేకేదార్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల వెంకట్, జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి జువ్వాడి నర్సింగ్ రావు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ చైర్పర్సన్ గిరి నాగభూషణం, దేశాయ్, ఎంపీపీ మహేష్, మాజీ జెడ్పీటీసీ మాధవి, సతీష్ రాజ్, కళ్లెపల్లి దుర్గయ్య, ముక్రం,మొయిజొద్దిన్, జలపతి రెడ్డి, బండ శంకర్, కొత్త మోహన్, గుంటి జగదీశ్వర్, పుప్పాల అశోక్, పాల్గొన్నారు.

నకిలీ వీసాలతో మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ - మెట్‌పల్లి



నిరుద్యోగులలను గల్ఫ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి వారి నుంచి డబ్బులు వసూలు చేసి నకిలీ వీసాలు ఇచ్చి మోసం చేసిన కేసులో మహ్మద్ హసిఫ్(28) కొజకోడ్, కేరళ రాష్ట్రానికి చెందిన నిందితుని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. పోలీసు స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 40 మంది నిరుద్యోగులను మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఏలేటి రమేష్ గల్ఫ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద నుండి రూ.26 వేలు వసూలు చేసి వారికి వీసాలు ఇచ్చాడు. బాధిత నిరుద్యోగులు ఆ వీసాతో గల్ఫ్ వెళ్లడానికి హైదరాబాద్ విమానాశ్రయానికి వెళ్లగా అవి నకిలీ వీసాలని తెలిసి ఏజెంట్ అయిన రమేష్ ఇంటివద్ద బాధితులు ధర్నా చేసి, రమేష్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని ఫిబ్రవరిలో అరెస్ట్ చేసి విచారించాగా డబ్బులు తీసుకోని కేరళకు చెందిన హసిఫ్ నకిలీ వీసాలను ఇచ్చాడని విచారణలో తెలిసింది. నకిలీ వీసాలు ఇచ్చిన హసిఫ్ పై క్రైం నెం 48/2024,51/2024,52/2024,67/2024, ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో మరో ముద్దాయి పరారిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

-పెద్దపల్లి ఆర్డీఓ బి.గంగయ్య

-ఓటరు అవగాహన 5కే రన్



నవతెలంగాణ-పెద్దపల్లి

ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియో గించుకోవాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య తెలి పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో నిర్వహించిన ఓటరు అవగాహన 5కే రన్‌లో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య ఏసీపీ క్రిష్ణ, సీఐ క్రిష్ణలతో కలిసి పాల్గొని జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి అమర్ నగర్, మసీద్ చౌరస్తా, జండా చౌరస్తా, సుభాష్ విగ్రహం, కమాన్ మీదుగా తిరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు 5కే రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య మాట్లాడుతూ.. రాబోయే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, నమోదైన ప్రతి ఒక్క ఓటరు తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహశీల్దార్ రాజ్‌కుమార్, మున్సిపల్, రెవెన్యూ ఉద్యోగులు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలకు చాంపియన్‌షిప్

నవతెలంగాణ-కరీంనగర్



కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల వారు నిర్వహించిన మేనేజ్‌మెంట్ మీట్ ఎస్‌యూఐ జెనెరీస్-2024లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు 16 అంశాలలో ప్రాయెజిక్, సంకల్ప్, విశేషక్, నర్తన్, చాయాకృతి, జాగృతి, స్వయం, చలనచిత్ర, చిత్రకళ తదితర 14 అంశాలలో ప్రతిభ కనబరచి బహుమతులు పొందారని, దీంతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నారని తెలిపారు. మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ల వల్ల విద్యార్థులలో నిర్వహణ సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలలో పాటు సమన్వయం పెరుగుదలకు దోహదపడుతాయని, ఈ విద్యా సంవత్సరంలో వరుసగా ఇది ఐదో ఓవరాల్ చాంపియన్‌షిప్ విజయమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్, మేనేజ్‌మెంట్ విభాగం హెచ్ఓడీ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాధ్యతయుతంగా పని చేయాలి

-జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

-వైద్యాధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కరీంనగర్

వైద్యాధికారులు అత్యుత్తమంగా సేవలు అందిస్తూ బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం కలెక్టర్ ఆడిటోరియంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్పీ డాక్టర్లతో వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సమీక్షకు వచ్చేటప్పుడు అన్ని వివరాలతో హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు పెరిగేలా కృషి చేయాలన్నారు. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్యాధికారులు నిరంతరం ప్రజలతో మమేకం కావాలని, అప్పుడే మంచి పేరు వస్తుందన్నారు. గ్రామాలతో పాటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోట విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా మాత్రం ఎప్పుడూ ఉండవద్దని, పనితీరు మార్చుకోని వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా మంచి పనితీరు కనబరిచినందుకు ఎన్ క్యూఏఎస్ సర్టిఫికెట్లను వైద్యాధికారులకు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, కరీంనగర్, హుజురాబాద్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓలు జువేరియా, చందు, డీటీసీఓ రవీందర్ రెడ్డి, డీఎంఓ రాజగోపాల్, డీఐఓ సాజిత హత హరి, పీఓ ఎమ్ హెచ్ఓ సన జువేరియా, డెమో రంగా రెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

బీజేపీని ఓడించడానికి ప్రజలు సిద్ధం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

నవతెలంగాణ - కరీంనగర్

వేసవికాలం తీవ్రతరం అవుతున్న తరుణంలో రాష్ట్రంలో తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలని.. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో వెంకటస్వామి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల మూలంగా రాష్ట్రంలో దొరల పాలనను అంతమొందించడం కోసం కేసీఆర్ నియంతృత్వ పరిపాలనపై ప్రజలంతా విసిగి వేసారిపోయి గత్యంతరం లేక కాంగ్రెస్‌కి అధికారం కట్టబెట్టారని అన్నారు. గత సంవత్సరం డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన పట్ల, ప్రజా సమస్యల పట్ల పూర్తిస్థాయిలో దృష్టి సారించకుండా, నాలుగు నెలలు గడిచినా అధికార యంత్రాంగంపై నియంత్రణ లేదని, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కేవలం మితిమీరిన ప్రజాస్వామ్యం కాంగ్రెస్‌లో ఉందనే భావంతో మంత్రివర్గంలోని మంత్రులంతా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మాట్లాడుతున్నారని అన్నారు. వేసవికాలం ప్రారంభమై ఎండలు తీవ్రతరమవుతున్నా ఒక ప్రణాళిక లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ఇప్పటికే గ్రామాల్లో తాగునీరుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. రైతుల బాధలను పట్టించుకోకపోవడం సరైంది కాదని అన్నారు. ఎగువ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టుల నుంచి దిగువలో ఉన్న మిడ్ మానేరు, ఎల్ఎండీ, ఇతర ప్రాజెక్టులకు నీళ్ల తెప్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల ప్రాజెక్టులలో అనేక అవకతవకలు జరిగాయని, కొన్ని పిల్లర్లు కుంగిపోయాయని ఆ ప్రభుత్వ వైఫల్యాలపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్తుతుందని ఆచరణలో చేసి చూపించాలన్నారు. లక్షల కోట్ల అవినీతి జరిగిందని పదేపదే చెబుతున్న కాంగ్రెస్ పాలకులు అవినీతికి పాల్పడ్డ అధికారులను గానీ గత పాలకులను గానీ ఏమాత్రం వదిలిపెట్టకుండా చర్యలు చేపట్టి వారి వద్ద నుంచి ఆ సొమ్మును రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనేక రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ఉసురు పోసుకుందని, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ రైతు దీక్ష చేస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి ప్రజలంతా సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వేసవి కాలం ప్రారంభమై ఎండలు మండుతున్న తరుణంలో ఉపాధి కూలీలకు సరిపడా పనిముట్లు, టెంట్లు, తాగడానికి నీరు, మజ్జిగ ప్యాకెట్లు ఇతర సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేసారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ శ్రేణులను సిద్ధం చేసేందుకు ఈ నెల 6న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల, ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం కరీంనగర్‌లో జరగనుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపెల్లి రాజు, బ్రాహ్మణపల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, మచ్చ రమేష్, రామరపు వెంకటేష్, నాయకులు న్యాలపట్ల రాజు, చెంచల మురళి, కేషబోయిన రాము, కనకం నరేష్ పాల్గొన్నారు.

బూటకపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్

నవతెలంగాణ - గంగాధర

ప్రజలను మభ్యపెట్టే బూటకపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకుని హామీల అమలులో విఫలమవుతుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ పొలాల బాట పట్టేసరికి కాంగ్రెస్‌కు భయం మొదలైందన్నారు. వరిధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, కొనుగోలు సెంటర్లు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ద్వారా 15000 సాయం, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు లక్షతో పాటు తులం బంగారం, ప్రతి మహిళకు 2500 సాయం, రైతు రుణమాఫీ ఎప్పుడిస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఎండిన పొలాల బాట పెట్టేసరికి సీఎం రేవంత్‌రెడ్డికి భయం మొదలైందని, ఇన్ని రోజులు నీళ్లు లేవని ఇప్పుడు కేసీఆర్ బయటకు రాగానే గాయత్రి పంప్ హౌస్‌లో మోటార్లు ఎలా నడుపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణరావు, ఎంపీపీ శ్రీరామ్ మధు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ బాలగౌడ్, నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మినారాయణ

నవతెలంగాణ - తిమ్మాపూర్

మోసపూరితమైన హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని బీజేపీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ఆరోపించారు. బుధవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా 6 గ్యారంటీలు అమలుచేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ బండి సంజయ్‌పై ఆరోపణలు చేస్తూ స్థాయిని తగ్గించుకుంటున్నాడని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల జోగిరెడ్డి, దొంగల రాములు, మాడ వెంకట్‌రెడ్డి, బొంతల కళ్యాణ్ చంద్ర, కరివేద మహిపాల్‌రెడ్డి, దండు కొమురయ్య సుగుర్తి జగదీశ్వరాచారి పాల్గొన్నారు.

సాగు, తాగునీరుపై పట్టింపులేని కాంగ్రెస్ ప్రభుత్వం

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి నియోజకవర్గంలో రైతులు సాగునీరు కోసం, ప్రజలు తాగునీరు కోసం అల్లాడుతుంటే కాంగ్రెస్ నాయకులు ఏం మాత్రం పట్టించుకోవడంలేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. పట్టణంలో అసెంబ్లీ కన్వీనర్ పెరిక శ్రావణ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా చొప్పదండి నియోజకవర్గంలోని రాగంపేట, రేవెల్లె, కొడిమ్యాల మండలంలలో ఎన్ని చెరువులు, కుంటలు నింపారో ఎమ్మెల్యే శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. కేసీఆర్ ఏం మొహం పెట్టుకొని జిల్లాలో పర్యటిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణగౌడ్, మావురం సుదర్శన్‌రెడ్డి, బత్తిని ప్రశాంత్‌గౌడ్, కోలా అశోక్, రేకులపల్లి రవీందర్‌రెడ్డి, నేరెళ్ల శ్రావణ్‌రెడ్డి, జిట్ట కుమార్ పాల్గొన్నారు.

రూరల్ పోలీసుల కస్టడీలో పిట్టల రవీందర్

నవతెలంగాణ-కరీంనగర్ క్రైం

నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే గాక, బాధితుని భూ ఆక్రమణకు పాల్పడిన మాజీ చింతకుంట సర్పంచ్, ప్రస్తుత కొత్తపల్లి జెడ్పీటీసీ భర్త పిట్టల రవీందర్‌ను గత నెల 26వ తేదీన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. కేసుకు సంబంధించిన మరింత సమాచారం సేకరించేందుకు గాను విచారణ కోసం కోర్టు ద్వారా 48 గంటలు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు పోలీసు కస్టడీకి తీసుకున్నామని కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. కస్టడీలోకి తీసుకున్న పిట్టల రవీందర్ నుంచి మరింత విలువైన సమాచారం సేకరించేందుకు గాను అతని ఇంటిలో సోదాలు నిర్వహించిన రూరల్ పోలీసులు పలు కీలక డాకుమెంట్లను స్వాధీన పరుచుకున్నారని తెలిపారు.

రూరల్ పోలీసుల కస్టడీలో ఆకుల ప్రకాష్



నకిలీ ధ్రువపత్రాలను సృష్టించడమే గాక ఒకే భూమిని పలువురికి విక్రయించి, ముందుగా కొనుగోలు చేసిన విక్రయదారులను మోసం చేసిన విషయంలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను గత నెల 26వ తేదీన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. కేసుకు సంబంధించిన మరింత సమాచారం సేకరించేందుకు విచారణ కోసం కోర్టు ద్వారా 24 గంటలు బుధవారం ఉదయం 10 గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు పోలీసు కస్టడీకి తీసుకున్నామని కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. కస్టడీలోకి తీసుకున్న ఆకుల ప్రకాష్ నుంచి మరింత విలువైన సమాచారం సేకరించేందుకు గాను అతని ఇంటిలో సోదాలు నిర్వహించిన రూరల్ పోలీసులు పలు కీలక డాకుమెంట్లను స్వాధీన పరుచుకున్నారని తెలిపారు.

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్

ఉపాధి హామీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు మాట్లాడుతూ జూబ్లీనగర్ గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు మూడు నెలలు నుండి డబ్బులు మాత్రం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలేమో రోజు కూలి 300 రూపాయలని ప్రకటించి కూలీలకు మాత్రం రోజుకు120 నుండి 150 రూపాయల మాత్రమే రావడం దుర్మార్గమన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం రెండు వారాలలో ఉపాధి కూలి డబ్బులు రాకపోతే, తర్వాత ఎన్ని రోజులకు వచ్చినా వడ్డీతో చెల్లించాలని చట్టం చెబుతున్నది అని అన్నారు. వెంటనే డబ్బులు చెలించి, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్, సునీత పాల్గొన్నారు.

ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, ఎంబీఏ విద్యార్థుల హవా


ప్రశంసా పత్రాలతో కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్

బొమ్మకల్‌లోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, ఎంబీఏ విద్యార్థులు వివేకనంద డిగ్రీ అండ్ పీజీ కళాశాల వారు నిర్వహించిన ఎస్‌యూఐ జనరిస్ ప్రోగ్రాంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు ఆక్టివ్ పార్టిసిపేషన్ ట్రోఫీతో పాటు 14 రకాల ఈవెంట్స్‌లో ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. విజయం సాధించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి ప్రశంశాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, ఏవో ఎం.రాధాకృష్ణ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సంతోషి, రజితరెడ్డి, మహమ్మద్ ఇలియాజ్ అలీ, మహమ్మద్ అజారుద్దీన్, సుప్రియ, ప్రియాంక పాల్గొన్నారు.

డీ-94 పిల్ల కాలువపై అక్రమ నిర్మాణాలు


పిల్ల కాలువ పై వేసిన ఇనుప కంచె

నవతెలంగాణ - భగత్‌నగర్


పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలోని వ్యవసాయ పొలాలకు వెళ్లే పిల్ల కాలువ (డీ-94-9ఆర్-2డీపీ)ను కొందరు ప్రయివేటు కాంట్రాక్టర్స్ మట్టితో కప్పేసి సిమెంట్ పోల్స్‌ను పాతి ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఇదే కాలువ పరివాహక ప్రాంతంలో గృహ నిర్మాణ పిల్లర్లు నిర్మించి నీటి పారుదలకు ఆటంకాలను సృష్టిస్తున్నారు. ఈ విషయం విలేకరుల దృష్టికి రాగా వారు బుధవారం ఇరిగేషన్ డీఈ సంతోష్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన ఏఈ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అంజన్‌ను వెంటనే మొఖా మీదికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం కాలువ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే పనులు నిలిపివేయాలని, లేకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిరుపేద వివాహానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలోని నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన సాంబారి కావ్య వివాహానికి జిల్లా పద్మశాలి సంఘం, కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం, పద్మశాలి సంక్షేమ వెల్ఫేర్ ట్రస్ట్ కరీంనగర్, కోప కరీంనగర్, నేత బజార్ కమిటీ కరీంనగర్, చొప్పదండి మండల పద్మశాలి సంఘం, కొత్తపల్లి పద్మశాలి సంఘం అనుబంధ సంఘాలు 88వేలా310 రూపాయలను అందజేశారు. సహాయం అందజేసిన సంఘం నాయకులకు జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి వల్లాల కృష్ణాహరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం, గౌరవాధ్యక్షుడు వాసాల రమేష్, కరీంనగర్ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, దూస కైలాసపతి, గజవెల్లి కనకయ్య, స్వర్గం మల్లేశం, అలస భద్రయ్య ఇప్పనపల్లి సాంబయ్య, తవుటు మురళి, రవీందర్, ప్రకాష్, ఎన్నం మునిందర్, గాలిపెల్లి రమణయ్య, రాజయ్య, వాసు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎంఓ పద్మావతి, జిల్లా సహకార అధికారి రామానుజచార్యులు ప్రారంభించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, మార్కెట్ యార్డ్‌కు తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రెటరీ మల్లేశం, రైస్ మిల్లర్లు మల్లికార్జున్, శ్రీనివాస్, రమేష్, తొడుపునూరి లక్ష్మయ్య, సంఘం కార్యదర్శి కళ్లెం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ కాన్ఫరెన్స్‌లో...

తిరుపతికి బెస్ట్ ఓరల్ ప్రజెంటేషన్ అవార్డు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంగారెడ్డిలోని టీటీడబ్ల్యూఆర్ లా కాలేజీలో నాలుగో సంవత్సరం చదువుతున్న న్యాయ విద్యార్థి ఎం.తిరుపతి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటారు. ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అసోసియేషన్, పలు విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా బ్యాంకాక్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ కాన్ఫరెన్స్ లో తిరుపతి పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో 'ఎ క్రిటికల్ స్టడీ - ద లా కమిషన్ అండ్ ఇట్స్ లీగల్ రిఫార్మ్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ ప్రజెంటేషన్‌కు బెస్ట్ ఓరల్ ప్రజెంటేషన్ అవార్డు దక్కింది. తనకు అవార్డు రావడం పట్ల ఆ విద్యార్థి హర్షం వ్యక్తం చేశారు.



సాగర్‌లో మాజీ ఎమ్మెల్యే భగత్ నివాసం సీజ్

- స్వాధీనం చేసుకున్న అధికారులు

నవతెలంగాణ- నాగార్జునసాగర్

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌కు సాగర్‌లో కేటాయించిన ఇంటిని అధికారులు సీజ్ చేశారు. నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నివాసమున్న ఈఈ 19 నెంబర్ గల ఇంటిని మంగళవారం సాయంత్రం నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లోని వస్తువులను ఎన్ఎస్పీ స్టోర్ రూమ్‌కు తరలించారు. ఈ విషయంలో సాగర్ డ్యామ్ ఈ.ఈ మల్లికార్జునరావును వివరణ కోరగా.. ఆ ఇంటిని గతంలో మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య క్యాంప్ ఆఫీస్ పేరు మీద అలాట్‌మెంట్ చేసినట్టు చెప్పారు. దానిపై ప్రభుత్వ నిధులతో మరమ్మతులు కూడా చేయించారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నికైనందున ఆ నివాసాన్ని వారికి అప్పగించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో పలుమార్లు నోటీసులు అందజేసినా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నుంచి స్పందన రాలేదన్నారు. దీంతో కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం మంగళవారం రాత్రి సామగ్రిని తరలించి, ఇంటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్‌ను వివరణ కోరగా, సాగర్‌లో తాను నివాసముంటున్న ఇంటిని తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా ఎన్ఎస్పీ అధికారులు స్వాధీనం చేసుకోవడం అన్యాయమన్నారు. ఈ విషయంలో న్యాయపరంగా పోరాటం సాగిస్తామన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

మాజీ ఎమ్మెల్యే ఇంటిని అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలుసుకొని బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని, ఇలాంటి చర్యలు మానుకోవాలని అన్నారు.

నీటి ట్యాంకులో కోతుల మృత్యువాత

- పదుల సంఖ్యలో పైకి తేలిన కళేబరాలు
- ట్యాంక్ వైపు కన్నెత్తి చూడని సంబంధిత సిబ్బంది
- అలాగే నీటి సరఫరా



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నందికొండ మున్సిపాలిటీ ఒకటో వార్డు పరిధిలోని విజయ విహార్ పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్‌లో కోతుల మృతదేహాలు బయటపడిన విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొన్ని రోజులుగా నీటి సరఫరా అవుతున్న అదే కలుషిత నీటిని వార్డు ప్రజలు తాగుతున్నారు. వాటర్ ట్యాంకుపై మూత తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లిన కోతులు బయటికి రాలేక అందులోనే మృతిచెందాయి. సుమారు 30 నుంచి 40 వరకు కోతుల మృతదేహాలు నీటిలో తేలుతూ కనిపించడం కలకలం రేపింది. అటువైపే చూడని మున్సిపల్ సిబ్బంది.. నీటిని అలాగే కాలనీకి సరఫరా చేస్తున్నారు. నీటి సరఫరా సిబ్బంది ట్యాంక్ శుద్ధిచేయడం మరిచి.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్‌పై మూత ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వానరాల కళేబరాలను మున్సిపల్ సిబ్బంది బయటికి తీశారు. వీటిని చూసి చుట్టుపక్కల తిరుగుతున్న మరికొన్ని కోతులు మున్సిపల్ సిబ్బందిపై ఎగబడ్డాయి.



కొనసాగుతున్న నంది జాతీయ నాటకోత్సవాలు

నేడు ముగింపు

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మినీ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న పద్య పౌరాణిక సాంఘిక నంది జాతీయ నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం నాల్గో రోజు కార్యక్రమాన్ని అష్టావధాని, రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయులు కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి, రంగస్థలం సీనియర్ నటులు గుంటి పిచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు జానకిరామ్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా కమిటీ కార్యదర్శి పులి కృష్ణమూర్తిశర్మ మాట్లాడుతూ.. ఎంతో వ్యయ ప్రయాసలకులోనై నంది నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నాటకోత్సవా లకు సహకరించిన దాతలు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. గురువారం నాటిక పోటీలకు చివరి రోజు అని, ఉదయం టి.కృష్ణ ఆర్ట్స్ థియేటర్ మిట్టపాలెం పల్నాడు జిల్లా వారిచే 'ప్రేమించే వయసేనా?' సాంఘిక నాటిక, ఉదయం 11 గంటలకు 'జరుగుతున్న కథ' అరవింద తాడేపల్లి, గుంటూరు జిల్లా వారిచే సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ నాటికల అనంతరం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. బుధవారం టీబీఆర్స్ థియేటర్స్ హైదరాబాద్ వారికి 'శ్రీస్వామి అయ్యప్ప' పద్య నాటిక, నటరాజ్రమిటి అసోసియేషన్ పెందుర్తి వారిచే 'శిథిల జీవితం' సాంఘిక నాటిక, డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీ సాయిబాబా నాట్యమండలి విజయవాడ వారిచే మాధవ వర్మ పద్య నాటిక నిర్వహించారు. అనంతరం కళాకారులకు ప్రశంసా పత్రాలతోపాటు నగదు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు తడకమళ్ళ రామచంద్రరావు, అధ్యక్ష కార్యదర్శులు భుజంగరావు పులి కృష్ణమూర్తి శర్మ, గ్యార సాయిలు, కోశాధికారి పుల్లాభట్ల లక్ష్మీనారాయణ శర్మ, చంద్రశేఖర్ రావు జానకిరామ శర్మ, ఎండి ఇనాయతుల్లా, దుర్గి శ్రీనివాస్ శర్మ, పరిమి రామావతారం మామిడాల ఉపేందర్, బాబురావు, బాపనయ్య, రాఘవయ్య, పయ్యావుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీతావహం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతానికి చెందిన వాళ్లే ఉన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన షిఫ్ట్‌లో మాత్రం 50 మంది కార్మికులు విధుల్లో ఉన్నట్టు సమాచారం. కంపెనీలో ఉత్పత్తి జరుగుతున్న వేళ ఉన్నట్టుండి బాయిలర్ పేలి మంటలొచ్చాయి. అక్కడ ఎగిసి పడిన మంటలు కాస్త రియాక్టర్‌పై పడటంతో భారీ పేలుళు సంభవించాయి. దాంతో కంపెనీ మొత్తం దట్టమైన పొగమబ్బులు కమ్ముకున్నాయి. అగ్నికీలలు ఎగసిపడ్డాయి. భారీ పేలుళ్ల వల్ల బాయిలర్, రియాక్టర్ వద్ద పనిచేస్తున్న కార్మికుల్లో కొందరు అక్కడికక్కడే విగత జీవులయ్యారు. కంపెనీలో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సమచారం తెలిసిన వెంటనే సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని

అగ్నిమాపక సిబ్బంది ఐదు ఫైర్ ఇంజన్లతో వచ్చి కంపెనీలో ఎగసిపడుతున్న మంటల్ని ఆర్పారు. మంటలు అదుపులోకి వచ్చాక మృతుల్ని, క్షతగాత్రుల్ని వెలికి తీశారు. సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యల్ని పర్యవేక్షించారు. మృతుల్లో కార్మికులతో పాటు కంపెనీ ఉద్యోగులు కూడా ఉన్నారు. కంపెనీలో పొగలు కమ్ముకోవడంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో చూసేందుకు వెళ్లిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రవి శర్మ ప్రొడక్షన్ ఇన్‌చార్జీలు సుబ్రమణ్యం, దయానంద్‌తో పాటు మెయింటెనెన్స్ ఇన్‌చార్జి సురేష్ పాల్ కూడా మృతిచెందారు. ఏడుగురు మరణించినట్టు ప్రాథమికంగా గుర్తించారు. 30 మందికి పైగా కార్మికులు పేలుళ్ల దాటికి, మంటల వల్ల తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు పది అంబులెన్స్‌లతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని మంత్రి కొండా సురేఖ సందర్శించారు. మృతుల కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఆక్రందనలు.. ఆర్తనాదాలు..

మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. పేలుళ్ల తాకిడికి విగత జీవులైన కార్మికులు, కంపెనీ ఉద్యోగుల మృతదేహాలను బయటికి తీయడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. మంటల్లో చిక్కిన పలువురు కార్మికులు తమల్ని కాపాడాలంటూ ఆర్తనాదాలు పెట్టారు. కంపెనీలో జరిగిన ప్రమాదంలో వందల మీటర్ల దూరంలో శవాలు ఎగిరిపడ్డాయి. రియాక్టర్ పేలడం వల్ల మూడు భవనాలు నేలమట్టమయ్యాయి. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాది మంది అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రుల ఆర్తనాదాలు, ముక్కలు చెక్కలైన శవాలను చూసి కంటతడి పెట్టారు. రియాక్టర్ పేలడంతో కంపెనీ రేకులు ఎగిరి అరకిలో మీటర్ దూరంలో పడ్డాయి. దాంతో అక్కడున్న పది మందికి కూడా గాయాలయ్యాయి.

సేఫ్టీ మెజర్‌మెంట్స్ లేకనే ప్రమాదం

కెమికల్ కంపెనీల్లో తరచూ పేలుళ్లు సంభవించి కార్మికులు చనిపోతున్నారు. ఎస్‌బీ ఆర్గానిక్ కెమికల్ ఫ్యాక్టరీలో సంభవించిన పేలుళ్లలో ఏడుగురు మరణించడం విషాదకరమైన సంఘటన. అయితే కంపెనీలో సేఫ్టీ మెజర్‌మెంట్స్ సరిగ్గా లేకపోవడం, బాయిలర్, రియాక్టర్ల వద్ద నైపుణ్యం, అనుభవం కల్గిన కార్మికులతో కాకుండా తక్కువ వేతనాలతో సాధారణ కార్మికుల్ని పెట్టి పనిచేయించడం కూడా పేలుళ్లకు కారణంగా చెబుతున్నారు. ఎస్‌బీ ఫ్యాక్టరీలోనే కాదు, సంగారెడ్డి జిల్లాలోని వందల కంపెనీల్లో ఇదే నిర్లక్ష్యం కొనసాగుతోంది. నెల క్రితం హత్నూర మండలంలోని గుండ్లమాచెనూరులో ఉన్న కోలాండ్ కంపెనీలో పేలుళ్ల సంభవించి నలుగురు కార్మికులు మరణించారు. పటాన్‌చెరు ఏరియాలోని మరో కంపెనీలో కూడా పేలుళ్ల వల్ల ముగ్గురు కార్మికులు చనిపోయారు. నెల రోజుల్లోనే 15 మంది కార్మికులు అగ్ని ప్రమాదాలు సంభవించి మృత్యువాత పడ్డారంటే కంపెనీల నిర్లక్ష్యం ఏపాటిదో అర్థమవుతోంది. ఫ్యాక్టరీల్లో సేఫ్టీ మెజర్‌మెంట్స్ ఉన్నాయా.. లేవా.. అని తనిఖీ చేయాల్సిన ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్స్ సైతం మామూళ్ల మత్తులో తూగుతున్నారు. ఇటీవల సీఐటీయూ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ ఆఫీస్‌ను ముట్టడించి ఆందోళన చేశారు.

సందర్శించిన పలువురు నేతలు

ప్రమాదం జరిగిన సంఘటనా స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు సందర్శించారు. సీఐటీయూ, సీపీఐ(ఎం) జిల్లా ప్రతినిధి బృందం ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాద స్థలాన్ని సందర్శించింది. సంఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రుల్ని పరామర్శించి ఓదార్చారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే సహాయ చర్యలు చేపట్టాలని కోరారు.

మృతుల కుటుంబాల్ని ఆదుకోవాలి : సీఐటీయూ

ఎస్‌బీ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాల్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మల్లేశం, కోశాధికారి కె.రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలని తెలిపారు. జిల్లాలో



తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణాలు బలి : జి.జయరాజ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

ఫ్యాక్టరీల యాజమాన్యాల నిర్లక్షం వల్లే కార్మికులు నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే జిల్లాలో మూడు ఫ్యాక్టరీల్లో రియాక్టర్లు పేలి 15 మంది వరకు చనిపోయారు. ఇంత మంది చనిపోతున్నా ఫ్యాక్టరీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారు. తక్షణమే జిల్లాలోని ఫ్యాక్టరీలను తణిఖీ చేసి సేఫ్టీ మెజర్‌మెంట్స్ లేని కంపెనీలను సీజ్ చేయాలి. చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి. గాయాలపాలైన కార్మికులు, సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలి.

ఓట్ల కోసం మత విద్వేషాలు

- రెచ్చగొడుతూ అధికారంలోకి రావాలని బీజేపీ యత్నం
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలి : సెమినార్‌లో హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ పిలుపు



మాట్లాడుతున్న చంద్రకుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

'ఓట్ల కోసం మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి, మల్లుస్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమితి కన్వీనర్ డా. రవీంద్రనాథ్ సూరి అధ్యక్షతన 'రాజ్యాంగానికి ప్రమాద ఘంటికలు' అంశంపై నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయాలను అస్థిరపరుస్తూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల కోసం దిగజారుడు రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా 1976లో చేసిన 42వ రాజ్యాంగ సవరణలో పొందుపరిచిన లౌకిక, సోషలిస్ట్ భావాలను భారత రాజ్యాంగం నుంచి తొలగించడమే కాకుండా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన ఈ భారత రాజ్యాంగాన్ని తొలగిస్తామని మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. దేశాన్ని ఐక్యంగా కాపాడాల్సిన నాయకత్వాన్ని ప్రజలందరూ ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశం మత ఉన్మాదంపై ఆధారపడింది కాదని, లౌకిక, ప్రాథమిక హక్కులే దేశానికి మూల స్తంభాలని స్పష్టంచేశారు. అదేవిధంగా మోడీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్, ఈడీ, సీబీఐ తదితర రాజ్యాంగ సంస్థలను సైతం తన గుప్పిట్లోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచడమే కాక, ప్రతిపక్ష పార్టీలను అణిచివేసి మరోకసారి రాజ్యాధికారాన్ని అందుకోవాలని ఆశిస్తున్నదని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు ప్రజలందిస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామని మాట్లాడటంలోని ఆంతర్యం ఏముందో ప్రజలందరూ గమనించాలని తెలిపారు. అత్యధిక ఎలక్టోరల్ బాండ్లలో బీజేపీకి కార్పొరేట్ సంస్థలు ఎక్కువ డబ్బులు అందించాయని ప్రజలకు తెలియకుండా మభ్యపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వాలపై దాడులు చేయడం సరికాదని అన్నారు. బీజేపీ పదేండ్ల పాలనలో విద్యా వైద్యాన్ని గాలికి వదిలేసిందని తెలిపారు. దేశంలో మళ్ళీ బీజేపీ అధికారంలోకి వస్తే మణిపూర్‌లా దేశాన్నీ అగ్నిగుండంగా మారుస్తారని అన్నారు.

ప్రముఖ జర్నలిస్ట్ పద్మజా షా మాట్లాడుతూ.. ప్రపంచపు ఆహార సూచికలో, పర్ క్యాపిటల్ సూచికలో మన దేశం పక్క దేశాల కన్నా వెనుకంజలో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, పేదరికంతో దీనస్థితిలో మగ్గిపోయినా.. మోడీ ప్రభుత్వం మాత్రం ఈ దేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక దేశంగా ఎదుగుతుందని మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్ మాట్లాడుతూ.. బీజేపీ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తోందని, హిందూ ముస్లింల మధ్య చిచ్చులు పెట్టడం వెన్నతో పెట్టిన విద్యగా మారిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని రేపు జరగబోయే ఎన్నికల్లో ప్రజలంతా ఓడించి లౌకికతత్వ పార్టీలను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్, కే రామ్మోహన్‌రావు, నర్రా రామారావు, గైని గంగారం, పాస్టర్ ఆనంద్, శ్రీధర్, శంతన్, ఈవీఎల్ నారాయణ, ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కూతురు కోసం 'కడియం' దిగజారుడు రాజకీయాలు

- పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ



నవతెలంగాణ-హన్మకొండ

తాను మాదిగనని చెప్పుకుంటూ 40 ఏండ్లుగా రాజకీయాల్లో అనేక పదవులు అనుభవించి జిల్లాలో ముగ్గురు ప్రధాన మాదిగ నాయకుల రాజకీయ భవిష్యత్తును అణగదొక్కి ఇప్పుడు తన బిడ్డ కావ్య కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తున్న కడియం శ్రీహరికి వరంగల్ జిల్లా మాదిగలు తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద కృష్ణమాదిగ మాట్లాడారు. మంగళవారం తనపై కడియం శ్రీహరి అనేక అసత్య ఆరోపణలు చేశారని, మాదిగల వర్గీకరణకు, మాదిగ దండోరా ఉద్యమానికి తాను మద్దతు ప్రకటిస్తేనే మందకృష్ణ ఈ స్థాయికి వచ్చారని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మొదటిసారి 1994లో కడియం శ్రీహరి ఎమ్మెల్యే కావడానికి మా మద్దతే ప్రధాన కారణమని, అప్పుడు 10మంది ఎమ్మెల్యేలు ఉండటం వల్ల బైండ్ల ఉప కులానికి చెందిన కడియంకు మేము మద్దతు ప్రకటించామని అప్పటినుండి ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఉప ముఖ్యమంత్రిగా అనేక పదవులు అనుభవించి ఏ ఒక్క మాదిగ నాయకుడిని ఎదగనీయకుండా కుట్రలు చేశారని ఆరోపించారు. ప్రధానంగా తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్, ఆరూరి రమేష్‌ల రాజకీయ భవిష్యత్తును నాశనం చేసారని తెలిపారు. శ్రీహరి మంత్రిగా ఉన్న సమయంలో అనేకమంది దళిత నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేయడంలో ప్రధాన పాత్ర పోషించి, ఇప్పుడు వేదాలు వల్లిస్తున్నాడన్నారు. గతంలో కూడా అనేకమందికి టికెట్ రాకుండా అడ్డుపడి ఇప్పుడు తన బిడ్డ కావ్య కోసం ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ టికెట్ కోసం ఎదురుచూస్తున్న అనేకమంది మాదిగబిడ్డలకు ద్రోహం చేశారని, ఇలాంటి నాయకుడికి వరంగల్ జిల్లా మాదిగలు పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు మంద కుమార్‌మాదిగ, వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

విపత్తు నిధుల విడుదలకు ఆదేశించండి



సుప్రీంను ఆశ్రయించిన తమిళనాడు

- కేంద్ర వైఖరిపై మండిపాటు
- కపట ప్రేమ చూపుతోందని ఆక్షేపణ
- నిధుల నిలిపివేత హక్కుల ఉల్లంఘనే
- అది చట్టవిరుద్ధం... ఏకపక్షం

న్యూఢిల్లీ : విపత్తు సహాయ నిధుల కోసం, జాతీయ విపత్తుల కోసం ఉద్దేశించిన ఆర్థిక సాయాన్ని విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించా లంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతంలో కర్నాటక కూడా న్యాయస్థానంలో ఇదే రకమైన పిటిషన్ దాఖలు చేసింది. జాతీయ విపత్తు సహాయ నిధులను కేంద్రం నిలిపివేసిందని తమిళనాడు తన పిటిషన్‌లో ఆరోపించింది. తమిళ నాడు పిటిషన్‌కు ప్రాధాన్యత ఉన్నందున త్వరలోనే విచారణకు వస్తుందని సుప్రీం కోర్టు రిజిస్ట్రీ, సిబ్బంది వర్గాలు తెలిపాయి.

కరువుతో విలవిలలాడుతున్న కర్నాటకకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడం లేదని ఆరోపిస్తూ న్యాయం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో సుప్రీంకోర్టు తలుపు తట్టిన విషయం తెలిసిందే. కాగా తమకు తక్షణ తాత్కాలిక సాయంగా రూ.2,000 కోట్లు అందించేలా చూడాలని తమిళనాడు ప్రభుత్వం కోరింది. ఇటీవల సంభవించిన వరదలు, తుఫాను కారణంగా జరిగిన నష్టానికి రూ.35,000 కోట్లు విడుదల చేసేలా కేంద్రాన్ని వెంటనే ఆదేశించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. నివేదికలపై చర్యలు తీసుకోవడంలోనూ, ఆర్థిక సాయం విడుదలకు నిర్ణయం తీసుకోవడంలోనూ కేంద్రం విఫలమైందని తమిళనాడు ఆరోపించింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 కింద పౌరులకు లభించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని విమర్శించింది. కేంద్రం చర్య చట్టవిరుద్ధం, ఏకపక్షం అని అభివర్ణించింది.

గతంలో కూడా అనేక సందర్భాలలో సాయం కోసం కేంద్రాన్ని అభ్యర్థించామని, అయితే కేంద్రం మొండిచేయి చూపిందని తమిళనాడు ప్రభుత్వం తన పిటిషన్‌లో వివరించింది. తుఫాను, అసాధారణ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రం జంట విపత్తులు ఎదుర్కొన్నదని, అయినప్పటికీ కేంద్రం సాయం అందించి తమను ఆదుకోలేదని తెలిపింది. 'నిధుల విడుదలలో జాప్యం చేయడం సమర్థనీయం కాదు. రాష్ట్రాలకు సాయం అందించడంలో తేడా చూపడం వర్గ వివక్షే అవుతుంది. కపట ప్రేమ చూపడం జాతీయ విపత్తు నిర్వహణ విధానాన్ని ఉల్లంఘించడమే అవుతుంది' అని పేర్కొంది. జాతీయ విపత్తుల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసిన అంతర్ మంత్రిత్వ శాఖల బృందం ఇచ్చిన నివేదికపై కూడా కేంద్రం చర్యలు తీసుకోలేదని మండిపడింది. దీనివల్ల రాష్ట్రంలో అభివృద్ధి కార్యకలాపాలకు విఘాతం కలిగిందని, రాష్ట్ర ప్రజలు మానసిక వేదనను, ఇబ్బందులను అనుభవించారని తమిళనాడు ప్రభుత్వం తన పిటిషన్‌లో తెలిపింది.

టోల్ ట్యాక్స్‌కు కొత్త పద్ధతి

టోల్ ట్యాక్స్ చెల్లింపు విధానంలో కేంద్రం ఓ కొత్త విధానాన్ని తీసుకురాబోతుంది. టోల్ చార్జీలను ఆటోమేటిక్‌గా వసూలు చేసుకునే విధంగా రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) టెక్నాలజీ రాబోతుంది. కారులో, ఇతర వాహనంలో ఉండే జీపీఎస్ పరికరం ద్వారా ప్రయాణ మార్గాన్ని గుర్తించి ఫీజును వసూలు చేస్తారు. కాకపోతే ఈ విధానం అమలుకు సమయం ఎక్కువ తీసుకునే అవకాశం ఉంది.

- ఆర్ఎఫ్ఐడీ టెక్నాలజీతో ఫీజు వసూలు
- అమలుకు చాలా సమయం పట్టే అవకాశం..!



నవతెలంగాణ-ఎల్‌బీనగర్

జాతీయ రహదారిపై వెళ్తున్నప్పుడు మధ్యలో టోల్‌గేట్స్ వద్ద టోల్ ట్యాక్స్ చెల్లించడం ప్రస్తుతం తప్పనిసరి. ప్రస్తుతం ఫాస్టాగ్స్ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. అయితే, పండుగలు, ప్రత్యేక రోజుల సమయాల్లో టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ పెరుగుతోంది. తాజాగా ఫాస్ట్‌ట్యాగ్ విధానానికి కేంద్ర ప్రభుత్వం బైబై చెప్పబోతోంది. ఈ మేరకు కొత్తగా జీపీఎస్ విధానాన్ని తీసుకురాబోతోంది. టోల్ వసూళ్లకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీఎస్)ను అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా జీపీఎస్ విధానాన్ని ప్రకటించారు. దాని ప్రకారం అన్ని టోల్ ప్లాజాలు, టోల్ కలెక్షన్ బూతులను తొలగించి జీపీఎస్ ఆధారిత వ్యవస్థను అమలు చేస్తారని తెలిసింది.

సాధారణంగా జాతీయ రహదారులపై ప్రయాణం చేస్తున్నప్పుడు టోల్ ప్లాజాలు ఉంటాయి. కార్లు, జీపులు, లారీలు, బస్సులు, ఇతర పెద్ద వాహనాలు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. టోల్ ప్లాజాల వద్ద టోల్ చెల్లించడానికి వాహనాలు బారులు తీరి ఉంటాయి. అందరూ డబ్బులు చెల్లించి ముందుకు వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది. అందుకు ప్రభుత్వం 2017లో ఫాస్ట్‌ట్యాగ్ విధానాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా చాలా సులభంగా టోల్ చెల్లించి ప్రయాణికులు ముందుకు వెళు న్నారు. ఇప్పుడు ఫాస్ట్‌ట్యాగ్ విధానాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేయాలనుకుంటోంది.

ఆర్ఎఫ్ఐడీ టెక్నాలజీతో కొత్త విధానం

రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) టెక్నాలజీతో పనిచేసే కొత్త విధానం ద్వారా టోల్ చార్జీలను ఆటోమేటిక్‌గా వసూలు చేసే విధానాన్ని రూపొందిస్తున్నారు. త్రీ జీ కనెక్టివిటీతో మైక్రో కంట్రోల్ ద్వారా ఈ సాంకేతికతను అమలు చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కారులో ఉండే జీపీఎస్ పరికరం ద్వారా వాహనం మార్గాన్ని ఎన్‌హెచ్ఏ, రెగ్యులేటరీ ఏజెన్సీ పరిశీలిస్తుంది. వాహనం ఏ రోడ్ల మీదుగా వెళ్తోంది.. ఎన్ని టోల్ గేట్ల మీదుగా ప్రయాణం సాగిస్తుందని అది గుర్తిస్తుంది. జీపీఎస్ ఆధారిత సిస్టమ్ బహుశా హైవేల వెంట అమర్చే కెమెరాల ద్వారా ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ సిస్టమ్‌ను ఉపయోగిస్తుందని తెలుస్తోంది. దాని ఆధారంగా వాహన యజమాని నుంచి ఫీజు వసూలు చేస్తారు. అయితే, ఆ నగదు నేరుగా బ్యాంకు ఖాతా నుంచి తీసుకుంటారని సమాచారం. ఈ పద్ధతిలో అన్ని వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలి. ఈ కొత్త పద్ధతిని అమలు చేయడం అంత సులువు కాదని తెలుస్తోంది. ప్రతి కారు సాంకేతికతను కలిగి ఉండటానికి కొంత సమయం పడుతుందని పలువురు నిపుణులు చెబుతున్నారు.



బార్లీతో రుచిగా...

సహజసిద్ధంగా లభించే బార్లీలో అనే ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్-బి నీటిలో కరిగే తత్వం ఉంటుంది. బార్లీలో బి-విటమిన్లు, పీచు పదార్థాలు వంటివి అత్యధిక భాగం పై పొట్టులోనే ఉంటాయి. కాబట్టి బి విటమిన్ కావాలనుకునేవారు బార్లీ గింజలను యథాతథంగా ఉపయోగించాలి. ఎండాకాలం బార్లీ నీళ్లు, బార్లీ పానీయాలు తాగితే శరీరంలోని వేడి తగ్గుతుంది. ముఖ్యంగా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. బార్లీ గింజలతో కిచిడీ, లడ్డూలు, ఖీర్, వడలు చేసుకుని తింటే రుచితో పాటు ఈ సమ్మర్‌లో కాస్త ఉపశమనం కూడా పొందవచ్చు. వీటి వల్ల కడుపు నిండుగా ఉంటుంది. ఈ హెల్దీ వంటకాలను రుచిగా ఎలా చేసుకోవచ్చో చూద్దాం...

కిచిడి :



కావాల్సిన పదార్థాలు : బార్లీ గింజలు, కందిపప్పు - కప్పు, నెయ్యి - కొద్దిగా, ఇంగువ, జీలకర్ర - తాలింపుకు సరిపడ, కొద్దిగా పచ్చిమిర్చి, ఉల్లిపాయ - చిన్నది ఒకటి, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ విధానం : బార్లీని కడిగి నీటిలో నానబెట్టండి. ప్రెషర్ కుక్కర్‌లో నెయ్యి వేసి వేడి చేయండి. ఇంగువ, జీలకర్ర వేసి వాటిని నాలుగు నుంచి అయిదు సెకన్ల పాటు వేగనివ్వండి. కొన్ని పచ్చి మిర్చి వేయండి. ఉల్లిపాయలు, లేత రంగు వచ్చే వరకు వేపాలి. ప్రెజర్ కుక్కర్‌లో 3 కప్పుల నీరు, ఉప్పు, పసుపుతో పాటు బార్లీ, కంది పప్పుని వేయండి. కాస్తా సన్నని మంట మీద 10 నిమిషాల పాటు ఉడికించాలి. ఇప్పుడు మంట ఎక్కువ పెట్టి 1 విజిల్ వచ్చే వరకూ ఉడికించాలి. ప్రెజర్ పోయే వరకూ అలానే ఉంచి కొత్తిమీరతో గార్నిష్ చేసి వేడివేడిగా వడ్డించండి.

ఖీర్ :

కావాల్సిన పదార్థాలు : బార్లీ గింజలు- కప్పు, పాలు- 2 కప్పులు, సన్నగా తరిగిన ఖర్జూరం ముక్కలు - రెండు టేబుల్ స్పూన్లు, బాదం- పది (సన్నగా కట్ చేయాలి), జీడిపప్పు- పదిహేను, ఎండు ద్రాక్ష- 10, యాలకులు- 4, తేనె- టీస్పూన్.

తయారీ విధానం : రాత్రంతా బార్లీ గింజలను నానబెట్టుకోవాలి. ఖీర్ చేసుకోవాలంటే వీటిని కనీసం ఏడు గంటల పాటు నానబెట్టాలి. పిండిలా అవుతుంటే సరిగ్గా బార్లీ నానినట్లు అర్థం. ఆ తర్వాత పాన్‌లో పాలు పోసి సిమ్‌లో వేడి చేయాలి. బాగా మరిగిన తర్వాత బార్లీని వేయాలి. మధ్యలో గరిటెతో కలుపుతూ.. ఉడికించుకోవాలి. పాలు చిక్కబడుతుంటాయి.



తరిగిన ఖర్జూరం ముక్కలను వేసి కలపాలి. ఆ తర్వాత బాదం, జీడిపప్పు, ఎండు ద్రాక్షలను వేయాలి. ఆ తర్వాత యాలకుల పొడి వేసి కొద్దిసేపు ఉడికించాలి. మధ్యలో గరిటెతో కదుపుతూ ఉండాలి. బార్లీ బాగా ఉడికితే సరి.. ఖీర్ అయినట్లే. ఈ ఖీర్‌లో తేనె వేయాలి. చివరగా బౌల్‌లో వేసుకుని అందులో బాదం, పిస్తా ముక్కలతో గార్నిష్ చేసుకుని తినాలి.

ఉప్మా :

తయారీ విధానం : ప్రెజర్ కుక్కర్‌లో నెయ్యి, నూనె వేసి వేడి చేయాలి. ఆవాలు, కరివేపాకు వేసి ఫ్రై చేయండి. తర్వాత కొద్దిగా కూరగాయల ముక్కలు వేసి కలపండి. ఇప్పుడు బార్లీని వేసి అన్నింటిని కలిపి కొన్ని



నిమిషాల పాటు ఫ్రై చేయండి. ఒక కప్పు నీరు పోయండి. రుచికి కొద్దిగా ఉప్పు వేసి మూత పెట్టి మీడియం మంటపై రెండు నుంచి మూడు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. రెడీ అయ్యాక ప్రెజర్ పోయేలా ఉంచండి. మూత తీసి, నీరు పూర్తిగా మొత్తం ఉడికేలా చూసుకోండి. చివరగా కాసింత నిమ్మరసం వేడివేడిగా సర్వ్ చేయండి.

పాయసం :

తయారీ విధానం : అరకప్పు బార్లీని రాత్రి సమయంలో నీళ్లు పోసి నానబెట్టాలి. తరువాత రోజు ఉదయం పొయ్యి మీద గిన్నె



పెట్టి లీటర్ పాలను పోసి కొంచెం వేడి అయ్యాక నానబెట్టిన బార్లీని వేయాలి. 15 నిమిషాల పాటు ఉడికించాలి. దానిలో జీడిపప్పు, బాదం పప్పు, డేట్స్ వేసి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి వేసుకోవాలి. నిమిషం తరువాత పొయ్యి పై నుండి కిందకు దించాలి. కావాలనుకుంటే డేట్స్ ముక్కలు వేసుకోవచ్చు. పంచదార వాడే బదులుగా తియ్యదనం కోసం ఖర్జూరం ఉపయోగిస్తే సరిపోతుంది.

లడ్డూ :

కావాల్సిన పదార్థాలు : బార్లీ- 1 కప్పు, పల్లీలు- 1 కప్పు, అవిసె గింజలు- 1 కప్పు, నెయ్యి-2 స్పూన్లు, బాదం- 10, జీడిపప్పు- 10, తురిమిన బెల్లం- 1 కప్పు, యాలకుల పొడి- కొద్దిగా

తయారీ విధానం : ప్యాన్‌లో బార్లీ గింజలను వేసి మాడిపోకుండా లోఫ్లేమ్‌లో ఉంచి కదుపుతూ గోల్డెన్‌కలర్‌లోకి మారేంత వరకూ వేయించాలి. వీటిని బౌల్‌లో



వేసుకోవాలి. ఆ తర్వాత పల్లీలను, అవిసె గింజలను వేరువేరుగా రంగుమారేంత వరకూ వేయించి పక్కన ఉంచుకోవాలి. ఇపుడు ప్యాన్‌లో నెయ్యి వేసి బాదం, జీడిపప్పులను వేయించుకోవాలి. ఆ తర్వాత పల్లీల పొట్టు తీసేయాలి. జార్‌లో వేయించిన బార్లీ గింజలు, పల్లీలు, అవిసె గింజలను వేరువేరుగా మిక్సీ పట్టాలి. ఈ మూడు పిండిలను బాగా కలపాలి. ఈ మిశ్రమంతో పాటు బెల్లం కూడా వేసి బాగా కలపాలి. ఆ తర్వాత మిశ్రమాన్ని మిక్సీ పట్టుకుని ఒక ప్లేట్‌లో వేసుకోవాలి. ఇందులోకి వేయించిన బాదం, జీడపప్పులను నెయ్యితో సహా వేసి బాగా మిక్స్ చేయాలి.

ఆ తర్వాత లడ్డూలుగా చేసుకోవాలి. లడ్డులు సరిగా రాకుంటే ఆ మిశ్రమంలో కొద్దిగా కాచిన నెయ్యి వేసి చేసుకోవచ్చు. ఈ లడ్డు రుచిగా ఉంటాయి.

బార్లీ స్మూతీ :

బార్లీ పిండి, బాదం పాలు, తేనె మొత్తం



మిక్సీలో వేసుకోవాలి. మీకు నచ్చిన కొన్ని పండ్లనూ వేసి మరోసారి మిక్సీ తిప్పాలి. గ్లాసులో పోసి దానిపై కొన్ని ఫ్లాక్సీ సీడ్స్ పొడి కూడా చల్లుకుంటే.. ఎంతో ఆరోగ్యకరమైన స్మూతీ రెడీ..

కుదిరితే ఓ కప్పు కాఫీ...



ఉదయం లేవగానే ఓ కప్పు కాఫీ అంటే ఎవరు ఇష్టపడరు! రుచిలో కాస్త చేదుగా, కొంతవరకు ఎసిడిక్‌గానూ ఉంటుంది. అయితే, వేడి వేడి కాఫీ లేకుండా ఏ బ్రేక్‌ఫాస్టు పూర్తి కాదు. పరిమితంగా కాఫీ సేవించడం సురక్షితమే అని పలు నివేదికలు స్పష్టంచేస్తున్నాయి. రోజుకు 3-4 కప్పుల కాఫీ వల్ల కొన్ని ఆరోగ్యపరమైన లాభాలు ఉంటాయని తెలుపుతున్నాయి. కాఫీ తాగే వాళ్లకు కాలేయ వ్యాధులు, కొన్ని రకాల క్యాన్సర్లు, గుండెపోటు వచ్చే అవకాశం తక్కువని నిపుణులు చెబుతున్నారు.

- కాఫీ తాగని వారితో పోలిస్తే, రోజుకు మూడు కప్పుల వరకు కాఫీ తాగే వారికి గుండెపోటు వచ్చే అవకాశం తగ్గుతుందట.
- కాఫీ, రెటీనా పాడవకాకుండా సహాయపడుతుంది కాబట్టి, ఇది దృష్టికి మంచిది.
- బ్లాక్ కాఫీ తీసుకోవడం వల్ల దంతక్షయ ముప్పు తగ్గుతుంది.
- కాఫీ తాగటం వల్ల మహిళల్లో మెనోపాజ్ అనంతర దశలో రొమ్ము క్యాన్సర్ యొక్క ముప్పు 10శాతం వరకూ తగ్గుతుంది.
- కాఫీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కాలేయం ఎంజైములపై ప్రభావం చూపి హెపటోప్రొటెక్టివ్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది.
- ఇది అల్జీమర్స్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

మండుతున్న ఎండలవేళ.. ఈ జాగ్రత్తలు తీసుకోండి

- ఎండలు ముదురుతున్నాయి. ఉక్కపోతా పెరిగింది. ఈ సమయంలో బయటకు వెళ్లాలంటే.. కాటన్ దుస్తులు ధరించటంతోపాటు గొడుగుతో వెళ్లటం మంచిది.
- కూలింగ్ గ్లాసెస్ (కళ్లజోడు) వాడాలి.
- వదులుగా ఉండే దుస్తుల ఎంపిక మంచిది.
- వేసవిలో జీన్స్, లెగ్గింగ్స్, టైట్ ప్యాంట్లు అసౌకర్యం కలిగిస్తాయి. చెమట వల్ల చర్మ సంబంధ సమస్యలూ రావొచ్చు.
- మహిళలు ధరించేందుకు వీలుగా అన్ని రకాల వస్త్రాల్లోనూ చేనేతవి లభిస్తున్నాయి. వాటిని ఎంచుకోవడం మేలు. సింథటిక్, పాలిస్టరు వస్త్రాలను పూర్తిగా దూరం పెట్టటం మంచిది.
- మంచినీళ్లు ఎక్కువగా తాగాలి.

ఈ జాగ్రత్తలు పాటిస్తే.. వేసవి ఇబ్బందులను కొంతమేర తగ్గించుకోవచ్చు.

కష్టపడండి.. విజయం మనదే..!

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందనీ, బీజేపీ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని చెప్పారు. నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు కలిసికట్టుగా పనిచేయడం ద్వారా అభ్యర్థి విజయానికి కృషిచేయాలన్నారు. పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల అమలుతో ప్రజల్లో సానుభూతి పెరిగిందనీ, వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ బాధ్యులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో టీఎస్ఐఐసీ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, పఠాన్ చెరు, నర్సాపూర్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గ బాధ్యులు కాటా శ్రీనివాస్ గౌడ్, రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజాల హరికష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాషాయీకరణ ఆపండి!

(మొదటిపేజీ తరువాయి)



ఇండియన్ నావల్ అకాడమీల్లో ప్రవేశం పొందేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో ఈ సైనిక్ స్కూళు చాలా ముఖ్యమైన భూమిక వహిస్తున్నాయి. ఈ సైనిక్ స్కూళ్ల నుండి ఉత్తీర్ణులై బయటకు వచ్చిన విద్యార్థులు గణనీయ సంఖ్యలో దేశ రక్షణ బలగాల్లో ఉన్నత బాధ్యతలు చేపట్టినవారున్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విధానం కేవలం ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో నిధుల సమీకరణ, మౌలిక సదుపాయాల కల్పనలో పరస్పర పంచుకోవడానికి మాత్రమే పరిమితం కాదు, ఎస్ఎస్ఎస్‌తో కుదుర్చుకుంటున్న ఒప్పందాల్లో గణనీయమైన సంఖ్యలో ఆర్ఎస్ఎస్, బీజేపీతో సంబంధాలున్న సంస్థలను కూడా ప్రభుత్వం చేర్చుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ప్రభుత్వ ఈ చర్యను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. విద్య కాషాయీకరణను ఈ స్కూళ్లపై రుద్దడం వల్ల మన సైనిక వ్యవస్థల్లో ఉన్నత లౌకిక ప్రమాణాలపై దాని ప్రభావం పడే ప్రమాదం వుందని పొలిట్‌బ్యూరో హెచ్చరించింది. సైనిక పాఠశాలల జాతీయ, లౌకిక స్వభావాన్ని పరిరక్షించేందుకు గాను ప్రభుత్వం తక్షణమే ఈ చర్యను ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది.

పదేండ్లు అధికారంలో మీరే కదా!

(మొదటిపేజీ తరువాయి)

విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాజ్ ఠాగూర్‌తో కలిసి శ్రీధర్‌బాబు విలేకర్లతో మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్‌లో పడాల్సిన వర్షాలు పడలేదని తెలిపారు. ఆ సమయంలో బీఆర్ఎస్ సర్కారు అధికారంలో ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి నీటి నిర్వహణ చేసేసామర్థ్యం లేదనడం సరైంది కాదన్నారు. కేసీఆర్ హయాంలో ప్రతి రైతుకు అన్యాయం జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ధాన్యం కొనుగోలు కోసం ఐకెపీ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఒక్క గింజ వదిలిపెట్టకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కష్టపడుతున్నట్టు తెలిపారు. రుణమాఫీ కూడా చేస్తామని అన్నారు. బీఆర్ఎస్ ఆర్థికవ్యవస్థను అతలాకుతలం చేసిందనీ, దాన్ని ప్రణాళికాబద్ధంగా సరిదిద్దుతున్నట్టు పేర్కొన్నారు. కేటీఆర్ నోటీసులు ఇచ్చుకుంటే ఇచ్చుకో అని ఎద్దేవా చేశారు. తాము పద్ధతి ప్రకారం పని చేస్తామన్నారు. మిషన్ భగీరథ తప్పుడు స్కీమ్ అని, తాము తెచ్చిన తాగునీటి వ్యవస్థను కొనసాగించ కుండా కేసీఆర్ ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందని విమర్శించారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ చదువుకున్న విద్యావంతుడని చెప్పారు. వెంకటస్వామిని ఆదర్శంగా తీసుకుని ఆయన రాజకీయాల్లోకి వస్తున్నారని చెప్పారు. ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని పెద్దపల్లి ప్రజలను కోరారు.

ఏడిపిస్తున్న ఎర్ర బంగారం

(మొదటిపేజీ తరువాయి)

27 లక్షలా 5 వేల బస్తాలు నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. అందులో ఇప్పటికే 25 లక్షల పైచిలుకు బస్తాలు నిల్వ చేసుకున్నారు అయితే గతేడాది ప్రారంభంలో కోల్డ్ స్టోరేజీలో ఉన్న మిర్చికి అనూహ్యంగా ధరలు పలకడంతో రైతులు, ట్రేడర్లు పెద్ద సంఖ్యలో అంటే దాదాపు 7 లక్షల బస్తాలకు పైగా మిర్చిని విక్రయించకుండా కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. ఈ ఏడాది గతేడాది కంటే ధరలు తగ్గడంతో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉన్న మిర్చిని రైతులు, ట్రేడర్లు అమ్మలేకపోయారు. దాంతో కోల్డ్ స్టోరేజీల్లో పెట్టేందుకు సామర్థ్యానికి మించి బస్తాలు వస్తుండటంతో స్థలం లేక రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది.

ఎగుమతులు లేవని ధరలు తగ్గిస్తున్న వ్యాపారులు..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన మిర్చిని వ్యాపారులు చైనా, వియత్నాం, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మలేషియా తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. కానీ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా లేవని వ్యాపారులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా ఎగుమతులు లేకపోవడానికి ప్రధాన కారణం కేంద్రం అనుసరించిన విధానమేనని తెలుస్తోంది. దాన్ని సాకుగా చూపి వ్యాపారులు ధరలు మరింత తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని మిర్చి రైతుకు గిట్టుబాటు ధర అందే విధంగా చూడాలని వేడుకుంటున్నారు.

పెట్టుబడి ఖర్చులు పెరిగాయి :



కొత్తూరి రవీందర్, రైతు మొగుళ్ళపల్లి

35 బస్తాల మిర్చిని మార్కెట్‌కు తీసుకువచ్చిన.. ధర రూ.13,700 పలికింది. గత సంవత్సరంతో పోలిస్తే ధరలు చాలా తగ్గాయి. పెట్టుబడి ఖర్చులు చాలా పెరిగాయి. ఎకరానికి ఖర్చు లక్ష రూపాయల వరకు వచ్చింది. ఈసారి కనీసం పెట్టుబడి కూడా రాలేదు.

కూలీల చార్జీలు కూడా రావడం లేదు : తోరికారి, రైతు అంకిస, సిరివంచ, మహారాష్ట్ర



దీపికా రకం మిర్చిని 20 బస్తాలు తీసుకువచ్చా. గతేడాది రూ.30వేలు ఉన్న ధర ప్రస్తుతం రూ.10వేలు మాత్రమే పలుకుతోంది. నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేశా. కౌలుకు ఎకరానికి లక్ష రూపాయలు, పెట్టుబడి చార్జీలు మొత్తం కలిపి ఎకరానికి రూ.2.5 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చయింది. మా ప్రాంతంలో లేబర్ కొరత ఉండటంతో ఛత్తీస్‌గఢ్ నుండి కూలీలను తీసుకురావడం వల్ల అధిక భారం పడింది.

కేజ్రీవాల్‌ను ఇరికించటమే ఈడీ టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్రయించారు. ఈ పిటిషన్ ను బుధవారం జస్టిస్ స్వర్ణకాంత శర్మతో కూడిన ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. దాదాపు మూడు గంటల పాటు ఈడీ, కేజ్రీవాల్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. కేజ్రీవాల్ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, విక్రమ్ చౌదరీలు, ఈడీ తరపు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీరాజు లు వాదనలు వినిపించారు. ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ ను అవమానించడానికి, నైరాశ్య పరచడానికి అరెస్ట్ చేశారని కోర్టుకు వివరించారు. ఎన్నికలు జరిగే సమయంలో కేజ్రీవాల్ అరెస్ట్ సరికాదన్నారు. ఈ కేసు ఎన్నికల సమయ సమస్యలతో కూడుకున్నదని వివరించారు. అందువల్ల కేజ్రీవాల్ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనలేరని, ఎన్నికలకు ముందే పార్టీని కూల్చివేయడానికి జరుగుతున్న ప్రయత్నంగా ఆరోపించారు. ఈ కేసులో కేజ్రీవాల్ కి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవన్నారు. మాగుంట రాఘవ, శరత్ రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి మొదట ఇచ్చిన స్టేట్‌మెంట్ లలో కేజ్రీవాల్ గురించి వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. ఇందులో మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో ఒక పార్టీ అభ్యర్థిగా ఉన్నారని, శరత్ చంద్రా రెడ్డి బీజేపీకి ఎలక్టోరల్ బాండ్స్ కొన్నారని కోర్టుకు నివేదించారు. ఈడీ పూర్తిగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని చెప్పారు. మాగుంట రాఘవ మొదట ఇచ్చిన వాంగ్మూలాలు బయట పెట్టకపోవడం ఇందులో భాగమని పేర్కొన్నారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇచ్చేంత వరకు స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేస్తూనే ఉంటామని ఈడీ చెప్పిందని సింఘ్వి వాదించారు. ఈ రెండేండ్ల పాటు జరిపిన దర్యాప్తులో ఈడీ ఏమి కనుగొనలేకపోయిందని, ఈ స్టేట్‌మెంట్‌లలో కూడా ఏమీ లేదని అన్నారు.

లంచ్ బ్రేక్ తర్వాత ఈడీ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. చట్టం ముందు సీఎం అయినా, ఏవరైనా ఒక్కటే అన్నారు. కేజ్రీవాల్ తన అరెస్ట్ పై సవాల్ చేస్తూ బెయిల్ కోరారని, ఆ ప్రక్రియ ముగిసి ప్రస్తుతం జ్యూడిషియల్ కస్టడీలో ఉన్నారని గుర్తు చేశారు. లిక్కర్ స్కాంలో కేజ్రీవాల్ కింగ్ పిన్ గా ఉన్నారని మరోసారి ఆరోపించారు. కేజ్రీవాల్ తన పార్టీ పేరును తెలివిగా ఆమ్ ఆద్మీ అని పెట్టుకున్నారని అన్నారు. ఆమ్ ఆద్మీ (సామాన్య వ్యక్తి) నేరం చేస్తే కటకటాల్లోకి వెళ్లాలన్నారు. కానీ సీఎం అయినందున అరెస్ట్ చేయకూడదనడం సరికాదన్నారు. మీరు దేశాన్ని దోచుకోవచ్చు, కానీ ఎన్నికలు వస్తున్నాయని ఎవరు మిమ్మల్ని ముట్టుకోవద్దని అంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ పిటిషన్ పై ఇరువైపు వాదనలను ముగించినట్లు పేర్కొన్న జస్టిస్ స్వర్ణకాంత శర్మ... తీర్పు రిజర్వ్ చేస్తున్నట్టు వెల్లడించారు.

ప్రమాదంలో కేజ్రీవాల్ ఆరోగ్యం

ఢిల్లీ మంత్రి, ఆప్ కీలక నాయకురాలు అతిషి.. జైలులో ఉన్న ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యంపై సమాచారాన్ని వెల్లడించారు. కేజ్రీవాల్ అరెస్టయినప్పటి నుంచి ఆయన దాదాపు 4.5 కిలోల బరువు తగ్గారని అతిషి 'ఎక్స్' వేదికగా ఒక పోస్టులో పేర్కొన్నారు. బీజేపీ.. ఆప్ అధినేతను జైలులో పెట్టడం ద్వారా ఆయన ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో మార్చి 22న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన విషయం విదితమే. ఢిల్లీ కోర్టు తీర్పు మేరకు కేజ్రీవాల్‌ను ఏప్రిల్ 15 వరకు జ్యుడీషియల్ కస్టడీకి తరలించిన తర్వాత సోమవారం తీహార్ జైలుకు తరలించారు.

కేజ్రీవాల్ తీవ్రమైన మధుమేహ వ్యాధిగ్రస్తుడనీ, ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ దేశానికి సేవ చేసేందుకు 24 గంటలు పని చేసేవారని అతిషి తన పోస్ట్‌లో వివరించారు. అరవింద్ కేజ్రీవాల్‌కు ఏదైనా జరిగితే దేవుడు కూడా బీజేపీని క్షమించడని పేర్కొన్నారు. "అరవింద్ కేజ్రీవాల్ తీవ్రమైన మధుమేహ వ్యాధిగ్రస్తులు. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ, అతను రోజుకు 24 గంటలు పని చేస్తూ దేశానికి సేవ చేసేవాడు. అరెస్టు చేసినప్పటి నుంచి అరవింద్ కేజ్రీవాల్ 4.5 కిలోల బరువు తగ్గాడు. ఇది చాలా ఆందోళన కలిగిస్తున్నది. ఈ రోజు బీజేపీ కేజ్రీవాల్‌ను జైలులో పెట్టటం ద్వారా ఆయన ఆరోగ్యం ప్రమాదంలో పడింది. కేజ్రీవాల్‌కు ఏదైనా జరిగితే.. దేశం మొత్తాన్ని మరచిపోండి, దేవుడు కూడా బీజేపీని క్షమించడు" అని అతిషి హిందీలో తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

కేజ్రీవాల్ ఆరోగ్యంపై అతిషి చేసిన ఆరోపణలను తీహార్ జైలు అధికారులు ఖండించారు. ఢిల్లీ సీఎం ఆరోగ్యం సాధారణంగానే ఉన్నదని తీహార్ జైలు వర్గాలు తెలిపాయి. అరవింద్ కేజ్రీవాల్ షుగర్ లెవెల్ తక్కువగా ఉన్నదని, షుగర్ లెవల్స్ హెచ్చుతగ్గులకు లోనవుతున్నందున జైలు వైద్యుల పర్యవేక్షణలో ఉంచామని వివరించాయి. ఆప్ చీఫ్ తన సెల్‌లో యోగా, మెడిటేషన్ చేశారనీ, బుధవారం ఉదయం తన బ్యారక్‌లో నడిచారని తెలిపాయి. అతని సెల్‌లోని సీసీటీవీ కెమెరాల ద్వారా 24 గంటల నిఘా ఉంచారు. జైలు నంబర్ 2 లోపల ఉన్న కేజ్రీవాల్ మంగళవారం కూడా ఆయన భార్య సునీతా కేజ్రీవాల్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తీహార్ జైలులో తన న్యాయవాదిని కలిశారు. జైలు లోపల ఇంట్లో వండిన ఆహారాన్ని కేజ్రీవాల్‌కు అనుమతించినట్టు ఒక అధికారి తెలిపారు.

తైవాన్‌లో తీవ్ర భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నిస్తున్నాయి. పలు చోట్ల పెద్ద మొత్తంలో కొండచరియలు విరిగిపడ్డాయి. సబ్‌వే వ్యవస్థను మొత్తంగా ఖాళీ చేయించారు. హులెన్ నగరానికి సమీపంలో గల సొరంగాల్లో చిక్కుకున్న 70 మందిని కాపాడామని అగ్నిమాపక అధికారులు తెలిపారు. భూకంపం ధాటికి దక్షిణ జపాన్, ఫిలిప్పీన్స్‌లో సునామీ హెచ్చరికలను తొలుత జారీ చేశారు. ఆ తర్వాత కాసేపటికే ఉపసంహరించుకున్నారు. చైనా దక్షిణ ప్రావిన్స్ అయిన ఫ్యుజియాన్‌లో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నాయని చైనా ప్రభుత్వ మీడియా తెలిపింది. తైపేలో ఇప్పటివరకు 50కి పైగా ప్రకంపనలు సంభవించాయి.

వయనాడ్ నుంచి రాహుల్ నామినేషన్

(మొదటిపేజీ తరువాయి)

దీపాదాస్ మున్షీలతో సహా ఇతర పార్టీ సీనియర్ నేతలతో కలిసి రిటర్నింగ్ అధికారి అయిన వయనాడ్ జిల్లా కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్‌కు ముందు రాహుల్ వయనాడ్‌లో రోడ్ షో నిర్వహించగా భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మరోవైపు ఇదే స్థానం నుంచి రాహుల్ పై పోటీ చేస్తున్న సీపీఐ నేత రాజా సతీమణి అన్నిరాజా కూడా నామినేషన్ వేశారు. ఇక్కడ బీజేపీ తరఫున కేకే సురేంద్రన్ పోటీ చేస్తున్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికలకు రెండో దశ ఓటింగ్‌లో భాగంగా వయనాడ్‌లో ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది.

మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుకు కస్టడీ

(మొదటిపేజీ తరువాయి)

తదుపరి విచారణ కోసం ఏడు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇస్తూ.. నాంపల్లి కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. గురువారం 4వ తేదీ నుంచి పదో తేదీ వరకు రాధాకిషన్ రావును ఈ కేసు దర్యాప్తు జరుపుతున్న పంజాగుట్ట స్పెషల్ టీం పోలీసులకు కస్టడీకి ఇస్తూ.. న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు. కాగా ఇతన్ని పదిరోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని దర్యాప్తు అధికారులు కోరారు. దీంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ప్రభాకర్ రావుతో సమానంగా రాధాకిషన్‌రావు వ్యవహరించి నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే రాధాకిషన్‌రావు తాను ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే ప్రతిపక్షాలకు చెందిన నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేసి ఉపఎన్నికల సమయంలో వారి వాహనాల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు సీజ్ చేసినట్టు అంగీకరించాడు. అయితే ఈ ఫోన్ ట్యాపింగ్ ఆదేశాల వెనుక అప్పటి అధికార పక్షానికి చెందిన కీలక నాయకులు రాధాకిషన్ రావుకి ఆదేశాలిచ్చారని వస్తున్న ఆరోపణలపై ఈ కస్టడీ సమయంలో దర్యాప్తు అధికారులు కూలకషంగా దర్యాప్తు చేసే అవకాశముంది. మరోవైపు ఈ కేసులో అనుమానితుడైన మరో రిటైర్డ్ అదనపు ఎస్పీ వేణుగోపాల్ రావుని బుధవారం దర్యాప్తు అధికారులు నోటీసులిచ్చి పిలవడంతో ఆయన విచారణకు హాజరయ్యాడు. ఉదయం నుంచి రాత్రి వరకు వేణుగోపాల్ రావు విచారణ కొనసాగినట్టు తెలిసింది. అధికార పక్షానికి అనుకూలంగా విపక్ష నాయకులకు చెందిన ఫోన్ ట్యాఫింగ్ చేసి వారి కదిలికలపై నిఘా వేయడానికి ప్రభాకర్ రావు ఏర్పాటు చేసిన ఎస్ఐఈబీ స్పెషల్ టీంలో వేణుగోపాల్ రావు కూడా ఒక సభ్యుడని ఇప్పటికే అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నల విచారణలో వెలుగుచూసింది. దీంతో ఈయనను కూడా అధికారులు క్షుణంగా విచారిస్తున్నట్టు తెలిసింది. ఈయనను కూడా ప్రత్యేక టీం అధికారులు అరెస్టు చేసే అవకాశముందని సమాచారం.

ఎన్‌కౌంటర్‌లో 13 మంది మావోయిస్టు మృతి

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధి లేంద్ర దండకారణ్యంలో మంగళవారం సుమారు 12 గంటల పాటు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులతో సహా మొత్తం 13 మంది మావోయిస్టులు మృతి చెందారు. మంగళవారం 10 మంది మృతదేహాలు లభ్యం కాగా బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగిన సంఘటనా స్థలంలో గాలింపు చర్యలు చేపట్టగా మరో మూడు మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతి చెందిన మావోయిస్టుల్లో ఎక్కువమంది పీఎల్‌జీఏ రెండవ నెంబర్ బెటాలియన్‌కి చెందిన వారే ఉన్నారని ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు.

28న బంగ్లాదేశ్ పర్యటనకు
భారత మహిళలు




ముంబయి: ఈనెల 28న భారత మహిళలజట్టు బంగ్లాదేశ్ పర్యటనకు బయల్దేరి వెళ్లనుంది. ఈ పర్యటనలో భాగంగా టీమిండియా జట్టు బంగ్లాతో ఐదు టి20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌ను భారత-బంగ్లాదేశ్ క్రికెటర్ బోర్డులు అధికారికంగా ధృవీకరించాయి. 28, 30, మే 9న సిల్హెట్ వేదికలో జరిగే మ్యాచ్‌లు ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరగనున్నట్లు బంగ్లాబోర్డు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సిల్హెట్ వేదికగా 28న జరిగే తొలి మ్యాచ్‌లో ఈ సిరీస్ ప్రారంభమౌతుందని.. మే 9న అదే వేదికలో జరిగే చివరి మ్యాచ్‌తో సిరీస్ ముగియనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపింది.

షెడ్యూల్...

ఏప్రిల్ 28 : తొలి టి20(సిల్హెట్)
ఏప్రిల్ 30 : రెండో టి20(సిల్హెట్)
మే 2 : మూడో టి20(సిల్హెట్ ఔటర్)
మే 6 : నాల్గో టి20(సిల్హెట్ ఔటర్)
మే 9 : ఐదో టి20(సిల్హెట్)

ఐపీఎల్‌లో కోల్‌కతా రికార్డు స్కోర్

నరైన్, రఘువంశీ అర్ధసెంచరీలు | నైట్‌రైడర్స్ 272/7



విశాఖపట్నం : ఎసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు ఢిల్లీపై రికార్డు స్కోర్‌ను నమోదు చేసింది. ఐపిఎల్ చరిత్రలో రెండో అత్యుత్తమ స్కోర్‌తోపాటు కోల్‌కతా జట్టు తరఫున అత్యుత్తమ స్కోర్‌ను నమోదు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాకు శుభారంభం దక్కింది. సాల్ట్-నరైన్ కలిసి తొలి వికెట్‌కు 4.3ఓవర్లలో 60పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత సాల్ట్ వ్యక్తిగత స్కోర్ 18 పరుగుల వద్ద నోర్జే బౌలింగ్‌లో ఔటైనా.. నరైన్ బ్యాట్ ఝుళిపించడం మానలేదు. కేవలం 39బంతుల్లో 7ఫోర్లు, మరో 7 భారీ సిక్సర్ల సాయంతో 85పరుగులు నమోదు చేశాడు. రఘువంశీ కూడా అర్ధసెంచరీతో మెరవడంతో కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 272పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్లు తొలి నుంచే సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెలరేగారు. దొరికిన బంతిని దొరికనట్లు స్టాండ్స్‌లోకి పంపారు. ఢిల్లీ బౌలర్లను ఊచకోత కొనసాగించారు. దాంతో, వైజాగ్‌లో అత్యధిక సిక్సర్ల(15) రికార్డు కొట్టుకుపోయింది. మొదట ఓపెనర్ సునీల్ నరైన్(85) హాఫ్ సెంచరీతో చెలరేగగా అరంగేట్ర కుర్రాడు అంగ్‌క్రిష్ రాఘువంశీ(54) ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కోల్‌కతా బ్యాటర్ల వీరబాదుడు చూశాక ఐపీఎల్ రికార్డు స్కోర్ 277 బద్ధలవుతుంది అనిపించింది. కానీ, ఢిల్లీ బౌలర్లు చివర్లో అద్భుతంగా కోల్‌కతా హిట్టర్లను కట్టడి చేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న కోల్‌కతాకు ఓపెనర్లు ఫిలిఫ్ సాల్ట్(15), నరైన్(85)లు శుభారంభమిచ్చారు. ఇషాంత్ శర్మ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌తో నరైన్ పరుగుల వేట మొదలెట్టాడు. బౌలర్లు మారినా.. బంతి లక్ష్యం బౌండరీయే అన్నట్టు చెలరేగాడు. దాంతో, స్కోర్‌బోర్డు రాకెట్ వేగంతో పరుగులు తీసింది. చివర్లో ఆండ్రూ రస్సెల్(41), శ్రేయస్ అయ్యర్(18) విధ్వంసాన్ని కొనసాగిస్తూ.. కోల్‌కతా స్కోర్ 230 దాటించారు. ప్రారంభంలో కాస్త నెమ్మదిగా ఆడారు. అయితే, 4వ ఓవర్ లో సునీల్ నరైన్ సునామీ మొదలైంది. ఇషాంత్ శర్మ బౌలింగ్‌లో వరుసగా బౌండరీలు బాదాడు. చివర్లో రింకు సింగ్ వరుసగా 6, 6, 4, 0, 6, 4 బ్యాట్ ఝుళిపించి 26 పరుగులు రాబట్టాడు. సునీల్ నరైన్ సూపర్ ఇన్నింగ్స్‌తో కేవలం 8ఓవర్లలోనే కోల్‌కతా 100 పరుగుల మార్కును అందుకుంది. రింకూ సింగ్(26) సిక్సర్లతో రెచ్చిపోవడంతో అయ్యర్ సేన భారీ స్కోర్ బాదింది. ఢిల్లీ బౌలర్లలో నోర్జేకు మూడు, ఇషాన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు...

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: ఫిల్ సాల్ట్ (సి)స్టబ్స్ (బి)నోర్జే 18, నరైన్ (సి)పంత్ (బి)మిచెల్ మార్ష్ 85, రఘువంశీ (సి)ఇషాన్ (బి)నోర్జే 54, రస్సెల్ (బి)ఇషాంత్ 41, శ్రేయస్ (సి)మిచెల్ మార్ష్ (బి)ఖలీల్ అహ్మద్ 18, రింకు సింగ్ (సి)వార్నర్ (బి)నోర్జే 26, వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 5, రమణ్‌దీప్ సింగ్ (సి)పృథ్వీ షా (బి)ఇషాంత్ 2, మిచెల్ స్టార్క్ (నాటౌట్) 1, అదనం 22. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 272పరుగులు.

వికెట్ల పతనం: 1/60, 2/164, 3/176, 4/232, 5/264, 6/264, 7/266

బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 4-0-43-1, ఇషాంత్ శర్మ 3-0-43-2, నోర్జే 4-0-59-3, రసిక్ సలామ్ 3-0-47-0, సుమిత్ కుమార్ 2-0-19-0, అక్షర్ పటేల్ 1-0-18-0, మిచెల్ మార్ష్ 3-0-37-1.



రెండోటెస్ట్‌లోనూ లంక గెలుపు

బంగ్లాతో టెస్ట్ సిరీస్ 2-0 క్లీన్‌స్వీప్



ఢాకా: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో, చివరి టెస్ట్‌లోనూ శ్రీలంక జట్టు గెలిచి సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 7 వికెట్ల నష్టానికి 268పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ జట్టు లంక పేసర్లు లహిరు కుమార, కమింద్ మెండిస్‌ల ధాటికి 318 పరుగులకే ఆలౌటయ్యింది. దీంతో రెండోటెస్ట్‌లో శ్రీలంక జట్టు 192 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో సెంచరీలు బాదిన కమిందు మెండిస్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లు కుశాల్ మెండిస్(93), కమిందు మెండిస్(92), ధనంజయ డిసిల్వా(70), కరుణరత్నే(86), నిశాన్ మధుశనక(57)లు రాణించారు.

స్కోర్లు..

శ్రీలంక : 531, 157/7డిక్లేర్డ్ **బంగ్లాదేశ్ :** 178, 318

ఐపీఎల్‌కు శివమ్ మావి దూరం

గాయంతో వైదొలిగిన లక్నో పేసర్

లక్నో: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17కు లక్నో యువ పేసర్ శివమ్ మావి దూరమయ్యాడు. గాయం కారణంగా ఈ స్పీడ్‌స్టర్ సీజన్ నుంచి వైదొలిగాడు. ఈ విషయాన్ని బుధవారం లక్నో ఫ్రాంచైజీ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'గాయాల నుంచి కోలుకుని జట్టుతో కలిశాను. కానీ, మళ్లీ గాయపడ్డాడు. దాంతో, సీజన్ మొత్తానికి దూరమవుతున్నా... త్వరలోనే ఫిట్‌నెస్ సాధించి మళ్లీ మీ ముందుకు వస్తా' అని మావి తెలిపాడు. పదిహేడో సీజన్ మినీ వేలంలో రూ.6.4 కోట్లు పలికిన శివం మావి.. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇక లక్నో పేస్ యూనిట్‌లో షమర్ జోసెఫ్, యశ్ ఠాకూర్, మయాంక్ యాదవ్, స్టోయినిస్‌లు ఉన్నారు. ఐపిఎల్‌లో ప్లే ఆఫ్స్ గండం దాటలేకపోయిన లక్నో జట్టు ఈసారి అదరగొడుతోంది. మయాంక్ యాదవ్ సంచలన బౌలింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థుల వెన్నులో వణుకుపుట్టిస్తుండగా.. బ్యాటింగ్‌లో నికోలస్ పూరన్, క్వింటన్ డికాక్‌లు బాదేస్తున్నారు. ఈ సీజన్‌లో లక్నో జట్టు ఆడిన మూడు మ్యాచుల్లో రెండు గెలిచి ఒక మ్యాచ్‌లో ఓటమిపాలైంది.

మయాంక్ నాణ్యమైన పేసర్ : రబడా

టీమిండియాకు మరో నాణ్యమైన పేసర్ దొరికాడని దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడా పేర్కొన్నాడు. ఐపిఎల్‌లో సత్తా చాటుతున్న 21ఏళ్ల ఢిల్లీకి చెందిన మయాంక్ యాదవ్ టి20 ప్రపంచకప్ టీమిండియా జట్టులో తప్పకుండా చోటు కల్పించాలని సెలెక్టర్లకు ఓ సలహా ఇచ్చాడు. ఐపిఎల్‌లో లక్నో తరఫున ఆడుతున్న



మయాంక్ యాదవ్ మంగళవారం నిప్పులు చెరిగే బంతులతో బెంగళూరు బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. దీంతో బెంగళూరుపై లక్నో జట్టు 28పరుగుల తేడాతో గెలిచింది. అతడు 4ఓవర్లలో కోటాలో కేవలం 14పరుగులిచ్చి మూడు ప్రధాన వికెట్లు పడగొట్టాడు. ఇదే క్రమంలో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ప్రి క్వార్టర్స్‌లో ఓడిన నాగల్



రాబట్(మొరాకో): ఇక్కడ జరుగుతున్న ఎటిపి-250 మర్రకెచ్ ఓపెన్‌లో భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నాగల్ పోరాటం ప్రి క్వార్టర్స్‌లో ముగిసింది. బుధవారం జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీలో నాగల్ మూడుసెట్ల హోరాహోరీ పోరులో ఓటమిపాలయ్యాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ 6-1, 3-6, 4-6తో ఇటలీకి చెందిన సొనేగో చేతిలో ఓడాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సుమిత్ 95వ స్థానంలో ఉండగా.. 6.3అంగుళాల పొడగరి అయిన ఇటలీకి చెందిన సొనేగో టాప్-20 ప్లేయర్. ఇక పురుషుల డబుల్స్‌లో యుకీ బాంబ్రీ-అల్బానో(ఫ్రాన్స్) జంట 3-6, 4-6తో నెదర్లాండ్స్ జంట చేతిలో వరుససెట్లలో ఓడారు.



రెట్టింపు వినోదం ఖాయం

అంజలి నటించిన 'గీతాంజలి' ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రం మీద అందరి దృష్టి పడింది. ఈ చిత్రాన్ని శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవివి సినిమాస్‌తో కలిసి కోన ఫిల్మ్ కార్పొరేషన్‌పై కోన వెంకట్ నిర్మించారు. అంజలికి ఇది 50వ చిత్రం. హర్రర్ కామెడీ జోనర్‌లో భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని ఈనెల 11న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు శివ తుర్లపాటి మాట్లాడుతూ, 'ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుంది. సినిమా అంతకు మించి ఉంటుంది. అందరి సపోర్ట్‌తో ఇక్కడి వరకు చేరుకున్నాం. సినిమా కచ్చితంగా అందర్నీ అలరిస్తుంది' అని తెలిపారు.

"గీతాంజలి' మాకెంతో స్పెషల్ మూవీ. ఇది ఇంకా చాలా స్పెషల్ మూవీ. ఎందుకంటే ఇది అంజలికి 50వ సినిమా. ఆమెను అభినందించాల్సిందే. ఓ తెలుగు అమ్మాయి 50 సినిమాలు చేయడటమంటే గొప్ప విషయం. ఈ సినిమాను నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లింది మాత్రం భాను, నందు. సామజవరగమన, భైరవకోన సినిమాలకు వాళ్లు వర్క్ చేశారు. ఈ స్క్రిప్ట్‌లో కీలక పాత్రను పోషించారు. కథను నేనిచ్చినా వాళ్లు దాన్ని 10 మెట్లు ముందుకు తీసుకెళ్లారు. ప్రవీణ్ లక్కరాజుని జూనియర్ తమన్ అని పిలుస్తుంటాం. మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఛోటా కె.ప్రసాద్ చాలా కీలక పాత్రను పోషించాడు. డైరెక్టర్ శివకి ఇదొక బెస్ట్ మూవీ అవుతుంది. ట్రైలర్‌లో చూసింది కొంతే.. సినిమా ధమ్ బిర్యానీలా ఉంటుంది' అని సమర్పకుడు కోన వెంకట్ అన్నారు.

'గీతాంజలి మళ్ళీ వచ్చింది' ట్రైలర్ చాలా బాగా వచ్చింది. సినిమా దీని కంటే వంద రెట్లు బావుంటుంది. నా 50వ సినిమా ఎంతో స్పెషల్‌గా ఉండాలని అనుకున్నాను. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది. ఈ సినిమా కోసం స్పెషల్ సాంగ్ కూడా చిత్రీకరించాం. త్వరలోనే దాన్ని రిలీజ్ చేస్తాం. కామెడీ, హర్రర్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసి చేసిన సినిమా ఇది' అని అంజలి అన్నారు.

అందరికీ గుర్తుండిపోయే జితేందర్‌రెడ్డి

ముదుగంటి క్రియేషన్స్ పై విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'.

రాకేష్ వర్రె లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమా 1980 కాలంలో జరిగిన వాస్తవిక సంఘటనలు ఆధారంగా పొలిటికల్ డ్రామాగా తెరకెక్కింది. రియా సుమన్, చత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాష్ ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. బుధవారం ఈ చిత్ర గ్లింప్స్ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది.


విరించి వర్మ, రాకేష్ వర్రె, రవీందర్‌రెడ్డి

ఈ సందర్భంగా నిర్మాత ముదుగంటి రవీందర్ రెడ్డి, 'జితేందర్ రెడ్డి జీవితం ఒక చరిత్ర. ఫ్యామిలీ ఓరియెంటెడ్ మూవీస్ చేసిన విరించి ఈ జితేందర్ రెడ్డి గురించి తెలుసుకుని, డైరెక్ట్ చేస్తానని ముందుకు రావడం చాలా ఆనందంగా అనిపిం చింది. అలాగే జితేందర్ రెడ్డిగా రాకేష్ పాత్రలో జీవించారు. ఈ సినిమా తర్వాత జితేందర్ రెడ్డిగా గుర్తింపు తెచ్చుకుంటారు అంత అద్భుతంగా నటించారు. ఈ సినిమా రిలీజ్ తర్వాత ప్రతి ఒక్కరికి జితేందర్ రెడ్డి పాత్రతో పాటు ఆయన చేసిన సేవ గుర్తుండిపోతుంది. భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు లాంటి వాళ్ళ చరిత్ర తెలుసుకోవడం ఎంత ముఖ్యమో జితేందర్ రెడ్డి గురించి కూడా తెలుసుకోవడం కూడా అలాంటిదే. కచ్చితంగా ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

'క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మొదలై 'మిర్చి, బాహుబలి' సినిమాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యాను. 'ఎవరికీ చెప్పొద్దు' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాను. ప్రొడ్యూసర్ రవీందర్ రెడ్డి తన అన్న జితేందర్ రెడ్డి కథని ప్రజలకు చెప్పాలనుకునే తాపత్రయం నాకు బాగా నచ్చింది. జితేందర్‌రెడ్డి పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్నాను' అని హీరో రాకేష్ వర్రె చెప్పారు. దర్శకుడు విరించి వర్మ మాట్లాడుతూ, 'నేను గతంలో చేసిన రెండు సినిమాలు లవ్ స్టోరీస్, మంచి హ్యూమర్ ఉన్న సినిమాలు. శేఖర్ నాకు కాల్ చేసి ఒక కథ ఉంది, డైరెక్ట్ చేయాలి అని చెప్పారు. కథ వినడానికి వెళ్ళినప్పుడు ఒక బుక్ ఇచ్చి చదువుకోమన్నారు. అది చదివిన తర్వాత ఇంత పవర్ఫుల్ క్యారెక్టర్ నేనే డైరెక్ట్ చేయాలి అనుకున్నాను. ఒక మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను' అని తెలిపారు.

నవచిత్రం

మరో కల్ట్ లవ్‌స్టోరీ మొదలైంది


ఎస్తేర్ అనిల్, విక్రమ్ సహిదేవ్, సందీప్ కిషన్

డైరెక్టర్ త్రినాధ రావు తన బ్యానర్ నక్కిన నేరేటివ్స్‌లో ప్రొడక్షన్ నెం 2ను అనౌన్స్ చేశారు. ఆంధ్రా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో విక్రమ్ సహిదేవ్ లగడపాటి హీరోగా నటిస్తుండగా, వంశీ కృష్ణ మళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్.వి.ఎస్.ఎస్. సురేష్ సహ నిర్మాత. ఈ సినిమా బుధవారం గ్రాండ్‌గా లాంచింగ్ వేడుకను జరుపుకుంది. త్రినాథరావు,నాయుడు దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ముహూర్తం షాట్‌కు సందీప్ కిషన్ క్లాప్ కొట్టగా, శరత్ మరార్ కెమెరా స్విచాన్ చేశారు. సుమంత్ తొలి షాట్‌కి గౌరవ దర్శకత్వం వహించారు.

విక్రమ్ సహిదేవ్ లగడపాటి సరసన హీరోయిన్‌గా 'దృశ్యం' చిత్రంలో వెంకటేష్ కుమార్తెగా కనిపించిన ఎస్తేర్ అనిల్ నటిస్తుండగా, తారక్ పొన్నప్ప కీలక పాత్రలో కనిపించనున్నారు.

త్రినాధరావు నక్కిన మాట్లాడుతూ,'ఇది కల్ట్ లవ్‌స్టోరీ. టౌన్‌లో జరిగే అందమైన ప్రేమకథ. ఇందులో విలన్ పాత్ర కూడా చాలా కీలకమైనది. కథ అద్భుతంగా వచ్చింది. నాతో పాటు నరేష్, ఉదయ్ భాగవతుల స్క్రీన్ ప్లేలో, నరేష్, రాజేంద్ర ప్రసాద్ డైలాగ్స్‌లో పని చేశారు. దర్శకుడు వంశీ సినిమా కోసం చాలా కష్టపడుతున్నాడు. ఇందులో విక్రమ్ పాత్ర అదిరిపోతుంది. విక్రమ్‌కి జోడిగా ఎస్తర్ చేస్తున్నారు' అని తెలిపారు.



ఫ్యామిలీస్‌కి వేసవి కానుకగా ఇస్తున్న చిత్రం

హీరో విజయ్ దేవరకొండ, నిర్మాత దిల్ రాజు, డైరెక్టర్ పరశురామ్ పెట్ల కాంబినేషన్‌లో రూపొందిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఘనంగా జరిగింది. దూలపల్లి మైసమ్మగూడలోని నరసింహారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ ప్రీ రిలీజ్ వేడుకలకు పెద్ద సంఖ్యలో స్టూడెంట్స్, విజయ్ ఫ్యాన్స్ హాజరయ్యారు. ఈనెల 5న వరల్డ్ వైడ్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న ఈ సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని మూవీ టీమ్ వ్యక్తం చేసింది.దర్శకుడు పరశురామ్ పెట్ల మాట్లాడుతూ, 'ఈ సినిమా మీ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది. పిల్లలు, పెద్దలు అందరూ ఈ సినిమాను ఇష్టపడతారు. ఈ కథలోని ఎమోషన్స్‌కు కనెక్ట్ అవుతారు. నేను, విజయ్ గీత గోవిందం సినిమా చేశాం. మళ్లీ మేము కలిసి సినిమా చేస్తున్నామంటే అది గుర్తుండిపోయే మూవీ కావాలని అనుకున్నాను. అలాంటి సినిమా చేసేందుకే ప్రయత్నించాను. విజయ్ ఈ కథ విన్నప్పుడు పడిన ఎగ్జైట్‌మెంట్, ఇందులో తను చేసిన గోవర్ధన్ క్యారెక్టర్ కోసం ప్రిపేర్ అయిన విధానం రేపు స్క్రీన్ మీద చూస్తారు. ఇందు క్యారెక్టర్‌ను మృణాల్ అద్భుతంగా పోషించింది' అని తెలిపారు.

> ఆరేండ్ల కిందట నా కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ 'గీత గోవిందం' ఇదే డైరెక్టర్‌తో చేశాను. పరశురామ్ నాకు ఈ కథ చెప్పినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చాడు. ఆయన మా ఫ్యామిలీ స్టార్. ప్రతి ఫ్యామిలీలో స్టార్ ఉంటాడు. ఆ స్టార్ ఫ్యామిలీ స్టార్. ఫ్యామిలీ స్టార్ లాంటి సినిమా నాకు దక్కడం అదృష్టం.
>
> - విజయ్ దేవరకొండ

'మన ఫ్యామిలీస్‌లోని ఎమోషన్స్ అన్నీ కలిపి తయారు చేసిన సినిమా ఇది. ఈ సినిమా మీ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. ఈ సినిమాలో విజయ్ క్యారెక్టర్ హైలైట్ అవుతుంది. అతను నవ్విస్తాడు, ఫైట్స్ చేస్తాడు, కోపం వస్తే కొట్టమని హీరోయిన్‌తో దెబ్బలు తింటాడు. ఫ్యామిలీ స్టార్ చూశాక అమ్మాయిలకైతే విజయ్ క్యారెక్టర్ చాలా నచ్చుతుంది. మృణాల్ లక్కీ హీరోయిన్. సీతా రామం, హాయ్ నాన్న తర్వాత ఫ్యామిలీ స్టార్‌తో హ్యాట్రిక్ అందుకోబోతోంది' అని నిర్మాత దిల్ రాజు చెప్పారు. హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ, 'ఇవాళ ఎంతో ప్రత్యేకమైన రోజు. చాలా హ్యాపీ ఫీలింగ్ కలుగుతోంది. నన్ను మీరంతా తెలుగు అమ్మాయిగా యాక్సెప్ట్ చేశారు. మీ ఆదరణ, ప్రేమకు ధన్యవాదాలు' అని చెప్పారు.

మెప్పించే ఎంటర్‌టైనర్

సూర్య తేజ హీరోగా పరిచయం అవుతూ నటించిన చిత్రం 'భరతనాట్యం'. 'దొరసాని' ఫేమ్ కెవిఆర్ మహేంద్ర దర్శకత్వం వహించారు. పిఆర్ ఫిలింస్ పతాకంపై పాయల్ సరాఫ్ నిర్మించారు. మీనాక్షి గోస్వామి కథానాయిక. వేసవి కానుకగా ఈనెల 5న విడుదలకు కానుంది. ఈ నేపథ్యంలో హీరో సూర్య తేజ ఏలే మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.


సూర్య తేజ ఏలే

- మా నాన్న (ధని ఏలే) సినీ పరిశ్రమలో పాతికేళ్ళుగా పబ్లిసిటీ డిజైనర్‌గా పని చేస్తున్నారు. నేను పెయిటింగ్‌లో ఫైన్ ఆర్ట్స్, మాస్టర్స్ చేశాను. సినిమా టైటిల్స్ రాస్తుంటాను. డిజైనింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉంది. కోవిడ్ తర్వాత రైటింగ్ లోకి వచ్చాను. నేను హీరో కావాలని అనుకోలేదు. డైరెక్షన్ చేయాలనే ఆసక్తి ఉండేది. ఈ క్రమంలో రచనపై ఆసక్తి ఏర్పడటంతో కథలు రాసుకున్నాను. ఈ కథల్ని పలువురికి నెరేట్ చేస్తూ స్ట్రగులింగ్‌లో ఉన్న సమయంలో హితేష్‌కి నేను చెప్పిన కథ నచ్చింది. తర్వాత దర్శకుడు కెవిఆర్ మహేంద్రకి కథ చెప్పాను. ఆయనకీ నచ్చింది.
- కథ రాసినప్పుడు నేను హీరోగా చేస్తానని అనుకోలేదు. నిజానికి ఇందులో నా పాత్ర ఏ కొత్త నటుడు చేసినా బాగుంటుంది. వినయ్ వర్మ దగ్గర యాక్టింగ్ కోర్స్ చేశాను. ఏడాది పాటు అన్నపూర్ణలో ఫిల్మ్ కోర్స్ చేశాను. అజయ్ ఘోష్, టెంపర్ వంశీ, వైవా హర్ష పాత్రలు రాసినప్పుడే వారినే అనుకున్నాను. వారి పాత్రలు చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. డీవోపీ వెంకట్ చాలా అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. వివేక్ సాగర్ రావడంతో సినిమా స్కేల్ మరింతగా పెరిగింది. ఇది ఫిక్షనల్ స్టోరీ. కానీ రియల్ లైఫ్‌తో రిలేట్ చేసుకునేలా ఉంటుంది. ఒక మనిషి షార్ట్ కట్‌లో వెళితే ఏం జరుగుతుందనేది ఈ సినిమా పాయింట్. పర్శనల్‌గా ఫీలైన స్ట్రగుల్స్‌ని కామికల్‌గా చేసి రాశాను. కమర్షియల్‌గా చాలా మంచి ఎంటర్‌టైనర్.
- ఈ కథకు 'భరతనాట్యం' పర్ఫెక్ట్ టైటిల్. అది ఎలా అనేది సినిమా చూస్తున్నప్పుడు తెలుస్తుంది. ఇందులో అన్ని పాత్రలు సమానంగా ఉంటాయి. హీరోయిన్ పాత్ర మాత్రం కథలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది ఫ్యామిలీ అంతా కలసి చూసేలా ఉంటుంది.
- నిర్మాతలు హితేష్ పాయల్ ఇచ్చిన సపోర్ట్ మర్చిపోలేను. ఎక్కడా రాజీపడకుండా మంచి ప్యాడింగ్, ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మించారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. వివేక్ సాగర్ ట్రెండీ ఆర్ఆర్ ఇచ్చారు. ఈ స్కేల్ సినిమా తీసినందుకు చాలా ఆనందంగా ఉంది. ఫస్ట్ కాపీ చూసిన తర్వాత ఈ సినిమా విషయంలో మా నాన్న చాలా ఆనందంగా ఉన్నారు. ఈ సినిమాని అందరూ ఆదరిస్తారనే నమ్మకంతో ఉన్నాం.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.